BALA CHELIMI

BALA

₹40

అగస్టు – 2026

PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 35 • సంచిక : 11

AUGUST - 2026



*A golden moment in football history as Spain lifts the FIFA World Cup 2026 trophy*

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY**, HYDERABAD, TELANGANA

AUG | AUG 2026

₹40

ఆగస్టు - 2026

PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 35 • సంచిక : 11

AUGUST - 2026



*A golden moment in football history as Spain lifts the FIFA World Cup 2026 trophy*

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA



## AUGUST 2026

Little hearts, big smiles. A heart warming celebration of friendship, festivity and togetherness, where every smile, giggle and shared moment reflected the true joy of childhood.


Oxford
Grammar High School

#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com


ogs FOUNDATIONAL STAGE

45 YEARS OF MERITORIOUS PERFORMANCE

| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |
| 30 | 31 | | | | | |

**Important Dates**

15 Aug - Independence Day
21 Aug - Varalakshmi Vratham
26 Aug - Milad un-Nabi
28 Aug - Raksha Bandhan

NOTES :


**Dream big, learn passionately, achieve greatly.**

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

సంపుటి: Volume: 35 | సంచిక : Issue : 11 | హైదరాబాద్ Hyderabad | ఆగస్టు August | పేజీలు Pages 52 | రూ. ₹. 40

















లోపలి పేజీల్లో.......



నివారించలేని వాతావరణ ఘటన ఎల్‌నినో.... ....... మణికొండ వేదకుమార్ .. ....... 5
సమాజ శ్రేయస్సే శాస్త్ర విజ్ఞానం లక్ష్యమన్న రసాయన శాస్త్రవేత్త ప్రఫుల్ల చంద్ర రే (సైంటిస్ట్) జుగాష్‌విలి ....... 6
దాగుడు మూతలు (బలవంతపు అదృశ్యాల బాధితుల అంతర్జాతీయ దినోత్సవం)....... డా. నీరజ అమరవాది ....... 7
పాడి (పాట)... ....... గంగదేవు యాదయ్య ....... 8
రీనా షా ....... షీరోస్-256 ....... 9
అటు చదివితే ఒకటి - ఇటు చదివితే మరోటి (అక్షరం) ....... చొక్కాపు వెంకటరమణ....... 10
కాలుష్యాన్ని జయించిన పిల్లలు (కథ) ....... చిలివేరి కరుణ ....... 11
బాల్యపు హేల (పాట)... ....... రేడియమ్....... 12
భారత స్వాతంత్ర్య ఉద్యమం - కీలక ఘట్టాలు ....... బాలచెలిమి డెస్క్....... 13
కళకు విరమణ లేదు... కూరెళ్ళ శ్రీనివాస్‌కు ఘనాభినందనం ....... ....... 13
ఖోఖో (ఆట).. ....... చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు .... 14
బంగారు మర్రి - 15 (సీరియల్) ....... పైడిమర్రి రామకృష్ణ ....... 15
పదాల మేడ-3 (ఫజిల్)....... మాదారపు వాణిశ్రీ....... 16
తలవని మేలు (కథ) ....... డా. పోతగాని సత్యనారాయణ....... 17
దుష్టుల సాన్నిహిత్యం మంచిది కాదు ....... పంచతంత్ర కథ....... 18
తెలంగాణ చారిత్రక పర్యాటకం ఆలయాలు ....... దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి...... 19
కాశీకావడి గమత్తు (సైన్స్) ....... డాక్టర్ మహీధర నళినీ మోహన్....... 20
భారత్ మాతాకీ జై (లఘునాటిక)....... డా. సమ్మెట విజయ....... 21
నేటికీ ఆశ్చర్యంగా మిగిలిపోయిన జార్జ్ గ్రీన్ వైజ్ఞానిక కృషి (సైన్స్ వెన్నెల-22)....... డా. నాగసూరి వేణుగోపాల్....... 23
పెరటిలోని ఔషధ మొక్కలు ....... 'ఆరోగ్యం-విజ్ఞానం' పుస్తకం నుండి.. ...... 24
ఇరికి చెట్టు (చెట్టు - చేమ) ....... కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి ....... 25
కొత్త కరెన్సీ (కార్టూన్) ....... జుగాష్ విలి ....... 26
స్పెయిన్ విశ్వవిజేత (స్పోర్ట్స్)....... బాలచెలిమి డెస్క్....... 28
పిచ్చుకకు గుణపాఠం (కథ)....... ఆర్. సి. కృష్ణస్వామి రాజు ....... 29
వేమన పద్యం....... ....... 30
అన్నదమ్ములు (అనువాద కథ)....... అనిల్ బత్తుల ....... 31
సామెతలు ....... బాలచెలిమి డెస్క్....... 32

| | | |
|---|---|---|
| తొందరపాటు (కథ) | కె. మహేశ్వరి | 33 |
| ఆచార్య నాగార్జునుడి తెలివి పరీక్ష (చరిత్ర కథలు - 2)... | బాల కథా సౌరభం | 34 |
| విష్ణుకుండులు - రెండో మాధవవర్మ (చరిత్ర పాఠాలు-17) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 35 |
| నేర్చుకుందామా | | 36 |
| కలం-చెలిమి | | 36 |
| అవయవ దానం (కథ) | యం. రోషిణి | 37 |
| ముందే ఊహించిన సంఖ్య 1 (మాథ్స్ ట్రిక్స్) | అంకెల మామయ్య చంద్రయ్య | 38 |
| చెలిమి క్లబ్. | బాలచెలిమి డెస్క్ | 38 |
| AI రోబోటిక్స్ - రేపటి ప్రపంచంలో రోబోట్ల రాజ్యం (విద్య) | లత | 39 |
| వేమన విజ్ఞాన కేంద్రంలో బాలచెలిమి సంపాదకులు వేదకుమార్ మణికొండకు సాహితీ మిత్రుల ఆత్మీయ సత్కారం... | మల్లారపు నాగార్జున | 40 |
| నక్క మరియు వేటగాడు (పిల్లల కథల్లో సైన్స్-7) | కె శ్రీకృష్ణ సాయి | 41 |
| పద్మ పురస్కారాలు - 2026 (జి.కె.) | బాలచెలిమి డెస్క్ | 43 |
| మాయ కర్ర (కథ)... | శివ కృతిక | 45 |
| అడవుల తోటమాలి 'మలయన్ టాపిర్' (నేచర్) | సచిన్ కోత్వాల్ | 46 |
| మూడు కూరగాయల కథ (కథ)... | జి. మనీషా | 47 |
| బాల చెలిమి గ్రంథాలయం విద్యార్థుల సృజనాత్మక వికాసానికి చిరునామా | ప్రవీణ్ శర్మ | 48 |
| సమాచారం | బాలచెలిమి డెస్క్ | 49 |
| గానకోకిల ఎస్. జానకి స్వరమాధుర్యానికి ప్రతిరూపం (వ్యక్తిత్వం) | సువేగా | 50 |

## ప్రియమైన బాలచెలిమి మిత్రులారా!

మీ అందరికీ ప్రేమతో నమస్కారం.

మీరు పంపిస్తున్న కథలు, కవితలు, చిత్రాలు, పొడుపుకథలు, శాస్త్రీయ విశేషాలు, పుస్తక సమీక్షలు మాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయి. ప్రతి సంచికను మరింత అందంగా తీర్చిదిద్దడంలో మీ భాగస్వామ్యం అమూల్యం.

వేసవి సెలవులు ముగిసి కొత్త విద్యా సంవత్సరంలో అడుగుపెట్టిన మీ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రతిరోజూ కొంత సమయం మంచి పుస్తకాలు చదవడానికి, ప్రకృతిని పరిశీలించడానికి, కొత్త విషయాలు నేర్చుకోవడానికి కేటాయించండి. చదువుతో పాటు ఆటలు, కళలు, మంచి అలవాట్లు కూడా జీవితంలో ఎంతో ముఖ్యమైనవి.

మీ పాఠశాలలో జరిగే విశేషాలు, మీ సృజనాత్మక రచనలు, చిత్రలేఖనాలు, విజ్ఞాన ప్రయోగాలు మాకు పంపండి. ఎంపికైన రచనలు బాలచెలిమిలో ప్రచురించబడతాయి.

మీ అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకుంటూ...

మీ

**- వేదకుమార్ మణికొండ**

సంపాదకులు, బాలచెలిమి


*Cover Picture :*

**FIFA WORLD CUP 2026**

**SPAIN**

**WORLD CHAMPIONS**

*బొమ్మలు:*

**కూరెళ్ల శ్రీనివాస్,**

m : 98495 43728





**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI

**"CHANDRAM"** 3-6-712/2, St. No. 12,

Himayatnagar, Hyderabad - 500 029.

e-mail : edit. chelimi@gmail. com, www. balachelimi. com

Mob: 98480 44713

# నివారించలేని వాతావరణ సంఘటన ఎల్‌నినో

పిల్లలూ...

ఈ మధ్య వార్తా పత్రికల్లోనూ, టీవీల్లోనూ ఎల్‌నినో గురించి, దాని ప్రభావాల గురించి తరచుగా చూస్తున్నాం.

ఎల్‌నినో పూర్తిగా నివారించలేని ప్రకృతి విపత్తు.

పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య మరియు తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటె ఎక్కువ వేడెక్కే ఒక వాతావరణ సంఘటన ఎల్‌నినో. దీనికి స్పానిష్ భాషలో 'చిన్న బాలుడు' లేదా 'క్రైస్ట్ చైల్డ్' అని అర్థం. రెండు నుంచి ఏడు సంవత్సరాలకొకసారి యిది సంభవిస్తుంది.

సాధారణ పరిస్థితుల్లో తూర్పు నుంచి పడమర దిశగా వీచే ట్రేడ్ గాలులు పసిఫిక్ సముద్ర జలాలను ఆసియా వైపు నెడతాయి. కొన్ని సందర్భాలలో ఈ గాలులు బలహీనపడటంతో సముద్ర జలాలు వేడెక్కుతాయి. ఇదే ఎల్‌నినో స్థితి. ఈ స్థితి వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు ప్రభావాలను చూపిస్తుంది.

మనకు నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం వుంది. దీనివల్ల వర్షపాతం తగ్గుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. తీవ్రమైన వడగాలులు వీస్తాయి. ఉక్కపోత పెరుగుతుంది. వర్షాభావం వల్ల ఆహార ఉత్పత్తి తగ్గి ఆహార ధరలు పెరుగుతాయి. వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది. పెరూ, ఇతర దక్షిణ అమెరికా దేశాల్లో అత్యధిక వర్షపాతం వల్ల తుఫానులు, వరదలు సంభవిస్తాయి. ఎల్‌నినో అతివృష్టి, అనావృష్టికి కారణమవుతుంది. నదులు, సరస్సుల్లో నీటి నిల్వలు తగ్గుతాయి. భూగర్భ జలాలు తగ్గుతాయి. లక్షలాది మంది ప్రజలు తాగు నీటి కొరతను ఎదుర్కొంటారు. జల విద్యుత్ కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో పని చేయలేని పరిస్థితి వస్తుంది. తీవ్రమైన వాతావరణ మార్పుల వల్ల రవాణా వ్యవస్థకు ఆటంకాలు ఎదురవుతాయి. వాతావరణ సంబంధింత వ్యాధులు, ఉష్ణోగ్రత వ్యాధులు, సంక్రమణ వ్యాధులు, పోషకాహార లోపాల వల్ల పిల్లలలో, వృద్ధులలో ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి. పర్యావరణ వ్యవస్థల్లో విపరీత వైపరీత్యాలు సంభవిస్తాయి.

2026–2027లో అత్యంత తీవ్రమైన సూపర్ ఎల్‌నినో సంభవించే అవకాశం ఉందని, చరిత్రలో యిదే అతి పెద్దది అవుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీని ప్రభావాలను తగ్గించడానికి, దానిని ఎదుర్కోవడానికి ముందస్తు చర్యలు తీసుకోవడం తప్ప మరో మార్గం లేదు.

వాతావరణ కేంద్రాల ఏర్పాటు, సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రతలు, సముద్రనీటి మట్టం మార్పులను పర్యవేక్షించడం, ఉపగ్రహాల ద్వారా నిరంతర పర్యవేక్షణ, డేటా విశ్లేషణ, అంచనా వంటి విధులను నిబద్ధతలో నిర్వహించాలి. సాంకేతిక మెరుగుదలలు, నైపుణ్యాలను అభివృద్ధి చేయాలి.

ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, ప్రజలు సమన్వయంతో, నిబద్ధతతో కృషి చేయడం ద్వారా ఈ ప్రమాదాలను కొంత వరకు తగ్గించగలం.

మీ

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి






# సమాజ శ్రేయస్సే శాస్త్ర విజ్ఞానం లక్ష్యమన్న రసాయన శాస్త్రవేత్త ప్రఫుల్ల చంద్ర రే

భారతీయ ఔషధ పరిశ్రమకు ఆద్యుడు, స్వదేశీ పరిశ్రమల అభివృద్ధికి మార్గదర్శి, ఆధునిక రసాయన శాస్త్రానికి బలమైన పునాదులు వేసిన ప్రముఖ శాస్త్రవేత్త, విద్యావేత్త, పారిశ్రామిక వేత్త, గొప్ప దేశభక్తుడు ప్రఫుల్ల చంద్ర రే.

ప్రఫుల్ల చంద్ర రే 1861 ఆగస్ట్ 2న ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని ఖుల్నా జిల్లాలో రారులి కటిపాగా అనే గ్రామంలో జన్మించారు. తండ్రి హరీష్ చంద్రరాయ్ ఒక జమీందార్. తల్లి భుభన్మోహిని దేవి బ్రహ్మ సమాజ ప్రభావం వున్న కుటుంబంలో పెరిగారు. బాల్యంలోనే సంస్కృతం, ఇంగ్లీష్, బెంగాళీతో పాటు లాటిన్, గ్రీకు వంటి భాషల్లో విస్తృత పాండిత్యం సంపాదించారు. చిన్నతనంలో చదువుకంటే ప్రకృతి మధ్య గడపటం, చెట్లెక్కి పుస్తకాలు చదవడం, సాహిత్యం పట్ల ఆసక్తి చూపడం ఎక్కువగా చేసేవారు.



ప్రాథమిక విద్యను స్వగ్రామం లోని పాఠశాలలోనే అభ్యసించారు. కోలకతా విశ్వవిద్యాలయం నుంచి ఎఫ్.ఎ. పూర్తి చేసిన తరువాత గిల్‌క్రిస్ట్ స్కాలర్‌షిప్ ద్వారా స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బరో విశ్వవిద్యాలయానికి వెళ్ళి బీఎస్సీ, డిఎస్సీ పట్టాలను పొందారు. 1988లో భారత దేశానికి తిరిగి వచ్చి ప్రముఖ శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్‌తో కలిసి పరిశోధనలు చేసారు. 1889లో కోలకతా ప్రెసిడెన్సీ కళాశాలలో రసాయన శాస్త్ర సహాయ ఆచార్యుడిగా నియమితులయ్యారు. రసాయన శాస్త్రంలో మెర్క్యూరస్ నైట్రేట్ అనే కొత్త స్థిర సమ్మేళనాలపై ఆయన చేసిన పరిశోధనలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఈయన ఉత్తమ ఉపాధ్యాయుడు కూడా. ప్రముఖ శాస్త్రవేత్తలు మేఘనాథ్ సాహా, శాంతి స్వరూప్ భట్నాగర్ ఈయన శిష్యులే.

భారతదేశ అభివృద్ధికి పరిశ్రమలే ప్రధాన బలమని ప్రఫుల్ల చంద్రరే గట్టిగా నమ్మేవారు. తక్కువ వనరులతో తన ఇంటి నుంచే ఒక చిన్న రసాయన పరిశ్రమను ప్రారంభించారు. ఇది 1901లో బెంగాల్ కెమికల్ అండ్ ఫార్మాస్యూటికల్ వర్క్స్ లిమిటెడ్ స్థాపనకు దారి తీసింది. ఇది భారత దేశపు తొలి స్వదేశీ రసాయన, ఔషధ పరిశ్రమగా చరిత్రలో నిలిచింది. 1916 తర్వాత కోల్‌కతా విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాలలో రసాయన శాస్త్ర ప్రొఫెసర్‌గా పని చేసారు. 1921లో తన 60వ ఏట మిగిలిన ఉద్యోగ కాలానికి వచ్చే మొత్తం జీతాన్ని రసాయన శాస్త్ర విభాగం అభివృద్ధికి, పరిశోధన ఫెలోషిప్‌ల ఏర్పాటుకు విరాళంగా యిచ్చారు.

హిందూ రసాయన చరిత్ర (A History of Hindu Chemistry from earliest times to the middle of the Sixteenth Century) అనే గ్రంథాన్ని రచించారు. వేదకాలం నుంచి మధ్య యుగం వరకు భారతీయ రసాయన శాస్త్ర సంప్రదాయాన్ని శాస్త్రీయంగా విశ్లేషించారు.

1944 జూన్ 16న తన 83వ ఏట మరణించారు. శాస్త్ర విజ్ఞానాన్ని సమాజ సంక్షేమానికి వినియోగించాలనే ఆయన ఆశయం నేటికీ శాస్త్రవేత్తలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

– జుగాష్‌విలి

బాలచెలిమి డెస్క్, m : 83094 52998

బలవంతపు అదృశ్యాల బాధితుల అంతర్జాతీయ దినోత్సవం

## INTERNATIONAL DAY OF THE VICTIMS OF ENFORCED DISAPPEARNECES
## 30 AUGUST



# దాగుడు మూతలు

హాయ్! చిన్నారులూ ఒక పక్క పుస్తకాలతో, మరో పక్క మీకు ఇష్టమైన ఆటపాటలతో బిజీగా ఉన్నారా. దొంగ–పోలీస్, దాగుడు మూతలు, 'Hide and seek' లాంటి ఆటలు ఆడుకున్నారా. చిన్నప్పుడు నేను కూడా ఆడుకున్నాను. ఒకరు కళ్లు మూసి వీరి వీరి గుమ్మడి పండు, వీరి పేరేమి అంటూ, పాటలాగా పాడేవారు. పేరు తప్పుగా చెబితే వాళ్లు దాక్కునే వాళ్లు. అలానే చంటి పిల్లల కళ్లు మూసి 'దో బుచి' అంటూ రకరకాలుగా దాక్కునే ఆటలు ఆడుతాం. కాని అలా దాక్కున్న పిల్లలు కనబడకపోతే, ఎక్కడికి వెళ్లారో, ఎవరు తీసికెళ్లారో, ఏమైపోయారో తెలియక పోతే ఎంత భయం వేస్తుంది. మీరు ఒంటరిగా బయటికి వెళ్లాల్సి వస్తే అమ్మకో, నాన్నకో చెప్తారుగా. మీరు చెప్పిన సమయానికి రాకపోతే వాళ్లు ఎంతో కంగారు పడుతూ, మీ స్నేహితులను మీ గురించి అడగడం లాంటి సందర్భం మనలో అందరికీ ఎపుడో ఒకసారి ఎదురైయ్యే ఉంటుంది. ఇప్పుడు ఇదంతా ఎందుకు అనుకుంటున్నారా. మనం అప్పుడప్పుడు పిల్లలు, పెద్దలు కలబడడం లేదనీ, ఎవరైనా కిడ్నాప్ చేసి ఉండచ్చని భావిస్తున్నామని టి. విలలో, దినపత్రికలలో చూస్తూ ఉంటాం. వాళ్లు మళ్లీ కనబడ్డారా, ఏమైపోయారో ఎవరికీ తెలియదు. చాలా సార్లు అంతుపట్టని విషయంగా మిగిలిపోతోంది.

"Under international human rights law, families and societies have a right to know the truth about what happened". **–Antonio Guterres**

చాలా సందర్భాలలో అభంశుభం తెలియని చిన్నారులు, మానసిక వైకల్యంతో బాధపడుతున్న బాలలు తరచుగా కనబడకుండాపోతున్నారు. అప్పటి వరకు ఇంటి ముందు ఆడుకుంటున్న పిల్లలు మాయమైపోతే, కన్నవారి బాధ వర్ణనాతీతం. ఐక్యరాజ్య సమితి లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 85 దేశాలలో లక్షలాది మంది ఆచూకీ తెలియకుండా మాయమైపోతున్నారు. సంబంధిత అధికారులు, పోలీసులు వెతికినా ఫలితం ఉండడం లేదు. అంటే బలవంతంగా అదృశ్యమైపోతున్నారు. వీరిని వెతకటానికి, రక్షించడానికి 2011 నుండి యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ఆగస్టు 30వ తేదీని బలవంతపు అదృశ్యాల బాధితుల అంతర్జాతీయ దినోత్సవం(International day of the victims of enforced disappearneces) గా ప్రకటించింది. ఈ రోజు ముఖ్య ఉద్దేశం ఎవరినైనా బలవంతంగా ఎత్తుకు పోవడమనేది తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన అని తెలియజేయడం. బలవంతంగా అరెస్టు, నిర్బంధం, కిడ్నాప్ అయిన వ్యక్తుల స్వేచ్ఛ గురించి ప్రజలలో అవగాహనను కలిగించడం. బాధితులకు సరైన న్యాయం చేయడానికి ఐక్యరాజ్యసమితి నియమించిన ప్రాంతీయ మానవహక్కుల నిపుణులు ఆయా రాష్ట్రాలతో కలిసి పని చేస్తారు. దాని వల్ల అన్ని స్థాయిలలో న్యాయం అందరికీ అందేలా చూడవచ్చు. నేరస్థులు సరైన జవాబుదారీ తనం వహించేలా చేయవచ్చు. ఒక సర్వే ప్రకారం అపహరించిన చిన్నారులను బాలకార్మికులుగా, బిచ్చగాళ్లుగా

మారుస్తున్నారు. అవయవాల కోసం, మూఢ నమ్మకాలతో దేవతలకు బలి ఇవ్వడం కోసం కూడా అపహరిస్తున్నారు. పిల్లలను రక్షించే బాధ్యత సమాజంలోని అందరి పై ఆధారపడి ఉంటుంది.

మన ఇంటి పరిసరాలలో ఎవరైనా కొత్తవారు కనిపిస్తే వారి కదలికలపై నిఘా పెట్టాలి. పిల్లలూ మీరు ఎక్కడికైనా వినోదయాత్రలకు వెళ్లేటప్పుడు అన్నీ సోషల్ మీడియాలో ఉంచద్దు. అలాగే ఆన్‌లైన్ గేమ్‌లలో ఎక్కువ సమయాన్ని గడపకూడదు. ఆన్‌లైన్‌లో స్నేహం, ప్రేమ పేరుతో బాలబాలిలను ఇంటి దొంగలుగా మారుస్తూ, ఇల్లు వదిలి వచ్చేట్లు చేస్తున్నారు. తరువాత బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. అడిగిన డబ్బు ఇవ్వకపోతే ప్రాణాలు తీయడానికి కూడా వెనుకాడడం లేదు. పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కొత్తవారితో ఎలా జాగ్రత్తగా ఉండాలో వివరించాలి. తక్షణ సహాయం కోసం ఎలా స్పందించాలో నేర్పించాలి. బాలబాలికలందరికి చదువుతో పాటు స్వీయ రక్షణ విద్యలైన కర్రసాము, కరాటే లాంటివాటిలో తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాలి.

"Children are the worldµs most valuable resource and its best hope for the future".

– డా. నీరజ అమరవాది
m : 9849160055

పాట

# పాడి



నల్లటి బర్రె.. తెల్లటి ఆవు
పచ్చటి గడ్డి.. తెల్లటి కుడితీ
సన్నటి తౌడు.. గంపెడు దాణా
రాత్రి.. పగలూ.. మేపూ.. మేపూ..
చిక్కటి పాలూ.. పిండూ.. పిండూ..
చెంబెడు పాలు.. పిండూ.. పిండూ..
బుడ్డెడు పాలు.. కాయి.. కాయి..
కాటిన పాలూ.. దింపూ.. దింపూ..
దింపిన పాలూ.. వంపూ.. వంపూ..
తియ్యటి బెల్లం.. కలుపూ.. కలుపూ..
పచ్చటి బెల్లం.. కలుపూ.. కలుపూ..
మెల్లగ మెల్లగ.. తాగూ.. తాగూ..
కండల బలమూ.. పెంచూ.. పెంచూ..
ఎగిరీ దుంకీ.. ఆడూ.. ఆడూ..
ఎగిరీ పడితే.. పాడూ.. పాడూ..

– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105


చందదారులుగా చేరండి! బాలచెలిమి చందదారులను చేర్పించండి!

'యం. వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వాహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

SCAN & PAY

**మా చిరునామా :**
BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St. No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk. chelimi@gmail. com,
www. balachelimi. com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సంll లకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 3010101003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

# రీనా షా

## ఆంక్షల ఉల్లంఘన, విజయాల అధిరోహణ

భారత దేశంలో అతి కొద్ది మంది పోలో క్రీడాకారులలో వైవిధ్యభరిత, విజయవంతమైన కెరీర్ గల రీనా షా ఒకరు. అనుకోకుండా దొరికిన అవకాశాన్ని ఆమె వినియోగించుకుని 39 ఏళ్ల వయసులో పోలో పోటీ ప్రపంచంలోకి అడుగు పెట్టారు. ఒకసారి ఆమె పోలో ఆటకు హాజరైనప్పుడు అక్కడ గుర్రపు స్వారీకి, ఆటలోని సవాళ్లకు ముగ్ధురాలు అయ్యారు. దాంతో పోలో ఆడటం ప్రారంభించి, చివరికి పోటీలలో హుషారుగా పాల్గొన్నారు.

ఆకట్టుకునే పోలో ఆటతీరుతో ఉమైద్ భవన్ పోలో కప్, అంతర్జాతీయ మహిళా టోర్నమెంట్ లాంటి ప్రతిష్ఠాత్మక పోటీలలో ఆమె పాల్గొన్నారు. ముఖ్యంగా, 2015వ సంవత్సరంలో జోధ్‌పూర్‌లో జరిగిన హెర్మెస్ కప్ పోటీలో, 2017లో ది ట్రంక్స్ కంపెనీ నిర్వహించిన పోలో కప్ పోటీలో పాల్గొని ఆమె విజయం సాధించారు.

ప్రతిష్ఠాత్మక పోలో కెరీర్‌తో పాటు తన పాదరక్షల బ్రాండ్ 'రినాల్డి డిజైన్స్' తో కూడా రీనా ప్రసిద్ధి చెందారు. ఈ బ్రాండ్ మార్కెట్‌లో ఎంతో ప్రజాదరణ పొందింది. పోలో క్రీడ విస్తరించడం లక్ష్యంగా ఆమె చేసిన కృషి మరింత మంది మహిళలు ఈ క్రీడలో పాల్గొనేలా ప్రేరేపించింది. పోలో ప్రపంచంలో పురోగమిస్తూనే, లింగ పర అడ్డంకులు బద్దలు కొట్టి, పోలో క్రీడా ప్రపంచంలో తనదైన చెరగని ముద్ర ఆమె వేశారు.

– 'షీరోస్-256
ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....




### మీకు తెలుసా?

రీనా షా బహుముఖ ప్రజ్ఞాశాలి- ఆమె పోలో క్రీడాకారిణి మాత్రమే కాదు, వ్యాపారవేత్త, షూ డిజైనర్, డ్రమ్మర్, డీజే కూడా.

# అక్షరాలతో ఆటలు



## అటు చదివితే ఒకటి - ఇటు చదివితే మరోటి!

ఈ పదాలు అటు నుంచి చదివితే ఒకలా ఉంటాయి.
ఇటు నుంచి చదివితే వేరేలా ఉంటాయి

పాట - టపా
తల - లత
పంచె - చెంప
కలం - లంక
డంక - కండ
తుంగ - గంతు
కడప - పడక



ముసుక - కనుము
కరపు - పురక
రమ - మర
రాసి - సిరా
నంది - దినం
పంపా - పాపం
గంప - పంగ
పడగ - గడప
చురక - కరచు
కలప - పలక
గురక - కరగు

- చొక్కాపు వెంకటరమణ
రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
(తానా 'తెలుగు తేజం' పుస్తకం నుండి... )
m: 92465 20050

కథ



# కాలుష్యాన్ని జయించిన పిల్లలు

ఒక చిన్న ఊర్లో మేఘన అనే పాప ఉండేది తాను ఏడవ తరగతి చదువుతోంది. చదువులో, ఆటల్లో చురుకుగా ఉండేది. తన చుట్టూ ఉన్న చెట్లు, పక్షులు, జంతువులను చూస్తూ వాటితో స్నేహంగా ఉండేది. తన చుట్టూ ఉన్న చెట్ల ఆకులు ఎండిపోయిన బాధపడేది. మూగజీవులను జీవ హింస చేసిన, ఆకలితో, అనారోగ్యంతో అవి చనిపోయిన వాటి గురించి ఆలోచిస్తూ ఏడిచేది. ఆ కారణంగా సైన్స్ టీచర్ తరగతి గదిలో చెప్పిన పర్యావరణ రక్షణ విలువల గురించి ఎప్పుడు ఆలోచించేది.

ఒక రోజు పాఠశాలలో టీచర్ "మన భూమి వేడెక్కుతోంది. కాలుష్యం పెరిగిపోతోంది. మనం జాగ్రత్త పడకపోతే భవిష్యత్‌లో నీరు, గాలి, నేల కలుషితం అవుతాయి" అని చెప్పగా ఆ సమస్యలను తగ్గించడానికి తనవంతుగా ఏదైనా చేయగలనా అని మేఘనకు ఆలోచన మొదలైంది. "నేను చిన్నపాపనే, కానీ నేను ఏమైనా చేయలేనట్టేనా? ప్రకృతిని రక్షించేందుకు ఏదైనా మార్గం వెతకాలి," అనుకుంది.

తరువాతి రోజు మేఘన తన మిత్రులతో కలిసి "పచ్చదనం క్లబ్" ఏర్పాటు చేసింది. ప్రతి ఒక్కరు ఇంట్లో నుంచి ప్లాస్టిక్ వాడకం తగ్గించి వస్త్ర సంచులు తెచ్చుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఊరిలోని చెరువులో చేపలు చనిపోతున్నాయి, దానికి

కారణం దగ్గరలోని ఫ్యాక్టరీ నుంచి వచ్చిన రసాయన వ్యర్థాలు. మేఘన తన మిత్రులతో కలిసి ఆ ఫ్యాక్టరీ దగ్గరకు వెళ్లి యజమానితో "మీరు ఈ నీటిని కలుషితం చేస్తే, మేము పక్షులు, చేపలు, మొక్కలను కోల్పోతాము. మా అందరి కూడా ఆరోగ్యం దెబ్బ తింటుంది. దయచేసి శుద్ధి కేంద్రం పెట్టండి," అని చెప్పారు.

మొదట యజమాని నిర్లక్ష్యం చేశాడు. కానీ పిల్లలు సైన్స్ టీచర్ సహాయంతో ఒక చిన్న మోడల్ తయారు చేశారు. అది వ్యర్థజలాలను శుద్ధి చేసి మళ్లీ వాడే యంత్రం. ఆ మోడల్‌ను చేయడానికి గల కారణం పర్యావరణ శాఖకు తెలియజేశారు. ఆ యంత్రాన్ని చూసిన అధికారులు ఆశ్చర్యపోయారు. తరువాత వారి సహాయంతో చివరికి ఫ్యాక్టరీలో శుద్ధి కేంద్రం ఏర్పాటైంది.

ఆ ఊరిలో మరొక సమస్య – ప్లాస్టిక్ చెత్త. వీధి నిండా పారేయబడేది. దానివల్ల పశువులు గడ్డి బదులు ప్లాస్టిక్ తిని చనిపోతున్నాయి. ఈ సమస్య నివారణ కొరకు మేఘన తన మిత్రులతో కలిసి శుభ్రత కార్యక్రమం మొదలుపెట్టింది. ఊర్లో ఉన్నవారికి చెత్త వేరు చేయడం ఎలానో నేర్పింది. కూరగాయ ముక్కలు, పేపర్లు పంట పొలాల్లో వాడితే ఎరువుగా మారుతాయి అని. ప్లాస్టిక్, గాజు పునర్వినియోగానికి పంపవచ్చు అంటూ తెలియజేస్తూ అవగాహన కల్పించింది. అందరూ కలసి "ప్లాస్టిక్ తగ్గిద్దాం – ప్రకృతిని కాపాడుదాం" అని నినాదాలతో ప్రచారం చేశారు. పిల్లల కృషిని చూసి పెద్దలు కూడా మారిపోయారు.

ఒక రోజు పాఠశాలలో "శాస్త్ర సాంకేతికం – మానవతా విలువల కోసం" అనే ప్రదర్శన జరిగింది. మేఘన స్నేహితులతో కలిసి సౌరశక్తితో నడిచే చిన్న కార్, వర్షపు నీరు సేకరించే పద్ధతి, గాలిని శుద్ధి చేసే ఫిల్టర్ ఇలా పర్యావరణానికి తోడ్పడేవి తయారు చేసి చూపించారు.

పిల్లల ఆవిష్కరణలను చూసి జడ్జీలు, "మీరు శాస్త్రాన్ని కేవలం యంత్రాల కోసం కాదు, జీవుల రక్షణ కోసం వాడారు. ఇదే నిజమైన మానవతా విలువ'' అని అభినందించారు.

"మన చిన్న ప్రయత్నాలు కూడా పెద్ద మార్పులు తీసుకురాగలవు. మనం ప్రకృతిని రక్షిస్తే, ప్రకృతి మన భవిష్యత్తును రక్షిస్తుంది."

పిల్లల వలన ఆ రోజు నుంచి ఆ ఊరిని "పచ్చని ఊరు" అనే కొత్త పేరుతో పిలుస్తున్నారు.

**(బాలచెలిమి జాతీయ పోటీ కథలు-2025, 'యువత రాసిన పిల్లల కథలు'లో న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన ఉత్తమ కథ)**

**– చిలివేరి కరుణ**

పరిశోధక విద్యార్థిని, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం
m: 79896 62757




ముద్దుల పిల్లలు
మురిపాల పిల్లలు
మురిసేది నవ్వుల్లో
తడిసేది ముద్దుల్లో

చిగురాకు పెదవులు
చిన్ని చిన్ని మాటలు
చిత్రాల చిరు నటనలు
ప్రేమపూల ప్రియరాగాలు

చిలిపి అల్లరి చికు బుకులు
పడిలేచె పాలకడలి అలలు
ఇల్లంత గోము గోము గోలలు
పిల్లలున్న ఇల్లే పూల వనాలు

**– రేడియమ్**
9291527757

# భారత స్వాతంత్ర్య ఉద్యమం - కీలక ఘట్టాలు



1947 ఆగస్టు 15 భారతదేశ చరిత్రలో చిరస్మరణీయమైన రోజు. దాదాపు రెండు శతాబ్దాల బ్రిటిష్ పాలనకు ముగింపు పలికి భారత్ స్వతంత్ర దేశంగా అవతరించింది. ఈ స్వేచ్ఛ లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, ఉద్యమాలు, అచంచల సంకల్పానికి ప్రతిఫలం. 1757లో జరిగిన ప్లాసీ యుద్ధంతో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంలో తన ఆధిపత్యాన్ని విస్తరించడం ప్రారంభించింది. 1857లో జరిగిన తొలి స్వాతంత్ర్య సమరం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తొలి మహా తిరుగుబాటుగా చరిత్రలో నిలిచింది. మంగళ్ పాండే, ఝాన్సీ రాణి లక్ష్మీబాయి, తాంతియా తోపే, బహదూర్ షా జఫర్ వంటి వీరులు ఈ పోరాటంలో విశేష పాత్ర పోషించారు. 1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనతో స్వాతంత్ర్య ఉద్యమానికి సంఘటిత రూపం లభించింది. దాదాభాయ్ నౌరోజీ, గోపాలకృష్ణ గోఖలే, బాలగంగాధర్ తిలక్, లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్ర పాల్ వంటి నాయకులు జాతీయ చైతన్యాన్ని పెంపొందించారు. 1905లో బెంగాల్ విభజన, 1919లో జలియన్‌వాలా బాగ్ మారణకాండ భారతీయుల్లో స్వాతంత్ర్య ఆకాంక్షను మరింత బలపరిచాయి. మహాత్మా గాంధీ నాయకత్వంలో అసహకార ఉద్యమం (1920), దండి యాత్ర–ఉప్పు సత్యాగ్రహం (1930), వ్యక్తిగత సత్యాగ్రహం (1940), క్విట్ ఇండియా ఉద్యమం (1942) బ్రిటిష్ పాలనను కుదిపేశాయి. మరోవైపు భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి విప్లవకారులు దేశభక్తి జ్వాలను రగిలించారు. 1947 భారత స్వాతంత్ర్య చట్టం అమలుతో 1947 ఆగస్టు 15న భారత్ స్వతంత్ర దేశంగా అవతరించింది. అనంతరం 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి భారత్ సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా నిలిచింది.

– బాలచెలిమి డెస్క్

# కళకు విరమణ లేదు... కూరెళ్ళ శ్రీనివాస్‌కు ఘనాభినందనం




ప్రముఖ చిత్రకారుడు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కూరెళ్ళ శ్రీనివాస్ ఉద్యోగ విరమణ అభినందన సభ 2026 జూలై 12న హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన నాలుగు దశాబ్దాల కళా ప్రస్థానాన్ని ప్రతిబింబించే 'కళా శ్రీనివాసమ్', 'జలవర్ణ జీవచిత్రం', 'కూరెళ్ళ రేఖాచిత్రాలు', 'చిత్రధ్వని', 'ముఖ్యచిత్రం' అనే ఐదు గ్రంథాలను ఆవిష్కరించారు. డా. ఎస్. రఘు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి డా. ఎన్. గోపి, డా. ఏనుగు నరసింహారెడ్డి, జి.వి. శ్యాంప్రసాద్ లాల్, ప్రొఫెసర్ టి. గంగాధర్, మణికొండ వేదకుమార్, కార్టూనిస్టు శంకర్, సినీ విమర్శకుడు పొన్నం రవిచంద్ర, ఓటా సీఈఓ కంభాలపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. వక్తలు శ్రీనివాస్ క్రమశిక్షణ, నిరంతర కళాసాధన, ఉపాధ్యాయ సేవలు, నిరాడంబర వ్యక్తిత్వాన్ని కొనియాడారు. బాలచెలిమి పిల్లల మాసపత్రికలో కథల సారాన్ని, పాత్రల భావోద్వేగాలను, కథలోని మాధుర్యాన్ని చిన్నారుల హృదయాలకు చేరవేసే తొలి మాధ్యమం బొమ్మలే. దాదాపు మూడు దశాబ్దాలుగా తన అద్భుత చిత్రాలతో బాలచెలిమి పత్రికకు విశిష్ట సేవలందిస్తున్న కూరెళ్ళ శ్రీనివాస్ గారి ఈ గౌరవ సభ మాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. "పదవీ విరమణ ఉండొచ్చు; కళకు విరమణ ఉండదు" అనే సందేశంతో ముగిసిన ఈ కార్యక్రమం కళాకారులు, రచయితలు, శిష్యులు, కళాభిమానుల ఆత్మీయ సమ్మేళనంగా చిరస్మరణీయంగా నిలిచింది.

ఆట

# ఖో ఖో



ఎంత మంది పాల్గొనవచ్చు -
**పన్నెండు మంది**
ఎక్కడ ఆడవచ్చు -
**ఆట మైదానంలో**
ఈ ఆటకు గల ఇతర పేర్లు -
**రథేరా, టోక్కో, టోక్కా**



'ఖో ఖో' (Kho Kho) అంటే... తమ జట్టువాళ్ళు ఎదుటి జట్టు వారిని పట్టుకోవడానికి సంకేతంగా ఉపయోగించే పదం.

ఈ ఆటలో రెండు జట్లు ఉంటాయి. ఒక్కో జట్టులో తొమ్మిది నుంచి పదకొండు మంది సభ్యులు ఉంటారు. ఆటలో ఒక జట్టు సభ్యులు నేలపై ఒకరి తరువాత ఒకరు వ్యతిరేక దిశలో కూర్చుని ఉంటారు.

మరో జట్టులో నుంచి ఇద్దరు కానీ, ముగ్గురు కానీ కోర్టు (నిర్ణీత ఆటస్థలం) లోకి వస్తారు. కూర్చుని ఉన్న జట్టు చుట్టూ సవ్య దిశలో మాత్రమే పరుగెత్తుతూ ఉంటారు. పరుగెత్తుతున్న ఆటగాళ్లను కూర్చున్న వాళ్ళలో ఒకరు లేచి తాకే ప్రయత్నం చేయాలి. కొంచెం దూరం పట్టుకునే ప్రయత్నం చేసి, కూర్చున్న వాళ్ళలో మరొకరిని 'ఖో' అంటూ లేపి, వారి స్థానంలో కూర్చోవాలి. 'ఖో' అంటే లేచి, పరుగెత్తే వాళ్ళను తాకాలని అర్థం.

ఒక్కొక్కరిని తాకి అవుట్ చేయగానే వారి స్థానంలో వేరొకరు వస్తారు. ఇలా జట్టు సభ్యులందరూ అవుట్ అయిన తరువాత, రెండు జట్లు వారి వారి స్థానాలు మార్చుకుని ఆడతారు. ఏ జట్టు తక్కువ సమయంలో ఎదుటి జట్టు సభ్యులందరినీ అవుట్ చేస్తుందో ఆ జట్టు గెలిచినట్టు.

ప్రయోజనం: ఖోఖో సహజ వ్యాయామ క్రీడ. ఈ ఆట ఆడడం ద్వారా నిత్య చైతన్యం కలుగుతుంది.


- 'చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు' నుండి...

సీరియల్-15

# బంగారు మర్రి

**(బాలలకోసం ఆధునిక సాహస నవల)**

(గత సంచిక తరువాయి... )



పులులు అడవి దాటిన విషయం రాష్ట్రం మొత్తం చర్చించుకోసాగింది. ఇది ప్రభుత్వ విఫలం అంటూ ప్రతిపక్షాలు నిలదీశాయి. అటవీశాఖ మంత్రి సంబంధిత అధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించాడు. మరోవైపు మీడియా కూడా పదేపదే ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. నగరానికి వచ్చిన పులులను వెంటనే పట్టుకోవాలని అటవీ శాఖ మంత్రి అధికారులకు హెచ్చరిక జారీ చేశాడు. అంతేకాదు, ఒక్కో పులిని పట్టుకున్న వారికి ఐదు లక్షల విరాళం కూడా ప్రకటించాడు. అటవీ అధికారులకు టైగర్ ట్రాకర్ కాట్రాజు గుర్తుకు వచ్చాడు. వెంటనే అతనిని సంఘటన స్థలానికి పిలిపించుకున్నారు. చదువుకున్న యువకుడు, ఉత్సాహ వంతుడు కావడంతో కాట్రాజు వెంటనే పులులను పట్టుకోడానికి రెస్క్యూ టీంతో జత కలిశాడు. కాట్రాజుకు పులి ఎప్పుడు, ఎలా ప్రవర్తిస్తుందో, ఏ సమయంలో ఏ ప్రాంతంలో ఉండవచ్చో, ఆపదలో ఎలా తప్పించుకోవాలో క్షుణ్ణంగా తెలుసు.

తన తాత, ముత్తాతలు కూడా పులులను చూస్తూ అడవిలో పెరిగిన వాళ్లే. గాలిలో మూడు డ్రోన్ కెమెరాలు తిరుగుతున్నా, ఒక్క కెమెరాకు కూడ పులి జాడ దొరకలేదు. కాట్రాజు రావిర్యాలలోని సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. అక్కడి పరిసరాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాడు. కాట్రాజు ఒక చేతిలో పొడవాటి కర్ర, మరో చేతిలో టార్చ్‌లైట్‌తో పులిని వెతకడం మొదలు పెట్టాడు. పులిని పట్టుకోవడానికి వచ్చిన నిపుణులు చేతిలో మత్తుమందు ఉన్న తుపాకులతో కాట్రాజును అనుసరిస్తున్నారు. కాట్రాజు కొంచెం దూరం వెళ్ళాక చింత మర్రి చెట్టు దగ్గర ఆగాడు. అక్కడ ఆ చెట్టుకు పులి పంజాతో చేసిన గాట్లు గమనించాడు. అంతేకాదు, చెట్టుకు విసర్జించిన మూత్రం పరిశీలించాడు. లేగ దూడను ఎత్తుకొచ్చిన ఆడ పులి చింత చెట్టు పక్కనే తిన్నట్టు రక్తపు మరకలు కనిపెట్టాడు. కాట్రాజు నిపుణులను మర్రి చెట్టు మీద మర్రి చెట్టు కొమ్మల మీద తుపాకులతో కూర్చోమన్నాడు. పులి పాదముద్రలు గమనించాడు. కాట్రాజు ఇక్కడే ఎక్కడో పులి ఉన్నట్లు గమనించాడు. ఆలోచించి ఉన్నట్లు భావించాడు. పాదముద్రలు పట్టుకొని ముందుకు కదిలాడు. కాట్రాజు చేతిలో పెద్ద కర్రతో

ఒంటరిగా ముందుకు కదలాడు వండర్లా కాంపౌండ్ గోడకు అనుకొని దూరంగా పులి కనిపించింది. చేతిలో కర్రను పైకి ఎత్తి పక్కకు నిల్చున్నాడు. పులి లేచి నిల్చుంది. పులి తనకన్నా ఎత్తైన జంతువుతో పోరాటానికి జంకుతుంది. మనిషి పొట్టివాడైనా కర్ర ఎత్తు ఎంత ఉందో, కింద నుంచి పై వరకు కర్ర ఎత్తు వరకు చూసుకొని చానా ఎత్తైన జంతువు అనుకుని వాటి జోలికి సహజంగా పులి పోదు.

పులిలో ఉన్న ఈ బలహీనత కాట్రాజుకు బాగా తెలుసు. ఇక్కడ కాట్రాజు చేతిలో కర్ర ఉండటంతో పొడవాటి జంతువు అనుకొని పులి కాట్రాజు మీదికి రాలేదు. కాట్రాజు హై ఫోకస్ టార్చిలైట్ పులి మీదికి వేశాడు. తన వెంట వచ్చి మర్రి చెట్టు మీద కూర్చున్న నిపుణులకు ఫైర్ అంటూ కమాండ్ వేశాడు. వెంటనే నిపుణులు చేతిలోని మత్తుమందు బుల్లెట్స్ ఉన్న తుపాకులు పేల్చారు. తెలతెలవారుతుండగా అవి వేగంగా వెళ్లి పులిని గుచ్చుకున్నాయి. పులి శరీరంలో మత్తు ప్రవేశించింది. దాంతో.. అది మత్తుగా పడుకుంది. వెంటనే వైద్య సిబ్బంది అక్కడికి చేరుకున్నారు.. ఇక అప్పటి వరకు ప్రత్యక్ష ప్రసారం అందజేస్తున్న టీవీ మీడియా అక్కడికి చేరుకుంది. అందరూ కాట్రాజు ధైర్యాన్ని మెచ్చుకుని అభినందించారు. ఇక అప్పటివరకు టీవీలకే అతుక్కోని గుడ్లప్పగించి చూస్తున్న ప్రజలంతా ఒక్కసారిగా అరుస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

చింటూ రాంబాబు పావని ముగ్గురు పులి చిక్కేంత వరకు టీవీల ముందే కూర్చున్నారు. కాట్రాజు వారికి ఓ పెద్ద హీరోలా కనిపించాడు. పులిని ధైర్యంగా ఎదుర్కోవటం తెలివిగా దానిని పట్టుకోవడం చింటూకి ఎంతో నచ్చింది. ఇక చింటూ కాట్రాజుకి అభిమానయ్యాడు. కాట్రాజులా సాహసం చేయాలనుకున్నాడు. పులిని ఎంతో ధైర్యంగా తెలివితేటలతో పట్టుకోవటం చింటూకి ఆశ్చర్యమనిపించింది.. చింటూనే కాదు.. పిల్లలందరూ టీవీలో కాట్రాజు సాహసం చూసి అతనే నిజమైన హీరో అనుకున్నారు.


(సశేషం... )

– పైడిమర్రి రామకృష్ణ

m : 92475 64699



# పదాల మేడ-3




| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | 2 | | | 4 | 9 |
| | | 6 | 5 | | |
| 3 | | | 7 | | |
| | 8 | | 13 | 11 | |
| 10 | | | | 12 | |
| | 15 | | | 14 | |

**అడ్డం:**

1) అభినయం / మోసగించడానికి కూడా ఇలా చేస్తారు-(3)
3) ఇది పండిస్తేనే మనకు తిండి దొరికేది-(2)
4) ఆగమని చెప్పండి-(2). 5) ఎండ, వానల నుండి కాపాడేది-(2)
6) మనకు ప్రాణ వాయువును అందించేది. కుడి ఎడమైంది-(2)
7) అప్పుడప్పుడు.. చివరి సగం తెగిపోయింది-(3)
8) ఇద్దరూ ఇద్దరే-(4), 10) ప్రతీకారం-(2)
12) ఆర్భాటం-(2)
15) 13 నిలువుతో ఇది కలిపితే కూరగాయల్లో ఇదొకటి-(2)



**నిలువు:**

2) గడుసైన దొంగ-(5), 4) ఆరాటం-(2)
9) తగిన బుద్ధి చెప్పడం-(4), 11) మేను-(2)
13) 15 కు మొదలు ఇదే-(2)
14) పొగరు, గర్వం.. కింది నుండి పైకి-(2)

– మాదారపు వాణిశ్రీ

హన్మకొండ

m : 9247286668

కథ

# తలవని మేలు



ఒక ఊరిలో సింగడు అనే వేటగాడు ఉండే వాడు. అతను విలువిద్యలో చాలా నేర్పరి. బాణం వదిలాడంటే లక్ష్యం తప్పేది కాదు. అతని దగ్గర ఒక మంచి వేట కుక్క ఉండేది. అది ఎప్పుడూ సింగడి వెంటే ఉంటూ వేటలో అతనికి సాయం చేసేది. ఒకరోజు సింగడు తన కుక్కను తీసుకుని వేట కోసం అడవికి వెళ్ళాడు. కానీ ఆ రోజు అతనికి ఉదయం నుంచి సాయంత్రం వరకు అడవి అంతా వెతికినా ఒక్క చిన్న జంతువు కూడా దొరకలేదు. ఆకలి వేస్తుండటంతో సింగడు నీరసపడిపోయాడు. "ఈ రోజుకు ఇంక వేట దొరకదు" అనుకుంటూ ఇంటికి తిరిగి బయలు దేరాడు.

అలా వస్తున్న దారిలో, ఒక పొద పైన ఒక పెద్ద పక్షి కూర్చుని ఉండటం అతని కంటపడింది. ఆ పక్షిని చూడగానే సింగడికి ఆశ కలిగింది. "రోజంతా కష్టపడినా ఏదీ దొరకలేదు, కనీసం ఈ పక్షినైనా కొట్టి తీసుకువెళ్తే రాత్రికి కూర వండుకోవచ్చు" అని మనసులో అనుకున్నాడు. చాలా నిశ్శబ్దంగా అడుగులు వేస్తూ, ఆ పక్షికి గురి పెట్టి బాణం ఎక్కుపెట్టాడు. అయితే, ఆ పొద లోపల ఒక పెద్ద అడవి పంది నిద్రిస్తున్న విషయం సింగడికి తెలియదు. సింగడు బాణం వదలబోయే తరుణంలో, అతని కుక్క పొదలో ఉన్న పంది వాసన కనిపెట్టింది. వెంటనే ఆ కుక్క గట్టిగా మొరిగింది. ఆ అరుపుకు భయపడి పొదపై ఉన్న పక్షి ఎగిరిపోయింది. సింగడు అప్పటికే బాణం వదిలేశాడు. పక్షి ఎగిరిపోవడంతో ఆ బాణం నేరుగా కిందికి దూసుకెళ్లింది.

సరిగ్గా అదే సమయంలో కుక్క మొరగడంతో పొదలో నిద్రిస్తున్న పంది ఉలిక్కిపడి లేచి, కంగారులో ఒక్కసారిగా పైకి ఎగిరింది. పై నుంచి కిందికి వస్తున్న బాణం నేరుగా పైకి లేచిన ఆ పందికి తగిలింది. దెబ్బ గట్టిగా తగలడంతో ఆ పంది అక్కడికక్కడే చనిపోయింది.

చిన్న పక్షి కోసం బాణం వేస్తే, అంతకంటే పెద్దదైన పంది దొరికినందుకు సింగడికి ఆశ్చర్యంతో పాటు ఆనందం కలిగింది. "పట్టు విడువకుండా ఓపికతో పని చేసుకుంటూ పోతే తగిన ఫలితం రావడానికి కాలం కూడా సహకరిస్తుంది కదా" అనుకుంటూ ఆ పందిని మోసుకుని ఊరిలోకి వెళ్లిన సింగడు తనకి జరిగిన వింత సంఘటనను అందరికీ చెప్పాడు. అది విన్న గ్రామస్థులు "పక్షి మీద గురి పెడితే పంది పడ్డట్టు ఉంది నీ అదృష్టం" అని నవ్వుకున్నారు. అప్పటి నుండి ఈ మాట ఒక సామెతగా మారిపోయింది.

– డా. పోతగాని సత్యనారాయణ
m : 9182531202

# దుష్టుల సాన్నిత్యం మంచిది కాదు



ఒక ఊరిలో ఒక వడ్రంగి ఉన్నాడు. దగ్గరలోని అడవికి వెళ్ళి చెట్లను నరికి ఆ కలపతో దర్వాజాలు, కిటికీలు, మంచాలు తయారు చేసి జీవనం సాగించేవాడు. ఎప్పటిలా ఒక రోజు అడవికి వెళ్ళాడు. ఒక సింహం ఎదురైంది. వడ్రంగి భయంతో గజగజలాడుతూ సింహానికి సాష్టాంగ నమస్కారం చేసాడు. అప్పుడు ఆ సింహం జాలితో "భయపడకు నిన్నేమీ చేయనులే" అంది. వడ్రంగి సంతోషంతో సింహానికి కృతజ్ఞతగా మంచి రుచికరమైన భోజనం సమర్పించాడు. సింహం ఆహారం తిని సంతోషించింది. ఆ రోజు నుంచి వడ్రంగి, సింహం స్నేహంగా వున్నారు. రోజూ కలుసుకునేవారు. వడ్రంగి ప్రతి రోజు సింహానికి మధురమైన భోజనం తెస్తున్నాడు. సింహం ఆనందంగా తింటుండేది. సింహానికి నక్క, కాకి మంత్రులుగా ఉండేవి. అవి సింహం వేటాడి తెచ్చిన జంతు మాంసంతో తమ కడుపు నింపుకునేవి. వడ్రంగి తెస్తున్న భోజనం తింటూ సింహం వేటకు వెళ్లడం మానేసింది. నక్కకు, కాకికి ఆహారం దొరకటం లేదు. "రాజా! మీరీమధ్య వేటకు ఎందుకని వెళ్లటం లేదు" అని సింహాన్ని అడిగాయి. "నాకొక మంచి మిత్రుడు లభించాడు. ప్రతిరోజూ నా కోసం మంచి భోజనం తెస్తున్నాడు. ఇక వేటకు వెళ్లవలసిన అవసరమేముంది" అని సింహం జవాబు యిచ్చింది.

నక్క, కాకి ఆ మిత్రున్ని తిట్టుకున్నాయి. వినయాన్ని నటిస్తూ "రాజా! అంత మంచి మిత్రున్ని మాకు చూడాలని వుంది. మాకూ పరిచయం చేయండి" అని వేడుకున్నాయి. అలాగేనంటూ రోజూ వడ్రంగి కలుసుకునే చోటుకు నక్కను, కాకిని తీసుకుని వెళ్ళింది. వడ్రంగి ఎప్పటిలా సింహానికి ఆహారం తెచ్చాడు. సింహం ప్రక్కనే నక్క, కాకి వుండటం చూసి గబగబా చెట్టెక్కి కూర్చున్నాడు.

సింహం ఆశ్చర్యపోతూ "మిత్రమా! ఏమైంది. ఇదుగో నా మంత్రులను నీకు పరిచయం చేద్దామని తీసుకు వచ్చాను. అలా చెట్టు ఎక్కావెందుకు" అని ప్రశ్నించింది. వడ్రంగి "మిత్రమా! నన్ను క్షమించు. నీవంటే నాకు ప్రేమ, అభిమానం, గౌరవం ఉన్నాయి. నీ మంత్రులు చెడ్డవారు. నక్కజిత్తులమారి. కాకి దొంగబుద్ధి కలది. దుష్టులు మంత్రులుగా ఉన్న నిన్ను నమ్మలేను. స్నేహం చేయలేను" అన్నాడు. దుష్టుల సాన్నిహిత్యం వలన ఒక మంచి మిత్రుడిని కోల్పోయానని బాధపడుతూ సింహం తన స్థావరానికి వెళ్ళింది. వడ్రంగి నెమ్మదిగా చెట్టు దిగి తన ఇంటికి చేరుకున్నాడు.

సేకరణ: అమరావతి






# తెలంగాణ చారిత్రక పర్యాటకం ఆలయాలు

భారతీయ సనాతన సాంప్రదాయం అస్తికత్వాల లక్ష్యమేమిటని చర్చించుకుంటే దొరికే స్పష్టమైన సమాధానం సన్మార్గ సూచన అని తెలుస్తుంది. ఆ విధమైన మార్గాన్ని చూపి మనిషిని జ్ఞానవంతునిగా మార్చి జీవితాన్ని ఉన్నతముగా, ఆదర్శముగా మలచుకోవాలని చెబుతూ అంతర్యామి ప్రబోధముగా మనకు తెలియజేయునటువంటి వేద, పురాణ, ఇతిహాసములు మన ధార్మిక సంస్కృతికి నిదర్శనములు. మానవ నాగరికత ప్రారంభ దశలో దేవాలయములు లేవు. ఆ కాలంలో మానవుడు ఆకలి దప్పులు వేట నుండి బయటపడి ప్రకృతిలోని శక్తులయిన సూర్యుడు, చంద్రుడు, అగ్ని, నీరు, పర్వతాలు, నదులు, వృక్షాలు, నాగులు (పాములు), జంతువులను తాను నివసించే కొండ చరియల్లో, గుహల్లో, ప్రకృతిలో లభించే వివిధ రంగుల రాళ్ళు, ఆకు, చెట్టు పసర్లతో తనకున్న ఊహాశక్తిని జోడించి చిత్రాలు గీయడం, ఆ రాళ్ళతోనే రేఖలుగా గీసి తన చుట్టూ కన్పించే పరిసరాలను ప్రకృతి శక్తులనే ఆరాధించడం, అలా ప్రారంభమైన ఆరాధన ఒక చోట కేంద్రీకరించే ప్రయత్నమే ఆలయ నిర్మాణాలకు దారి చూపింది. దేవాలయ సాంప్రదాయం అత్యంత ప్రాచీనమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాలలో ఒకటిగా నిలిచింది. సింధూ నాగరికత కాలంలో (సా.పూ.శ. 3300-1300) ప్రత్యేక దేవాలయ నిర్మాణాలు కన్పించకున్నా, మాతృదేవత విగ్రహాలు, పశుపతి ముద్రలు, ప్రకృతి వృక్షారాధన వంటి ఆధారాలు ఆ కాలపు ఆరాధన విశ్వాసాలను తెలియజేస్తాయి. వేదకాలం (సా.పూ.శ. 1500-600) ఈ కాలంలో ఆలయాల కంటే యజ్ఞయాగాది వేదికలకే ప్రాధాన్యముండేది. అగ్ని, ఇంద్ర, వరుణ, సోమ మొదలైన దేవతలను యజ్ఞాల ద్వారా ఆరాధించేవారు. విగ్రహ ఆరాధన లేదు. మహాజన పదాలు - మౌర్యకాలం (సా.పూ.శ. 600-185) బౌద్ధ, జైనమతాల ప్రాభవంతో యజ్ఞయాగాది క్రతువుల్లో జంతుబలులు నిషేదం, మనిషికి కన్పించని ఊహాతీత శక్తుల కేంద్రంగా కాకుండా, మనిషి కేంద్రంగా ఈ మతాలు అభివృద్ధి చెంది స్థూపాలు, చైత్యాలు, విహారాలు నిర్మించబడ్డాయి. నాటి ప్రజల అభిమతంతో బౌద్ధ, జైన, వైదిక మతాలకు కూడా రాజుల ఆదరణ లభించింది. శృంగ-శాతవాహనుల కాలం (సా.పూ.శ. 2 - సా.శ. 3వ శతాబ్దం) ఇటుకలతో, రాళ్ళను పేర్చి దేవాలయ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. తెలుగు నాట కూడా శాతవాహనుల కాలంలో బౌద్ధ, జైన, హిందూ దేవాలయాలు నిర్మాణాలు అభివృద్ధి చెందినవి. గుప్తయుగం (సా.శ.4-6 శతాబ్దాలు) పూర్తిస్థాయి దేవాలయాల నిర్మాణాలకు పునాది పడింది. గర్భగృహం, మండపం, శిఖరం తదితర నిర్మాణాలు అంగాలు శైలులు రూపుదిద్దుకున్నాయి. ముఖ్యంగా హిమాలయాల నుండి వింధ్యా పర్వతాల వరకు నాగరభూమి అని, వింధ్య నుండి కృష్ణానది వరకు వేసర అని, కృష్ణానది నుండి కన్యాకుమారి వరకు ద్రావిడ భూమిగా మన పూర్వీకులు పెర్కొన్నారు. నాగర శైలిలో చతురస్త్రాకార ఆలయాలు, ద్రావిడ శైలిలో కోణాకృతి (అష్టపట్టాలు), వేసరశైలిలో వృత్తాకారంలో ఆలయాలు రూపుదిద్దుకున్నాయి. ఆయా ప్రాంతాలలో దొరికే వస్తువులతో (ఇటుకలు, రాళ్ళు, కర్రలు) ఆలయాల నిర్మాణం జరిగింది. ఆలయాలంటే కేవలం ఆరాధన స్థలాలే కాకుండా, వేదవిద్య, సాధారణ విద్య, వాస్తు శిల్పకళ, సాంస్కృతిక, సంగీత, నృత్య, వైద్య, అన్నదాన, న్యాయవిచారణ, రాజ్యపరిపాలన కేంద్రంగా ఉంటూ, పాటుగా ఆర్థిక వ్యవస్థకు ఆధార కేంద్రాలుగా భారతీయ సమాజ నిర్మాణంలో దేవాలయాలు ఒక అంతర్భాగంగా కీలక పాత్రను పోషించాయి. అందుచేతనే గుప్తుల కాలాన్ని మన పూర్వీకులు, చరిత్రకారులు స్వర్ణయుగం అన్నారు. తదనంతరం మధ్యయుగ ప్రారంభంలో (సా.శ. 6-9 శతాబ్దాలు) దక్షిణ భారతదేశంలో ద్రావిడ శైలి వికసించింది. పల్లవులు, బాదామీ చాళుక్యులు రాతి దేవాలయాలు నిర్మించారు. తర్వాత సా.పూ. 9-18 శతాబ్దాల కాలంలో చోళులు, కాకతీయులు, హొయసళలు, తూర్పు గంగులు, విజయగర కాలంలో భారీ గోపురాలు, శిల్పకళా సంపద, నృత్యమండపాలు ఈ కాలపు ప్రత్యేకత. దేవాలయాలు విద్య, కళలు, పరిపాలన ఆర్థిక వ్యవస్థలకు కేంద్రాలుగా మారాయి. తదనంతర కాలంలో విదేశీ దండయాత్రలు, ముస్లీం పాలకుల కాలంలో ఆలయాలు. ఆదరణకు నోచుకోకపోగా పలు నిర్మాణాలు ధ్వంసం చేయబడగా, కొన్ని ఆనవాళ్ళు కనుమరుగైనాయి. అయినా వాటి అస్థిత్వాన్ని ఆధునిక కాలంలో 18వ శతాబ్దం నుండి నేటి వరకు గత వైభవ ప్రాభవాలుగా మనకు నాటి వారసత్వాన్ని తెలియజేస్తున్నాయి. నేడు నాటి దేవాలయాల పునరుద్దరణకు, సంరక్షణకు ప్రాధాన్యం పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచ వారసత్వ కేంద్రాలు, పురావస్తుశాఖలు, ధార్మిక సంస్థలు, సామాజిక, సాంస్కృతిక సంస్థలు, ప్రజాసంఘాలు, నాటి దేవాలయ వారసత్వ పరిరక్షణ. ప్రదర్శనలో కీలకంగా పని చేస్తున్నాయి. భారతీయ దేవాలయాలు నాటి నుండి నేటి వరకు విశ్వవ్యాప్తమవుతూనే ఉన్నాయి. ఆలయాలు నేడు ప్రపంచ పర్యాటక, సంస్కృతీ సంప్రదాయ వారసత్వ ప్రతీకలుగా సరికొత్త ఆధ్యాత్మిక వ్యవస్థలుగా భారతదేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

- దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి
m : 9010051177

# కాశీకావడి గమత్తు




సంకురాత్రి పండగ రోజుల్లో కాశీకావడి భుజాన వేసుకుని కొందరు పల్లెటూళ్లకి వస్తూ ఉంటారు. మా చిన్నతనంలో ఆ కాశీకావడి వాళ్లు చూపించే గమత్తు ఒకటి చాలా అద్భుతంగా కనిపించేది. ఆ గమత్తు ఏమిటంటే– సీతాఅమ్మవారి బొమ్మ – వేలెడు పొడుగున్నది – తీసి బయట పెడతాడు. ఆ బొమ్మ లంగా వోణీ వేసుకుని, బొట్టూ కాటుకా పెట్టుకుని, పెద్ద కొప్పుపెట్టుకుని తమాషాగా ఉంటుంది. ఆ బొమ్మ ఒక సూది మొన మీద నిలబడి, గిరగిరా తిరగడానికి అనువుగా ఉంటుంది. కాశీకావడివాడు సంచిలోనుంచి వేలెడు పొడుగున్న మరో వస్తువు బయటకి తీస్తాడు. ఈ వస్తువుకి ఒక వైపున కిరీటం పెట్టుకున్న అందమైన రాముడి బొమ్మ, రెండవ వైపున బొర్ర మీసాలతో భయంకరమైన రావణాసురుడి బొమ్మ ఉంటాయి. ఈ వస్తువును సీతాదేవి బొమ్మ దగ్గరగా తెస్తాడు. అప్పుడు రాముడి ముఖం సీత వైపు తిరిగి ఉంటే సీత నిశ్చలంగా రాముడి వైపే చూస్తూ ఉంటుంది. తరవాత రావణాసురుడి ముఖాన్ని సీత వైపు తిప్పుతాడు; వెంటనే సీత రెండో వైపుకి ముఖం తిప్పేసుకుంటుంది!

సీతాదేవి మహాపతివ్రత కాబట్టి ఆమె ఈ విధంగా ప్రవర్తించడం సమంజసమే అయినప్పటికీ – వట్టి మట్టి బొమ్మ ఇంత చేటు పాతివ్రత్యాన్ని ప్రదర్శించడం చూసి, ప్రేక్షకులంతా ముక్కుల మీద వేళ్లు వేసుకునేవారు. అందరూ తల కొంత డబ్బు సంతోషంగా ఇచ్చేవారు. ఇంతకీ ఈ గమత్తు ఎలా జరుగుతుందో మీకు తెలిసిందా? అయస్కాంతాలు చేసే చమత్కారాలలో ఇది ఒకటి. ప్రతి అయస్కాంతానికి ఉత్తర ధ్రువం అనీ, దక్షిణ ధ్రువం అనీ రెండు కొసలు ఉంటాయి. ఒక అయస్కాంతపు ఉత్తర ధ్రువమూ, మరో అయస్కాంతపు దక్షిణా ధ్రువమూ పరస్పరం ఆకర్షించుకుంటాయి; లేదా "విజాతి ధ్రువాలు ఆకర్షించుకుంటాయి" అని క్లుప్తంగా చెప్పవచ్చు. ఒక అయస్కాంతపు ఉత్తర ధ్రువమూ, మరో అయస్కాంతపు ఉత్తర ధ్రువమూ దగ్గరగా తెస్తే వికర్షించుకుని దూరంగా పోతాయి. అలాగే రెండు దక్షిణ ధ్రువాలు దగ్గరగా తెస్తే వికర్షించుకుంటాయి. దీనినే సూక్ష్మంగా "సజాతి ధ్రువాలు వికర్షించుకుంటాయి" అని చెప్పవచ్చు. ఈ రెండు సూత్రాలూ అర్థం అయితే మన కాశీకావడి గారడీ మంచులా విడిపోతుంది. సీత బొమ్మలోపల ఒక అయస్కాంతమూ, రామ రావణుల బొమ్మ లోపల మరొక అయస్కాంతమూ పైకి కనబడకుండా దాస్తారు. సీత ముఖమూ రాముని ముఖమూ విజాతి ధ్రువాలు అయేటట్లు వాటిని అమరుస్తారు. కాబట్టి అవి ఆకర్షించుకుంటాయి. సీత ముఖామూ, రావణుని ముఖమూ సజాతి ధ్రువాలు అయి ఉంటాయి; కాబట్టే అవి వికర్షించుకుంటాయి.

ఇంచుమించు ఇటువంటి గమత్తునే మనం ఇంట్లో తయారు చేసుకోవచ్చు. "దిక్సూచి" అనే వ్యాసంలో చెప్పినట్లుగా నీళ్లల్లో తేలే దిక్సూచిని ముందు తయారు చెయ్యాలి. జీలుగు బెండుమీద చిన్న ప్లాస్టిక్కు సీత బొమ్మ అతికించాలి, ముఖం సూది బెజ్జంవైపుగా ఉండేటట్లు. బలమైన అయస్కాంతానికి – సీత ముఖాన్ని ఆకర్షించే వైపు రాముడి ముఖమూ, వికర్షించే వైపు రావణుడి ముఖమూ ఉండేటట్లు రెండు బొమ్మలు అతికించాలి. అంతే. కాశీకావడి గమత్తు తయారైంది. రాముడిని చూపిస్తే సీత దగ్గరగా వస్తుంది; రావణుడిని చూపిస్తే ముఖం తిప్పుకుని దూరంగా పోతుంది.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి




# భారత్ మాతాకీ జై

**పాత్రలు: జాన్సన్, రెహమాన్, స్వేచ్ఛ, మాధవి, ఉజ్వల్, భారతి.**

(జాన్సన్, రెహమాన్, స్వేచ్ఛ, మాధవి, ఉజ్వల్ మాట్లాడుకుంటూ నడుస్తుంటారు పక్కన ఒక చెట్టు కింద దిగులుగా ఒక స్త్రీ కూర్చొని ఉంటుంది)

## దృశ్యం- 1

జాన్సన్: ఈ నెలలో మనం జరుపు కోబోయే పండుగ ఏమిటో చెప్పండి

రెహమాన్: గా మాత్రం తెలీదా పంద్రాగస్టు.

స్వేచ్ఛ: అవును మనకు స్వాతంత్ర్యం వచ్చిన రోజు.

ఉజ్వల్: అది మన జాతీయ పండుగ విద్యాసంస్థలలో ఆఫీసులలో అంతట జెండాలు ఎగురవేసి మన దేశభక్తిని చాటుకుంటాం.

జాన్సన్: అబ్బో చాలా విషయాలు చెప్పారు ఎవరైనా జెండా గురించి ఒక పాట అన్నా పాడగలరా పాడి చూపించండి చూద్దాం .

మాధవి: నేను పాడుతాను

ఎత్తండి ఎత్తండి స్వాతంత్ర్యపు జెండా
ఎత్తవోయ్ ఎత్తు ఎత్తు ఆకాశం నిండా ॥ఎత్తండి ॥
కేలూపుచు తలలూపుచు గాలిదారులంట
మన జెండా మనదే వీరుల నెత్తురు పంట
కొత్త వేడి కొత్త వాడి భరతావని నిండా
ఎత్తవే ఎత్తు ఎత్తు ఆకాశం నిండా ॥ ఎత్తండి॥

అందరూ: (చప్పట్లు కొడతారు)

జాన్సన్: అరే నేను జోక్ చేసిన నువ్వు మస్తు సీరియస్ గా పాడినవ్

స్వేచ్ఛ: హలో మన దేశం గురించి ఇక్కడ మనం ఎప్పుడూ సీరియస్ గానే ఆలోచించాలే

(నడుస్తూ ఆ స్త్రీ దగ్గర ఆగిపోతారు)

ఉజ్వల్: ఈవిడ ఎవరు అలా దిగులుగా కూర్చుని ఉంది?

మాధవి: అమ్మ ఎవరు మీరు ఏమైంది?

రెహమాన్: మీరు గిట్ల పరేషాన్ గా కనిపిస్తున్నరు

ఉజ్వల్: అమ్మ చెప్పండి మేము ఏమన్నా సహాయం చేయగలమా?

భారతి: (తలపైకెత్తి వీరిని చూస్తూ) మీరా నాకా (నవ్వుతుంది) సహాయం చేస్తారా? (మళ్లీ నవ్వుతుంది)

స్వేచ్ఛ: అదేంటమ్మా చెప్పండి. మీకేం కష్టం వచ్చింది ఎందుకు అలా ఉన్నారు?

భారతి: నా పేరు భారతి నేను ఒక తల్లిని. నా బిడ్డలందరూ నన్ను పట్టించుకోవడం మానేశారు.

మాధవి: అమ్మ ఎంత కష్టం వచ్చింది.

రెహమాన్: అట్లెట్ల వదిలేస్తరు అమ్మా! కన్నతల్లివన్న కనికరం లేకుండా!

భారతి: కన్నతల్లినన్న విషయమే మర్చిపోయారు నాయనా!

ఉజ్వల్: ఎందువల్ల?

భారతి: ఎందుకంటే (బ్యాక్ గ్రౌండ్‌లో మాటలు వినిపించాలి. పోట్లాడుకుంటున్నట్లు గా నేనంటే నేనంటూ అరచుకుంటూ) విన్నారుగా ఎలా పోట్లాడుకుంటున్నారు నాకంటే నాకే కావాలంటూ!

స్వేచ్ఛ: అలా ఎలాగా?

భారతి: అవునమ్మా ఒకరి నేను హిందువుని అని, మరొకరిని ముస్లిం అని ఇంకొకడు నేను క్రిస్టియన్ ని అంటూ ఎవరికి వారు మేమే గొప్ప అంటే మేమే గొప్ప అంటూ(వెనుక నుంచి మాటలు మేం గొప్ప మేం గొప్ప కాదు మేమే గొప్ప అరుపులు)

ఉజ్వల్ : అర్థం కాలా

భారతి: ఒకరు మాది ఏ రాష్ట్రం మాది ఈ భాష అంటూ మరొకరు మేము చెప్పిందే కరెక్ట్ అంటూ...

రెహమాన్: అట్లెట్ల

భారతి: ఒకరు గొప్ప అంటూ(వెనుక నుంచి నేనే గొప్ప నేను ధనవంతుడిని నేనే గొప్ప నువ్వు ధనవంతుడివి అయితే నేను గొప్పే మాటలు)

మాధవి: అమ్మ మీరు ఎవరి గురించి చెబుతున్నారు మాకు అర్థం కావడం లేదు

భారతి: మీరు సరిగ్గా వింటున్నారు నేను చెప్పేది నా గురించే

మాధవి: కాస్త వివరంగా చెప్తారా?

భారతి: నన్ను ఆక్రమించడానికి ఒక మూల నుంచి చొరబడి తెల్లవారు క్రమంగా ఆక్రమించాలనుకున్నారు

రెహమాన్: అరె బై ఈమె ఏం చెప్తుందో సమజైత లేదు

భారతి: మరికొందరు నాయకులు నాకోసం నిరాహార దీక్షలు చేసి మరీ నన్ను వారి బంధనాల నుండి విడిపించారు. నాకోసం కవులు కవితలు రాశారు దేశమంటే మట్టి కాదు ఈ దేశం అంటే మనుషులు... అంటూ ఇంకొకరు ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని అంటూ పాటలు పాడారు.

అందరూ: మీరు భారతి అంటే భరతమాతనా?

(ఒకరి ముఖం ఒకరు చూసుకుంటారు ఆనందంతో అరుస్తారు హే అని)

భారత్ మాతాకీ! జై భారత్ మాతాకీ జై! భారత్ మాతాకీ జై!

భారతి: అవును నేను భారతమాతనే ఆగండి ఆగండి ఎందుకు జేజేలు కొడుతున్నారు? నన్ను తల్లిగా చూసారా మీరు? మీలో మీరు పోట్లాడుకుంటే నేనేమైపోతానా అని ఆలోచించారా అసలు?

ఉజ్వల్ : అది అదీ...

భారతి: గాంధీ నెహ్రూ సుభాష్ చంద్రబోస్ సర్దార్ వల్లభాయ్ పటేల్ భగత్ సింగ్ రాజ్ గురుదేవ్ ఇలా ఎంతమంది ఎంతోమంది నాయకులు నాకోసం ఎంత శ్రమ పడ్డారు కానీ నేడు నేడు (దుఃఖంతో తల పట్టుకుంటుంది) (అందరూ ఆమె చుట్టూ చేరుతారు)

అందరూ: అమ్మ మమ్మల్ని మన్నించండి అమ్మ మన్నించండి.

భారతి: పైగా ఇప్పుడు కులాలు మతాలు పేరుతో నన్ను అవమాన పరుస్తున్నారు. చూశారా నా ముఖంలో సంతోషం ఉందా? 80 సంవత్సరాల నా స్వాతంత్ర్యంలో నా కోసం మీరంతా ఏం చేస్తున్నారు? ఆలోచించండి? మీలో మీరు పోట్లాడుకుంటున్నారు. ఒకరి మీద ఒకరు ద్వేషం పెంచుకుంటున్నారు.

జాన్సన్: అవునమ్మా

భారతి: అవినీతి, లంచగొండితనం, స్వార్థం అనువణువునా పెంచుకుంటున్నారు అందరూ కలిసిమెలిసి ఉండకుండా విడివిడిగా ఉండాలని కోరుకుంటున్నారు ఈర్ష్యలు అసూయలు పెంచుకుంటున్నారు

మాధవి: లేదమ్మా లేదు ఇకపై అలా ఉండదు మేం అలా జరగనివ్వం.

ఉజ్వల్: అవునమ్మా మేము బాలలం నేటి బాలలే రేపటి పౌరులు అంటారు కదా రేపటి భావి భారత పౌరులుగా మేము చెబుతున్నాం.

రెహమాన్: అవ్ అమ్మ మేమంతా నీ బిడ్డలం ఇకనుంచి నిన్ను మంచిగా చూసుకుంటా మా పిల్లలకి మీ గురించి చెప్తాం

(స్వేచ్ఛ: ఆమెను చేయి పట్టుకుని తీసుకు వెళుతుంది)

## దృశ్యం – 2

(భారతి తెల్ల చీర కట్టుకొని చేతిలో జాతీయ జెండా పట్టుకుని నడుస్తూ వస్తుంటే మాధవి ఆమె చేయి పట్టి తీసుకువస్తుంది)

అందరూ: భారత్ మాతాకీ జై భారత్ మాతాకీ జై భారత్ మాతాకీ జై

(స్వేచ్ఛ: భారతిని ఒక కుర్చీలో కూర్చో పెడుతుంది)

ఉజ్వల్: (మైక్ ముందుకు వెళ్ళి) అందరికీ శుభోదయం.. బడికి ఎవరు వచ్చారో చూశారు కదా! సాక్షాత్తు భరతమాత మన బడికి వచ్చారు.

అందరూ: భారత మాతాకీ జై

ఉజ్వల్: మన భరతమాత అంటే అందరికీ అభిమానమే కదా మరి ఆ అమ్మను నొచ్చుకునేలా మనం ప్రవర్తించకూడదు. ఇకపై ఎవరూ ఒకరితో ఒకరు పోట్లాడుకోకూడదు కులాలు మతాలు, జాతులు అంటూ వేరు చేసి చూడకూడదు. తల్లికి మనమందరం సమానం అవునా కాదా! ఇకపై మనమంతా కలిసిమెలిసి ఉండాలని ఆ భరతమాత మనతో చెబుతున్నారు మీరే వినండి.

భారతి: (లేచి వస్తుంది మైకు దగ్గర) పిల్లలు ఈ సంవత్సరం 80వ స్వాతంత్ర్య దినోత్సవం. మీ అందరికీ నా దీవెనలు. నన్ను స్వతంత్రురాలిగా చేయడం కోసం ఎందరో నాయకులు కష్టపడ్డారు. మీరు నా మీద ప్రేమతో అభిమానంతో గౌరవంతో మీలో మీరు పోట్లాడుకోకుండా మన దేశం ప్రపంచంలో ప్రథమ స్థానంలో నిలిచేందుకు కష్టపడాలి. బాగా చదువుకోవాలి. ఒకరికొకరు సహాయంగా ఉండాలి. అందరూ కలిసికట్టుగా పనిచేయాలి.. పెద్దలను గౌరవించాలి. కొత్త విషయాలను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండాలి. మరి ఇవన్నీ చేస్తానని నాకు మాట ఇస్తారుగా అప్పుడే నేను సంతోషంగా ఉంటాను చెప్పండి. ఈ అమ్మ మాట వింటారు కదా!

అందరూ: అలాగే అమ్మ తప్పకుండా వింటాం

భారత్ మాతాకీ జై భారత్ మాతాకీ జై భారత్ మాతాకీ జై

(వరుసగా నిలబడతారు మధ్యలో భారతమాత జెండా పట్టుకుని నిలబడుతుంది వెనుక నుంచి పాట... )


1. జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి జయ జయ జయ నరనారి శత సహస్ర హృదయనేత్రి
2. భారతమాతకు జేజేలు బంగరు భూమికి జేజేలు ఆ సేతు హిమాచల సస్యశ్యామల జీవధాత్రికి జేజేలు

– డా. సమ్మెట విజయ
m: 99898 20215

సైన్స్ వెన్నెల-22

# నేటికీ ఆశ్చర్యంగా మిగిలిపోయిన జార్జ్ గ్రీన్ వైజ్ఞానిక కృషి

శాస్త్రవేత్త జార్జ్ గ్రీన్ (George Green) జీవితం, ఆయన సాధించిన విజ్ఞాన శాస్త్ర ప్రగతి గురించి ఆలోచించినప్పుడు భారతీయ గణిత శాస్త్ర అద్భుతం శ్రీనివాస రామానుజన్ గుర్తుకు రాకమానరు. జార్జ్ గ్రీన్ 8, 9 ఏళ్ల వయసులో కేవలం ఒక్క సంవత్సరం మాత్రం పాఠశాలకు వెళ్లిన తర్వాత తండ్రికి సాయం చేస్తూ, సొంత అధ్యయనం చేసుకుంటూ తను మిల్లులో పనిచేస్తూ ఉండిపోయాడు. పెద్దగా పరిశోధనకు వనరులు లేని చోట అకస్మాత్తుగా తన 35 ఏట అద్భుతమైన పరిశోధనా పత్రాన్ని వెలువరించడం నిజంగా ఆశ్చర్యకరమైన విషయం. నేటికీ యావత్ ప్రపంచాన్ని విస్మయంతో పీడిస్తున్న సందర్భమిది. 1793-1841 మధ్యకాలంలో జీవించిన ఇంగ్లాండ్ దేశస్థుడైన జార్జ్ గ్రీన్ చేసిన కృషి మ్యాథమెటికల్ ఫిజిక్స్ మరీ ముఖ్యంగా విద్యుత్తు, అయస్కాంతత్వం, పొటెన్షియల్ థియరీ సంబంధించి చాలా రకాలుగా గొప్పగా దోహదం చేసింది. ఆయన ఆవిష్కరించిన గ్రీన్స్ థియరీ, గ్రీన్స్ ఫంక్షన్ వంటివి నేటికీ ఫిజిక్స్, ఇంజనీరింగ్ సంబంధించి కీలక స్థానాన్ని ఆక్రమించి ఉన్నాయి.




జార్జ్ గ్రీన్ తండ్రి పేరు కూడా అదే, ఆయన సంపన్నుడు, అతనికి ఒక గాలి మర ఉండేది, దానిని నిర్వహిస్తూ ఉండేవాడు. కుమారుడు కూడా దీనికి సంబంధించి సాయం చేస్తూ అది ఎలా పని చేస్తుందో ఆసక్తిగా గమనించడమే కాకుండా దాని సామర్థ్యం పెంచడానికి కృషి చేసేవాడు. ఆ మిల్లుకే ఆయన 1829లో వారసుడయ్యాడు. కేవలం సొంతంగా చదువుకోవడమే తప్ప విశ్వవిద్యాలయాల్లో చదువుకోకుండా; ఫ్రాన్స్, ఇంగ్లాండ్ దేశాలలో గణిత శాస్త్రానికి సంబంధించిన పరిశోధనలను అధ్యయనం చేయకుండా; ఫ్రెంచ్ భాషను నేర్చుకోకుండా తన 35వ ఏట ఒక అద్భుతమైన పనిని చేయడం అత్యంత విస్మయం కలిగిస్తోంది. 1828లో ఆయన An Essay on the Application of Mathematical Analysis to the theories of Electricity and Magnetism అనే 72 పేజీల పరిశోధనా పత్రాన్ని రాశాడు. అది నేటికీ ఎంతో ఖ్యాతిని గడించి, పరిశోధనలలో వాడబడుతోంది. ఆ కాలంలో రాయల సొసైటీ లేదా కేంబ్రిడ్జి ఫిలసాఫికల్ సొసైటీ ద్వారా మాత్రమే పరిశోధనా పత్రాలు వెలువరించబడేవి. అయితే పెద్దగా చదువుకోని తన వంటి వ్యక్తికి ఈ రెండు సంస్థలలో అవకాశం ఉండక పోవచ్చునని, తన సొంత ఖర్చుతో దీనిని ప్రచురించాడు. ఈ కృషి గురించి పెద్ద ఎత్తున గుర్తింపు లభిస్తుందని జార్జ్ గ్రీన్ భావించాడు, అలాంటి అద్భుతం జరగలేదు కానీ, గణితం తెలిసిన భూస్వామి ఎడ్వర్డ్ బ్రూమ్ హెడ్ ఈ పరిశోధనా పత్రాన్ని చూసి ముచ్చటపడి జార్జ్ గ్రీన్ ను మరింత పరిశోధన చేయమని ప్రేరేపించారు.

జార్జ్ గ్రీన్ ఈ సిద్ధాంత పత్రంలో అంతక్రితం జరిగిన పరిశోధనలను సాధారణీకరించి పొటెన్షియల్ (Potential) అనే భావనను, మాటను తొలిసారి విజ్ఞాన శాస్త్రంలో ప్రయోగించి వివరించారు. అదే నేడు 'గ్రీన్స్ థీరమ్' గా ప్రసిద్ధి చెందింది. లార్డ్ కెల్విన్‌గా ప్రఖ్యాతులైన విలియం థామ్సన్ వంటి వారు తర్వాత కాలంలో చేసిన అమోఘమైన విజ్ఞాన శాస్త్ర కృషికి ఇది పునాది వంటిది. పొటెన్షియల్స్ సంబంధించి జార్జ్ గ్రీన్ చేసిన కృషి ఒకరకంగా కార్ల్ ఫ్రెడ్రిచ్ గౌస్ (Carl Fedrich Gauss) కృషికి సమాంతరంగా సాగుతున్నదని కూడా చెప్పవచ్చు. జార్జ్ గ్రీన్ తన 40వ ఏట అంటే 1833లో ఎడ్వర్డ్ బ్రూమ్ ప్రోత్సాహంతో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్‌లో చేరి 1837 లో తరగతిలో నాలుగో వ్యక్తిగా నెగ్గారు. కేంబ్రిడ్జ్‌లో చదివే కాలంలో ఆయన ఫ్లూయిడ్ ఈక్విలిబ్రియమ్, ఎలిప్సాయిడ్ అట్రాక్షన్, హైడ్రోడైనమిక్స్, రిఫ్లెక్షన్ అండ్ రిఫ్రాక్షన్ ఆఫ్ లైట్ అండ్ సౌండ్ వంటి వైజ్ఞానిక అంశాలలో పరిశోధనా పత్రాలు ప్రచురించారు. తనను పీడిస్తున్న అనారోగ్యం కారణంగా తప్పనిసరియై కేంబ్రిడ్జి నుంచి 1840లో సొంత ఊరికి వెళ్లి పోయేలా చేసింది. చివరికి 47 ఏళ్ల వయసులో అంటే 1841 మే 31న ఇన్ ఫ్లుయంజా సమస్యతో జార్జ్ గ్రీన్ కాలం చేశారు. ఆయనకు సంబంధించిన చిత్రంగానీ, ఫోటో గాని లభ్యంగా లేదు.


– డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు,
ప్రముఖ సైన్స్ రచయిత
m : 9440732 392




# పెరటిలోని ఔషధ మొక్కలు

ప్రకృతి ఇచ్చిన ఈ వరాలు మన ఆరోగ్యానికి మంచి దారులు

## ఔషధ మొక్కలు - శాస్త్రీయ నామాలు

**1 కలబంద**



అలోవేరా (Alo vera)

**2 తిప్ప తీగ**



టీనోస్పోరా కార్డిఫోలియా
(Tinospora cordifolia)

**3 తులసి**



ఆసిమమ్ సాంక్టమ్
(Oscimum sancturm)

**4 మెంతి**



ట్రిగొనెల్లా ఫోనింగ్రేకమ్
(Trigonella foenum-graecum)

**5 పుదీనా**



మెంథా, పైపరేటా
(Mentha piperita)

**6 వేప**



అజాడిరిక్టా, ఇండికా
(Azadirachta)

**7 నిమ్మ**



సిట్రస్, లెమన్
(Citrus, limon)

**8 అల్లం**



జింజిబర్, ఆఫిసినేల్
(Zingiber)

**9 పసుపు**



కర్కుమా లాంగా
(Curcuma longa)

**10 వావిలీ**



విటెక్స్ నెగుండో
(Vitex / negundo)

**11 కరివేపాకు**



మురయ్య కోయినిగి
(Murrya koenigii)

**12 బిల్లగన్నేరు**



కాథరాంథస్ రోసియస్
(Catharanthus roseus)

**13 ఉత్తరేణి**



ఎఛిరాంథస్ ఆస్పరా
(Achyranthes aspera)



**మన పెరటితోట మన ఆరోగ్యానికి పూలబాట.**

కరోనా కాలంలో ఇది అందరికి అవగాహన ఉంటుంది. మనం వాడే మందులలో అంతర్గతంగా ఇవే ఉంటాయి. అందుకే వీటిని సరియైన విధంగా అవగాహనతో వీటిని వాడుతుంటే ఆరోగ్యంగా ఉంటాం.

- రోగనిరోధక శక్తిని పెంచుతాయి.
- అనేక వ్యాధులను నివారించడంలో సహాయకారం.
- ప్రకృతి సిద్ధమైన, సురక్షితమైనవి.
- ప్రతి ఇంటి పెరటిలో ఉండాల్సిన ఆరోగ్య రక్షకాలు.



**ఒక మంచి అలవాటు - ఔషధ మొక్కల పెంపకం**

– 'ఆరోగ్యం-విజ్ఞానం' పుస్తకం నుండి..

✧ చెట్టు - చేమ

# ఇరికి చెట్టు



హాయ్ బాలలూ బాగున్నారా..! బాల చెలిమిలో వస్తున్న కథలను, వివిధ అంశాలను చదువుతున్నారా.. గమ్మత్తు గమ్మత్తు విషయాలతో మన ముందుకు వస్తున్న ఈ నెల బాల చెలిమి సంచికలో "ఇరికి చెట్టు" గురించి బోలెడన్ని విషయాలు తెలుసుకుందాం. మరెందుకు ఆలస్యం? ఇక మీరు కూడా రాయడం మొదలు పెట్టండి.


ఇరికి చెట్టు గురించి ఎప్పుడైనా విన్నారా? చూశారా..? ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా కనిపించే ఒక అద్భుతమైన ఔషధ వృక్షం ఇరికి చెట్టు. ఎనకటి కాలంలో బాల్యంలో ఇరికిపండ్లను బాగా తినేవారు. మామూలుగా ఇరికి పండ్లు మే, జూన్ నెలలో ప్రారంభమై జూలై చివరి వరకు సంవత్సరానికి ఒకసారి మాత్రమే ఎక్కువగా ఈ పండ్లు చెట్లకు కనిపిస్తాయి. ప్రస్తుతానికి అక్కడక్కడ మాత్రమే ఇరికి చెట్లు కనిపిస్తున్నాయి. నేటి తరానికి ఈ చెట్టు గురించి అంతగా తెల్వదు అనుకుంట. ఈ చెట్టును నక్కెర చెట్టు, బంక పండ్ల చెట్టు అని వివిధ ప్రాంతాలలో ఒక్కోరకంగా పిలుస్తారు. ఇరికి పండ్లను ఆంగ్లంలో 'ఇండియన్ చెర్రీ' లేదా 'లాసోరా' అంటారు. బంగారు వన్నెలో సీసపు గోటిల సైజు లో ఉండే ఇరికి పండ్లు పులుపు, వగరు, తీపి రుచులను కలిగిన మిశ్రమ రుచి కలిగిన పండ్లు. ఈ పండ్లను గట్టిగా వత్తితే లోపల జిగురు లాంటి పదార్థంతో పాటు గట్టి గింజ కలిగి ఉంటుంది. పై తొక్క తీసి గుజ్జు తిని గింజను ఊసేయాలి. ఈ పండ్లను ఆరు, ఏడు సంవత్సరాల పిల్లలు తినకపోవడమే మంచిది. ఎందుకంటే లోపల ఉండే గింజ గొంతులో ఇరికే ప్రమాదం ఉంటుంది. నేను కూడా చిన్నప్పుడు ఎన్నో తిన్నాను. ఇరికి చెట్ల స్వస్థలం చైనా, జపాన్, తైవాన్, ఇండియా అయినప్పటికీ, పాకిస్తాన్, శ్రీలంక, కాంబోడియా, లావోస్, ఫిలిప్పీన్స్, మలేషియా, ఆస్ట్రేలియా వంటి వివిధ దేశాల్లో కూడా విరివిగా కనిపిస్తాయి. దీని కలప గట్టిగా ఉన్నప్పటికీ, వర్షానికి తడిస్తే త్వరగా మెత్తబడిపోతుంది. అందుకే ప్రజలు దీంతో తయారు చేసిన పనిముట్లు వాడరు. సాధారణంగా ఇరికి చెట్లు కాలువ గట్ల పైన, కొద్దిగా నీటి తావుల యందు పెరుగుతాయి.


**ఇరికి చెట్టు వల్ల ప్రయోజనాలు :**

- ఈ పండ్లను కోతులు, పక్షులు చాలా ఇష్టంగా తింటాయి.
- ఇరికి చెట్టు పండ్లు, బెరడు ఔషధాలలో బాగా ఉపయోగిస్తారు.
- ఎండాకాలం ముగిసి వర్షాకాలం ప్రారంభమయ్యే దశలో ఈ పండ్లు తినడం వల్ల శరీరం సమతా స్థితిలో ఉంటుంది.
- రోజుకు డజన్ పండ్ల వరకు తినడం వల్ల సీజనల్ వ్యాధులు ఉబ్బసం, దగ్గు, జ్వరం, విరేచనాలు వంటి వ్యాధులను అరికట్టవచ్చు.
- ఈ పండ్లు తినడం వల్ల ఇమ్యూనిటీ పవర్ పెరిగి వ్యాధి నిరోధక శక్తి వేగంగా పెరుగుతుంది.
- ఈ పండ్లను తిన్నవారికి మలబద్ధకం కూడా తగ్గుతుంది. అంతేగాకుండా ప్రేగులను బ్యాలెన్స్‌లో ఉంచుతాయి.
- గ్యాస్ట్రిక్ సమస్యలను ఈ పండ్లు తినడంతో కాపాడు కోవచ్చు. కీళ్ల నొప్పులు నరాల నొప్పులు, కండరాల నొప్పులు కూడా తగ్గుతాయి.
- ఇరికి చెట్టు యొక్క ఆకులు, బెరడు గాయాలు అయిన చోట రాస్తే మానుతాయి.
- ఇరికి చెట్టు ఆకులను నీళ్లలో వేసి వేడి చేసి ఆ నీటితో స్నానం చేస్తే ఒళ్ళు నొప్పులు తగ్గుతాయి.

చూసి, చదివారు కదా బాలలూ... ఇరికి చెట్టు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మరెందుకు ఆలస్యం? మనం కూడా ఈ చెట్లను రక్షించే ప్రయత్నం చేద్దాం. ఇరికి పండ్లు కనిపిస్తే తిందాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655


కొత్త కరెన్సీ
విన్న కథకు అనుసృజన : జుగాష్‌విలి
బొమ్మలు:
గోపి : తాతయ్యా! ఈసారి కథ నువ్వు చెప్పాలి.
తాతయ్య : అలాగే ఇలా రా! ఒక నగరంలో ధనరాజ్ అనే ధనవంతుడు ఉన్నాడు. అతనికి డబ్బు పిచ్చి. మంచి చెడు విచక్షణ లేదు. ఎలాగైనా సరే. ఏం చేసైనా సరే డబ్బు సంపాదించాలి. ఈ ధ్యాసలో భార్యా బిడ్డలను కూడా పట్టించుకునేవాడు కాదు.
గోపి : పాపం! వాళ్లెంత బాధపడ్డారో!
తాతయ్య : బాధపడుతూనే అతన్ని మార్చాలని, అతని ప్రేమను పొందాలని ప్రయత్నించారు. చివరికి విసిగిపోయి అతన్ని వదిలి వెళ్ళిపోయారు.
గోపి : ఇప్పుడైనా మారాడా?
తాతయ్య : పోతే పోయారులే! డబ్బుంది చాలు అనుకున్నాడు. కసిగా మరింత సంపాదనలో మునిగిపోయాడు. ఒక రోజు కారులో వెళ్తుండగా ఎఫ్.ఎం. రేడియోలో ఒక సూక్తి వినిపించింది. మీరు చనిపోయినప్పుడు మీ సంపదను మీతో పాటు తీసుకెళ్ళలేరు అనేది ఆ మాట.
తాతయ్య : అవును గోపి. మనం చాలా సార్లు చాలా మాటలు వింటుంటాం. వదిలేస్తుంటాం. కానీ ఏదో ఒక సమయంలో ఏదో ఒక మాట మనల్ని పట్టుకుంటుంది. ఈ మాట ధనరాజ్‌ను పట్టుకుంది.
గోపి : ఇది అందరూ ఎప్పుడో విన్నమాటే కదా!
గోపి : ఫర్లేదే...
తాతయ్య : అతను చాలా బాధపడ్డాడు, భయపడ్డాడు. కష్టపడి సంపాదించిన ఈ డబ్బు నా వెంట వచ్చే ఉపాయం ఏమీ లేదా అని ఆలోచించాడు. ఆఫీసులో ఎంప్లాయిస్ అందర్నీ సమావేశపరచి తనకు మార్గం చూపిన వారికి పెద్ద బహుమతిని యిస్తానని ఆశపెట్టాడు. అందరూ అలాగే సార్ అన్నారు. బయటికి వచ్చి నవ్వుకున్నారు.


గోపి : ఎవరైనా ఉపాయం చెప్పారా?
తాతయ్య : లేదు. నెలరోజులైనా ఎవరూ ఏ సలహా యివ్వలేదు. చివరికి పేపర్లో ప్రకటన యిచ్చాడు.
గోపి : ఈసారన్నా ఎవరైనా వచ్చారా!
తాతయ్య : చివరికి ఓ స్వామీజీ వచ్చాడు. ధనరాజ్ సంతోషించి ఉపాయం చెప్తారా అన్నాడు. చెప్తాను. మీరెప్పుడైనా అమెరికా వెళ్లారా అంటే చాలాసార్లు వెళ్లానన్నాడు. ఈ డబ్బు చెల్లిందా అంటే లేదు. దాలర్లు చెల్లాయన్నాడు. లండన్ వెళ్ళారా! అక్కడ ఈ డబ్బు చెల్లిందా అంటే లేదు పౌండ్లు చెల్లాయన్నాడు. చూసారా! మీ డబ్బులు ఈ లోకంలోనే చెల్లలేదు. అక్కడ ఎలా చెల్లుతాయి అన్నాడు.
గోపి : మరెలా?
తాతయ్య : అక్కడ చెల్లే కరెన్సీ వేరే వుంది. అది సేవాదృక్పథం. దాన్ని మీరు సంపాదించాలి. మీ డబ్బుతో ఇతరుల అవసరాలకు సహాయపడటంలో అది మీకు దక్కుతుంది. ఆ కరెన్సీతో మీరు అక్కడ యిక్కడి వలె సుఖాన్ని, ఆనందాన్ని పొందవచ్చు.
గోపి : భళే కరెన్సీ...
తాతయ్య : ధనరాజ్‌కి జ్ఞానోదయమైంది. తప్పు తెలుసుకున్నాడు. భార్యాపిల్లలను తెచ్చుకున్నాడు. తన దగ్గరున్న డబ్బును పేద ప్రజల అవసరాలకు వెచ్చించి, మంచివాడు, దయామయుడు అనే గౌరవాన్ని కరెన్సీని సంపాదించుకున్నాడు.
గోపి : కథ బావుంది తాతయ్యా.
తాతయ్య : అంటే సరిపోదు. మీరు కూడా మీ కిడ్డీ బ్యాంకులో దాచుకున్న డబ్బులోంచి కొంత పేద విద్యార్థులకు సహాయం చేయగల దయాగుణాన్ని అలవాటు చేసుకోవాలి.

స్పోర్ట్స్

# స్పెయిన్ విశ్వవిజేత



## ఫిఫా ప్రపంచ కప్ 2026లో అర్జెంటినాపై 1-0తో విజయం

## మెస్సీ చివరి ప్రపంచ కప్ కల నెరవేరలేదు


ఉత్తర అమెరికాలోని అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్త ఆతిథ్యంతో నిర్వహించిన ఫిఫా ప్రపంచకప్-2026 ఫుట్‌బాల్ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. తొలిసారిగా 48 దేశాలు పాల్గొన్న ఈ మెగా టోర్నమెంట్‌లో ప్రపంచంలోని అగ్రశ్రేణి జట్లు హోరాహోరీగా తలపడగా, న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో స్పెయిన్ 1-0తో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాను ఓడించి రెండోసారి ప్రపంచకప్ ట్రోఫీని సొంతం చేసుకుంది. 2010 తర్వాత మళ్లీ విశ్వవిజేతగా అవతరించిన స్పెయిన్ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించింది. ఫైనల్ మ్యాచ్ ప్రారంభం నుంచే స్పెయిన్ బంతిపై ఆధిపత్యం ప్రదర్శించింది. రోడ్రి, పెడ్రి, లామిన్ యమాల్, నికో విలియమ్స్, ఫెర్రన్ టొరెస్‌ల సమన్వయంతో స్పానిష్ జట్టు వరుస దాడులు చేసింది. మ్యాచ్ మొత్తంలో స్పెయిన్ 20 షాట్లు నమోదు చేయగా, అందులో 11 టార్గెట్‌పై ఉన్నాయి. మరోవైపు అర్జెంటీనా నిర్ణీత సమయంలో గోల్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని ఒక్క షాట్ కూడా కొట్టలేకపోయింది. గోల్‌కీపర్ ఎమిలియానో మార్టినెజ్ అసాధారణ ప్రతిభ కనబరిచి యమాల్, ఓల్మో, టొరెస్ తదితరుల పలు ప్రమాదకర ప్రయత్నాలను అడ్డుకోవడంతో మ్యాచ్ గోల్‌రహితంగా ఎక్స్‌ట్రా టైమ్‌కు చేరింది. ఇంజూరీ టైమ్‌లో ఎంజో ఫెర్నాండెజ్ రెడ్‌కార్డు అందుకోవడంతో అర్జెంటీనా పది మంది ఆటగాళ్లతోనే పోరాడాల్సి వచ్చింది. ఎక్స్‌ట్రా టైమ్ రెండో భాగంలో స్పెయిన్ ఆధిపత్యం మరింత పెరిగింది. 106వ నిమిషంలో నికో విలియమ్స్ ఎడమవైపు నుంచి అందించిన అద్భుతమైన క్రాస్‌ను ఫెర్రన్ టొరెస్ శక్తివంతమైన షాట్‌తో గోల్‌గా మలిచాడు. అదే మ్యాచ్ విజేతను నిర్ణయించిన గోల్‌గా నిలిచింది. అనంతరం అర్జెంటీనా సమం చేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో స్పెయిన్ చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. లియోనెల్ మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా ఫార్వర్డ్ లైన్ స్పెయిన్ కట్టుదిట్టమైన రక్షణను ఛేదించలేకపోయింది. కెరీర్‌ను మరో ప్రపంచకప్ విజయంతో ముగించాలని ఆశించిన మెస్సీ కల నెరవేరకపోయినా, టోర్నీ మొత్తం అతని నాయకత్వం, అనుభవం అభిమానుల ప్రశంసలు అందుకుంది. ఈ విజయంతో పురుషుల, మహిళల ఫిఫా ప్రపంచకప్ టైటిళ్లను ఒకేసారి గెలుచుకున్న తొలి దేశంగా స్పెయిన్ చరిత్ర సృష్టించింది. ప్రపంచ ఫుట్‌బాల్‌లో స్పెయిన్ స్వర్ణయుగాన్ని మరోసారి చాటిచెప్పిన ఈ విజయం ఆ దేశ క్రీడా చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచింది.

టోర్నీలో అత్యధికంగా 10 గోల్స్ చేసిన ఫ్రాన్స్ కెప్టెన్ కిలియన్ ఎంబాపే వరుసగా రెండోసారి గోల్డెన్ బూట్ అవార్డును గెలుచుకున్నాడు. మెస్సీ 8 గోల్స్, 4 అసిస్టులతో రెండో స్థానంలో నిలిచాడు. విజేత స్పెయిన్‌కు సుమారు రూ.481 కోట్ల ప్రైజ్‌మనీ, రన్నరప్ అర్జెంటీనాకు రూ.317 కోట్లు లభించాయి. ఈ ప్రపంచకప్‌లో మొత్తం 308 గోల్స్ నమోదై టోర్నమెంట్ చరిత్రలో అత్యధిక గోల్స్ నమోదైన ఎడిషన్‌గా కొత్త రికార్డు సృష్టించింది. సాంకేతిక నైపుణ్యం, యువ ఆటగాళ్ల ప్రతిభ, ఉత్కంఠభరిత పోటీలు, కొత్త రికార్డులు, అత్యున్నత స్థాయి నిర్వహణతో ఫిఫా ప్రపంచకప్-2026 ఫుట్‌బాల్ చరిత్రలో చిరస్మరణీయ టోర్నమెంట్‌గా నిలిచిపోయింది.

– బాలచెలిమి డెస్క్

కథ

# పిచ్చుకకు గుణపాఠం



ఓ చిట్టి అడవిలో ఒక పిచ్చుకల గుంపు ఉండేది. ఆ గుంపులోని ఒక పిల్ల పిచ్చుక ఎవ్వరికీ చెప్పకుండా దూరంగా ఎగిరిపోయింది. చాలా దూరం వెళ్ళాక దానికి ఒక పెద్ద సముద్రం కనిపించింది.

అది అప్పటిదాకా సముద్రాన్ని చూసి ఉండలేదు. దాంతో దాని ఆనందానికి అవధులు లేకుండా పోయింది. సముద్రం అలలనే చూస్తూ పాటలు పాడింది. బాగా అలసిపోయాక సముద్రపు ఒడ్డున కూర్చుంది. అలలు ఎగిరెగిరి వస్తూ ఉంటే ఉబ్బితబ్బిబ్బయ్యింది. అవి తన కాళ్ళ వరకు వచ్చి వెళ్ళసాగాయి. దాంతో దానికి మరింత ధైర్యం వచ్చి మరికొంత ముందుకు నడిచింది. అలలు దాని దగ్గరకు రాకుండానే వెళ్ళిపోయాయి. అలలు తనను చూసి భయపడుతున్నాయని అనుకుంది. ఈ విషయాన్ని వెంటనే తన బంధు మిత్రులకు చెప్పాలని రివ్వున ఎగురుకుంటూ చిట్టి అడవిలోకి వెళ్ళింది.

గూడు నుంచి చెప్పాపెట్టకుండా వెళ్ళినందులకు అమ్మ పిచ్చుక తిట్టిపోసింది. 'చెప్పకుండా వెళ్ళింది తప్పే కానీ, మీరెవ్వరూ చూడని సముద్రాన్ని నేను చూశాను' అని గొప్పగా చెప్పింది పిల్ల పిచ్చుక.

బంధు మిత్రులందరినీ కూర్చోబెట్టి 'సముద్రం ఎంతో పెద్దది. మనం చూసిన కాలువలకన్నా, చెరువులకన్నా, నదులకన్నా పెద్దది. దాని నిండా నీలి రంగు నీళ్ళు ఉంటాయి. దాని లోతు మనం అంచనా పట్టలేము. దండిగా నీళ్ళు ఉంటాయి కానీ, మనం తాగడానికి పనికి రావు. మీరందరూ వస్తానంటే నేను మిమ్మల్ని తీసుకెళ్తాను. చూస్తే ఆశ్చర్యపోతారు. తమాషా ఏమిటంటే అంత పెద్ద సముద్రానికి నేనంటే భయం. నేను దాని ముందర నిలబడితే అది నన్ను తాకడానికి కూడా జంకింది" అని గర్వంగా చెప్పింది.

అమ్మ పిచ్చుక గట్టి గొంతుతో "మనకి సముద్రం గురించి పూర్తిగా తెలియదు. అయినా అది మనకు తెలిసిన ప్రాంతం కాదు. అనువు కాని చోట అధికుల మనరాదని గుర్తు పెట్టుకో" అని హెచ్చరించింది.

"నేను వయసులో చిన్న దానినైనా పెద్ద సాహసం చేశానని మెచ్చుకోక నన్ను తిట్టడం బాలేదు, కొండను ఢీ కొట్టే గాలి కూడా ఉంటుందని వినలేదా?" అని బుంగ మూతి పెట్టింది పిల్ల పిచ్చుక.

"సరే, వెళ్ళి చూసి వద్దాం, నువ్వు చెప్పింది నిజమో కాదో తేలుద్దాం" అని చెప్పి అమ్మ పిచ్చుక బయలుదేరింది. మిగిలిన పిచ్చుకలు కూడా "మేమెప్పుడూ సముద్రాన్ని చూడలేదు, మేము కూడా వస్తాం" అని చెప్పి బయలు దేరాయి.

అందరూ పిల్ల పిచ్చుక నాయకత్వంలో సముద్రం దగ్గరికి వెళ్ళాయి. సముద్రాన్ని చూస్తూ ఆకాశంలోనే నాట్యం

చేశాయి. రకరకాల పాటలు పాడాయి. అందమైన సముద్రం ముందు ఇసుక గట్టు పైన అన్ని పిచ్చుకలూ వరుసగా కూర్చున్నాయి. తమతో పాటు తెచ్చుకున్న తిండి గింజలను తింటూ ఆనందించసాగాయి.

పిల్ల పిచ్చుక "సముద్రాన్ని చూడటం పూర్తి అయ్యింది కదా, నేనంటే సముద్రానికి ఎంత భయమో చూపిస్తాను" అని అలల ముందర నిలబడింది. పెద్ద అల ఒకటి పిల్ల పిచ్చుక దగ్గరగా వచ్చి వెళ్ళిపోయింది. వెనుక ఒడ్డు పైన కూర్చుని ఉన్న పిచ్చుకలు చప్పట్లు చరిచాయి. 'నువ్వంటే సముద్రానికి భయమన్నది వాస్తవమే' అని ఎగిరెగిరి చెప్పాయి. పిల్ల పిచ్చుకకి కళ్ళు నెత్తికెక్కాయి. విజయగర్వంతో ఇసుకను కాలితో సముద్రం వైపు తన్నింది. 'హ హ హ' అని అరిచింది. అప్పటికప్పుడే అన్ని పిచ్చుకలూ ఇసుకలోని గవ్వల్ని ఏరి కుప్పగా చేశాయి. దాని పైన పిల్ల పిచ్చుకను కూర్చోబెట్టి రాగాలు తీశాయి. దొరికిన పూలతో సన్మానం చేశాయి.

ఇంతలో పెద్ద అల ఒకటి వచ్చిగవ్వలకుప్పను, దాని మీదున్న పిల్ల పిచ్చుకను సముద్రంలోకి ఈడ్చింది. గవ్వలకుప్ప పూర్తిగా సముద్రంలోకి వెళ్ళిపోయింది. పిల్ల పిచ్చుక ఎలాగోలా తప్పించుకుని 'బతుకు జీవుడా' అన్నట్లుగా ఆకాశంలోకి ఎగిరింది. సముద్రాన్ని చూసి మొదటి సారిగా బెదిరింది పిల్ల పిచ్చుక. సముద్రం శక్తి చాలా గొప్పదని గ్రహించింది. తప్పు జరిగిందని అమ్మ పిచ్చుకని క్షమాపణలు కోరింది.

'ఏనుగు ముందు చీమ వీరంగం చేసినట్లుగా ఉంది మన వ్యవహారం' అని తెలుసుకున్న పిచ్చుకల గుంపు అక్కడి నుంచి అడవిలోకి తుర్రుమని ఎగురుకుంటూ వెళ్ళిపోయాయి.


**- ఆర్. సి. కృష్ణస్వామి రాజు**
తిరుపతి
m: 9393662821


## కేంద్ర సాహిత్య అకాడమీ వేదికపై మెరిసిన భూక్యా వర్షిత



కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహించిన దక్షిణ భారత యువ రచయితల ఉత్సవంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలం, పాపకొల్లు ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని భూక్యా వర్షిత బంజారా భాషా రచయిత్రిగా పాల్గొంది. ఆమె "జంక్ ఫుడ్ తింటే..." అనే తన కథను బంజారా, తెలుగు భాషల్లో ఆకట్టుకునేలా వినిపించింది. తెలంగాణ సారస్వత పరిషత్తు, తెలంగాణ సాహిత్య అకాడమీ, బాల చెలిమి, తదితర సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో ప్రతిభ కనబరిచి పలు బహుమతులు అందుకుంది.



## వేమన పద్యం

పట్టు పట్టరాదు పట్టి విడువరాదు
పట్టెనేని బిగియఁబట్టవలయు
బట్టి విడుచుకున్న బరగ యిచ్చుట మేలు
విశ్వదాభిరామ వినురవేమ!

తాత్పర్యం : పట్టుదలయే వహింపరాదు. వహించినచో ఆ పట్టు వదలరాదు. పట్టిన పట్టు మధ్యలో విడుచుట కంటే మరణము మేలు.



కథ

# అన్నదమ్ములు

## యావ్‌గెనీ షవర్ట్స్



అనగనగాఒక ఊరిలో ఇద్దరు అన్నదమ్ములుండేవారు. వాళ్ళు చీటికి మాటికి ఒకరితో ఒకరు పోట్లాడుకుంటూ ఉండేవారు. వాళ్ళ నాన్న, ఇంటి దగ్గరలోని అడవికి అధికారి. ఓ రోజు రాత్రి ఆ పిల్లల తల్లిదండ్రులు గుర్రబ్బగ్గి ఎక్కి నగరానికి బయలుదేరారు.

తండ్రి పెద్దవాడితో, "పెద్దోడా! నేను మీ అమ్మ, నగరానికి వెళ్లి ఓ మూడు రోజుల్లో వస్తాము. నీకు, తమ్ముడికి 'కొత్త సంవత్సరం కోసం బహుమతులు' తీసుకొని వస్తాము. తమ్ముడితో గొడవపడకుండా జాగ్రత్తగా చూసుకో" అన్నాడు.

"సరే, నాన్నా" అన్నాడు పెద్దోడు.

మొదటి రెండు రోజులు ప్రశాంతంగా గడిచాయి. మూడవరోజు సాయంత్రం ఆరు గంటలయింది. పెద్దోడు 'సింద్‌బాద్ సాహస యాత్రలు' పుస్తకం చదువుతున్నాడు.

కథ ఆఖరి ఘట్టంలో ఉంది. చిన్నోడికి చిరాకు పుడుతూ ఉంది. ఏం తోచక పెద్దోడిని కదిలించాడు.

"నన్ను ప్రశాంతంగా ఉండనీయ్" పెద్దోడు అరిచాడు.

చిన్నోడిని తలుపు బయట ఉంచి, గడియ పెట్టుకున్నాడు. అయిదు నిమిషాల తరువాత తలుపు తీద్దామనుకున్నాడు. పుస్తకంలో పడి ఆ సంగతే మరచి పోయాడు. సమయం రాత్రి ఏడు గంటల యాభైయైదు నిమిషాలయింది. పెద్దోడికి ఉన్నట్లుండి చిన్నోడు గుర్తొచ్చాడు. తలుపు తెరచి చూస్తే, చిన్నోడు లేడు. ఎంతో గాలించాడు. లాభం లేకపోయింది. బాధపడ్డాడు. రాత్రి ఎనిమిది గంటలకు తల్లిదండ్రులు వచ్చారు. చిన్నోడి గురించి అడిగారు. జరిగినదంతా చెప్పాడు.

నాన్న పెద్దోడిని చివాట్లు పెట్టి, బయటికి గెంటేసి, "చిన్నోడిని తీసుకొని వస్తేనే ఇంటికిరా!" అని హెచ్చరించాడు.

అడవంతా గాలించాడు పెద్దోడు. కాని చిన్నోడి జాడ కనిపించలేదు. చాలా దూరం నడిచాడు. మంచుతో కప్పబడిన కొండలు కనిపించాయి. పొడవైన పైన్ వృక్షాలు కనిపించాయి. కాని చిన్నోడు కనిపించలేదు. నేలంతా మంచు. కాని తనకి చలి వేయలేదు.

ఎందుకా అని ఆలోచిస్తుండగా, "నేనే నిన్ను వెచ్చగా వుంచాను" అన్న ఓ గొంతు వినిపించింది.

పెద్దోడు ఆశ్చర్య పోయాడు. "ఎవరు మీరు అడవి తాతా?"

"కాదు, నేను ఈ అడవికి ముత్తాతని" అన్నాడు తెల్లగడ్డంతో పొడవుగా ఉన్న ముసలతను.

"నా తమ్ముడు మీకు కనిపించాడా?" అని అడిగాడు పెద్దోడు.

"నాతో రా చూపిస్తా" అన్నాడు ముత్తాత.

వాళ్ళు చాలా దూరం నడిచాక మంచుతో తయారైన రాజభవనం కనిపించింది. అందులో ప్రతి గోడ, ప్రతి వస్తువు, ఆహారం, పక్షులు, ఉడుతలు, కుందేళ్ళు అన్ని మంచుతో చేసినవి ఉన్నాయి. అది చాలా పెద్ద గది.

"ఇలాంటి గదులు ఎన్ని ఉన్నాయి ఈ భవనంలో?" అడిగాడు పెద్దోడు.

మొత్తం నలభై తొమ్మిది గదులు. నలభై తొమ్మిదవ గదిలో చిన్నోడు ఉన్నాడు.

"అతను నేను చెప్పినట్టు వినలేదు. అందుకే నలభై తొమ్మిదవ గదిలో బంధించాను, నువ్వు నేను చెప్పినట్టు వినాలి. లేదంటే నీకూ అదే గతి పడుతుంది" అని హెచ్చరించాడు ముత్తాత.

"నీ గది నంబర్ ఇరవై అయిదు" అని చెప్పాడు.

కొన్ని రోజులు గడిచాయి. పెద్దోడు, ముత్తాత చెప్పినట్టు బుద్ధిగా ఉంటున్నాడు. మంచు ఉడుతలను, మంచు కుందేళ్ళను, మంచు పక్షులను, గది మధ్యలోని చలిమంట దగ్గర పెట్టి, మామూలు పక్షులుగా జంతువులుగా మారుస్తున్నాడు.

ఓ రోజు రాత్రి ముత్తాత గురక పెట్టి నిద్ర పోతున్నప్పుడు, పెద్దోడు నలభై తొమ్మిదో గదికి వెళ్లాడు. దాని మంచు తలుపు ఎంత కొట్టినా కొంచెం కూడా కదలేదు. నిరాశగా వెనుదిరిగాడు.


మరికొన్ని రోజులు గడిచాయి. పెద్దోడికి తన జేబులో ఉన్న అగ్గిపెట్టె గుర్తుకు వచ్చింది. అడవిలో కొన్ని దుంగలను ఏరుకొచ్చాడు. నలభై తొమ్మిదో గది బయట వాటిని పేర్చి, నిప్పు పెట్టాడు. కాని తలుపు పగలగొట్టలేకపోయాడు.

పెద్దోడు బతికించిన ఉడుతలు, పిచుకలు, కుందేళ్ళు రోజూ పెద్దోడితో ఆడుకునేవి. ఓ రోజు రాత్రి ముత్తాత గాఢ నిద్రలో ఉండగా, ఓ పిచుక ముత్తాత దగ్గర నుండి 'మంచు తాళం చెవి' దొంగిలించి పెద్దోడికిచ్చింది. పెద్దోడు

## సామెతలు

- అడుసు తొక్కనేల? కాల కడగనేల.
- ఆశకు ముదిమి లేదు, ఆర్థిక సౌఖ్యము లేదు.
- ఇంటి గుట్టు లంకకు చేటు.
- ఉలిపికట్టెకేలరా ఊళ్లో పెత్తనాలు.
- ఎగిరెగిరి దంచినా అంతే కూలి ఎగరక దంచినా అంతే కూలి.
- ఏనుగును చూసి కుక్కలు మొరిగినట్లు.
- ఒళ్ళు వంగని వాడు దొంగలతో కలిసినాడట.
- కంచె వేసినదే కమతం.
- గోధుమలు వేస్తే బాదములు పండునా.
- ఘడియ తీరుబాటు లేదు, దమ్మిడీ ఆదాయం లేదు.

– బాలచెలిమి డెస్క్



నలభై తొమ్మిదో గదికి వెళ్లాడు. తాళం పెట్టడానికి చోటు కనిపించలేదు. పిచుకలు తమ ముక్కులతో మంచు తలుపుని పొడిచాయి. చివరికి తాళం పెట్టే చోటు కనిపించింది.


తలుపు తెరిచాడు. మంచుశిలలా మారిన చిన్నోడు దిగులుగా కనిపించాడు. చిన్నోడిని భుజాన వేసుకుని ఆ మంచుభవనం నుండి పారిపోయారు.

నిద్రలేచిన ముత్తాత వెంబడించాడు. కాని పక్షుల, జంతువుల సహాయంతో తప్పించుకున్నారు.

సూర్యోదయమయింది. చిన్నోడి ఒంటి మీది మంచు కరిగి మామూలు మనిషయ్యాడు. చిన్నోడు, పెద్దోడు ఆనందంతో ఒకరిని ఒకరు కౌగిలించుకున్నారు. క్షేమంగా ఇంటికి చేరారు. వాళ్ళ తల్లిదండ్రులు, పిల్లలు తిరిగి వచ్చిన ఆనందంతో పండగ చేసుకున్నారు.

స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల
m : 81792 73971

ఇంగ్లిష్ : ది లిటిల్ స్పారో
రచయిత : మాక్సిం గోర్కి
ఇంగ్లీష్ అనువాదం : రాబర్ట్ డాగ్లిష్



# తొందరపాటు

పల్వంచ గ్రామంలో గంగయ్య, గంగమ్మ అనే దంపతులు ఉండేవారు. వాళ్లకి చాలా సంవత్సరాల తర్వాత ఒక కూతురు పుట్టింది. ఆమెకు రమ్య అని పేరు పెట్టుకుని అల్లారు ముద్దుగా పెంచసాగారు. ఆమెను బడికి పంపాలి అనుకున్నారు. అంతలోనే వారికి మరొక కుమారుడు పుట్టాడు. అతని పేరు రవి. వారిది చాలా పేద కుటుంబం. గంగయ్య గంగమ్మ ఇద్దరూ ప్రతిరోజు కూలి పనికి వెళ్లి కుటుంబాన్ని పోషించేవారు. రమ్య మాత్రం అమ్మానాన్నలు ఇంటికి వచ్చేవరకు తన తమ్ముడిని ఆడిస్తూ, ఇంటి పనులు చేస్తూ ఉండేది. ఒకరోజు గంగమ్మ గంగయ్య ఇంటికి వచ్చే దారిలో ఒక శబ్దం వినిపించింది. ఏంటా అని చూడబోతే ఒక చిన్న కుక్కపిల్ల కాలికి దెబ్బతగిలి కుయ్యి కుయ్యిమని అరుస్తూ ఉంది. వాళ్ళిద్దరూ ఆ కుక్క పిల్లని ఇంటికి తీసుకొని వెళ్లారు. దాని గాయాన్ని శుభ్రం చేసి దానికి బంటి అని పేరు పెట్టారు. వాళ్ళు తీసుకున్న జాగ్రత్తతో బంటి గాయం మానిపోయింది. అది ఆ ఇంట్లో మనుషులతో చక్కగా కలిసిపోయింది. ఒకరోజు గంగమ్మ, గంగయ్య పనికి వెళ్లి ఇంటికి రావడం ఆలస్యమైంది. వాళ్ళ అమ్మ కోసం రవి గుక్కపెట్టి ఏడుస్తుండటంతో రమ్య బంటితో "నేను అమ్మానాన్నలను తీసుకొని వస్తాను నువ్వు రవిని చూస్తూ ఉండు" అని చెప్పి వెళ్ళింది. బంటి రవి చుట్టూ తిరుగుతూ కాపలా కాస్తుంది. హఠాత్తుగా ఒక పాము వచ్చింది. ఆ పాము రవి వైపు రాబోతుండగా బంటి పామును చంపేసింది. అప్పుడే రమ్య అమ్మానాన్నలను తీసుకొని వచ్చింది. బంటి మూతికి ఉన్న రక్తం చూసి ఏమీ ఆలోచించకుండానే గంగయ్య తన చేతిలోని కొడవలిని తీసి బంటి పైకి విసిరేశాడు. బంటి గిలగిల కొట్టుకుంటూ చనిపోయింది. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి చనిపోయిన ఒక పెద్ద పాము కనిపించింది. ఉయ్యాలలో చూస్తే రవి క్షేమంగా ఉన్నాడు. గంగయ్య తన తొందరపాటుతనానికి బలైపోయిన బంటిని దగ్గరికి తీసుకొని నెత్తి నోరు కొట్టుకుంటూ దుఃఖించాడు. వెనకాముందు ఆలోచన లేకుండా తొందరపాటుతో ఏ పని చేయకూడదని ఈ కథ ద్వారా తెలుస్తుంది.


– కె. మహేశ్వరి
9వ తరగతి, ZPHS లింగాపూర్, కామారెడ్డి
గైడ్ టీచర్: సునీత నమిలికొండ, m : 99084 68171

# ఆచార్య నాగార్జునుడి తెలివి పరీక్ష



నాగార్జునుడు గొప్ప ఆయుర్వేద ఆచార్యుడు. ఒకసారి ఆయనకు తన ప్రయోగశాలలో ఒక సహాయకుడు కావలసి వచ్చాడు. ఇద్దరు యువకులు అభ్యర్థులుగా వచ్చారు. నాగార్జునుడు వారికి ఒక వస్తువు ఇచ్చాడు. దానిని ఇంటికి తీసుకుపోయి మూడు రోజులలో తాను చెప్పిన మందును నూరుకొని రమ్మని కోరాడు.

మూడు రోజుల తరువాత ఆ ఇద్దరిలో ఒక యువకుడు ఔషధాన్ని తయారు చేసుకొని వచ్చాడు. అతడు తాను తెచ్చిన పాత్రను ఆచార్యుని ముందు ఉంచాడు. నాగార్జునుడు అడిగాడు "దీనిని తయారు చేసే సమయంలో ఆటంకాలేమీ కలగలేదా?" అని.



'ఎన్నో ఆటంకాలు వచ్చాయి. మా అమ్మ జ్వరంతో మూలుగుతున్నది. నా తండ్రి కడుపు నొప్పితో మెలికలు తిరుగుతున్నాడు. నా చిన్న తమ్ముడి కాలి ఎముక విరిగింది. నేను మాత్రం నా సాధనలోనే మునిగి ఉన్నాను". అతడు గర్వంగా చెప్పాడు.

ఆచార్యుడు చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.


కాసేపటికి రెండవ యువకుడు వచ్చాడు. ఇలా అన్నాడు. క్షమించండి ఆచార్యా! మీరు చెప్పిన ఔషధం తయారు చేయలేక పోయాను.



'ఎందుకు తయారు చేయలేదు?' ఆచార్యుడు అడిగాడు.

'ఆచార్యా! ఆ రోజు నేను ఇక్కడి నుండి బయలుదేరి ఇంటికి తిరిగి వెళుతున్నాను. దారిలో ఒక వృద్ధుడు కలిశాడు. అతడు జబ్బుతో ఉన్నాడు. బలహీనంగా ఉన్నాడు. పాపం! అతను చాలా పేదవాడు. ఈ మూడు రోజులలో అతనికి ఆరోగ్యం చేకూరాలని పరిచర్యలు చేయటంతోనే సరిపోయింది. దయచేసి నాకు మరో రెండు రోజులు సమయం ఇవ్వండి" అన్నాడు.

ఆచార్యుడు అతని మాటలు విన్నాడు. గంభీరంగా చూశాడు. మొదటి యువకుడి వైపు తిరిగాడు.



'నీవు వెళ్ళవచ్చు. నేను ఈ యువకుడిని సహాయకుడిగా ఎంచుకుంటున్నాను. మందులు ప్రాణ రక్షణ కోసం ఉద్దేశించబడ్డాయి. వాటిని తయారు చేసేవారు ప్రాణ రక్షణ పట్ల అశ్రద్ధ చూపితే అతనిని యోగ్యుడని ఎలా అనుకోగలం' అన్నాడు ఆచార్య నాగార్జునుడు.

– 'బాల కథా సౌరభం' నుండి...

**నీతి:** నిజమైన విద్యకు కరుణ, సేవాభావం తోడైతేనే అది సమాజానికి మేలు చేస్తుంది.

చరిత్ర పాఠాలు-18

# విష్ణుకుండులు - రెండో మాధవ వర్మ

క్రీ.శ. 358 మొదలు విష్ణుకుండులు మొత్తం తెలంగాణ ప్రాంతాన్ని, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాన్ని, కొంతకాలం (క్రీ.శ. 5వ శతాబ్దపు ఉత్తరార్ధం) మహారాష్ట్ర ప్రాంతాన్ని పరిపాలించారు. విష్ణుకుండి రాజ్యాలు సమారు పరిమాణంలో ఉన్నాయి. కానీ, వారిలో ముగ్గురు నలుగురేసి ఇంద్రవర్మలు, మాధవవర్మలు కలిసియుండడంతో, ఎవరి తదుపరి ఎవరు పాలించారో నిర్ణయించడం కష్టమవుతుంది. అయితే, కింద తెలిపిన రాజుల కాలక్రమాన్ని ఎక్కువ మంది చరిత్రకారులు అంగీకరిస్తున్నారు.

1. ఇంద్రవర్మ (క్రీ.శ. 358-370)
2. మొదటి మాధవవర్మ (క్రీ.శ. 370-398)
3. గోవిందవర్మ (క్రీ.శ. 398-440)
4. రెండో మాధవవర్మ (క్రీ.శ. 440-495)
5. దేవవర్మ (క్రీ.శ. 495-496)
6. మూడో మాధవవర్మ (క్రీ.శ. 496-510)
7. మొదటి విక్రమేంద్రవర్మ (క్రీ.శ. 510-525)
8. రెండో ఇంద్రభట్టారకవర్మ (క్రీ.శ. 525-555)
9. రెండో విక్రమేంద్రవర్మ (క్రీ.శ. 555-569)

మంచన్న భట్టారకుడు అనేవాడు కూడా కొంతకాలం (క్రీ.శ. 570 ప్రాంతంలో) అమ్రాబాద్ ప్రాంతంలో పరిపాలించినట్టు తెలుస్తున్నది. మొదటి ఇద్దరు రాజులు దక్షిణ తెలంగాణలో తమ రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, తరువాతి రాజులు విస్తృతమైన మార్గాన్ని సుగమం చేశారు.

రెండో మాధవవర్మ (క్రీ.శ. 440-495) విష్ణుకుండి రాజ్యాలందరిలో గొప్పవాడు. ఆయన అనేక యుద్ధాలు (ఇంచుమించు వందకు పైగా) చేసి, బౌద్ధశాఖల్ని యుద్ధాల్లోనూ విజయాన్ని సాధించి, ఒక్కొక్క విజయానికి గుర్తుగా అనేక అశ్వమేధ యాగాలు నిర్వహించాడు. ఇంద్రపాలనగరం చుట్టూ పారే మూసీ నదిలోని బండరాళ్లను కూడా ఇలాగే శిల్పాలుగా ప్రతిష్ఠించుకున్నాడు. ఆయన విజయం సాధించిన ప్రాంతాల్లో రామలింగేశ్వర దేవాలయాలను కట్టించినట్లు తెలుస్తున్నది. అలా, ఈ రోజు వరకు ఆయన కట్టించిన రామలింగేశ్వర దేవాలయాలు వేల్పూరు (గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకా), ఈపూరు, ఇంద్రపాలనగరం, కీసరగుట్టల్లో పూజలు అందుకుంటున్నాయి. రెండో మాధవవర్మ దిగ్విజయాల్లో కొన్నింటిని ఈ శ్లోకం వర్ణిస్తున్నది. గుణపాశపురం పాలకుడు, బంధువు కూడా అయిన ప్రభాకరుని సహాయంతో కళింగను (దత్తుల కోల్పోయిన ం దక్షిణ ఒడిశా) ఆక్రమించాడు. తన 33వ రాజ్యపాలన సంవత్సరంలో పల్లవులపై దాడి చేసి, మళ్లీ గుండ్లకమ్మ నది వరకు విష్ణుకుండి రాజ్యాన్ని విస్తరింపజేశాడు. అతని రాజ్యానికి పడమటి దిక్కున ముక్కరాష్ట్రంలో వాకాటక రాజుల చాళ శక్తిమంతులు. ఆ వంశ ప్రధాన శాఖలో చివరి రాజైన పృథ్వీసేనుని (క్రీ.శ. 460-480) రెండో మాధవవర్మ ఓడించి అతని బిరుదును స్వీకరించాడు.

పై పేర్కొన్న విజయాలతో రెండో మాధవవర్మ 'ప్రాగ్దక్షిణాపథాధిపతిదేవ', 'సర్వభౌమ', 'అనేక సామంత మకుటమణిమయూఖ చరణయుగళ' మొదలైన బిరుదులను ధరించాడు. అంటే, ఆయన రాజ్యం తూర్పున బంగాళాఖాతం నుంచి పడమర అరేబియా సముద్రం వరకు, దక్షిణ సముద్రం (బే ఆఫ్ బెంగాల్ దక్షిణ భాగం) నుంచి ఉత్తరాన రేవా (నర్మదా) నది వరకు విస్తరించింది. అనేక సామంత రాజులు ఆయన పాదాలపై వాలారు. ఇందులో అతిశయోక్తి ఏమీ లేదు. ఆయన శాసనం ఒకటి మహారాష్ట్రలోని ఖానాపూర్‌లో దొరికింది. విష్ణుకుండి నాణేలు మహారాష్ట్ర అంతటా దొరికాయి. రెండో మాధవవర్మకు ఉన్న 'త్రివర నగర భవనగత సుందరీ హృదయ నందన' (త్రివర నగరంలోని భవనాల్లో ఉండే అందగత్తెల హృదయాలను ఆనందింపజేసేవాడు) అనే బిరుదులోని త్రివర నగరం నర్మదా నదిపై ఉన్న జబల్‌పూర్ దగ్గరలోని త్రిపురి లేదా తేవార్. వి.వి. మిరాశి త్రివర నగరం దక్షిణ కోసల (బస్తర్) ప్రాంతంలోని రాజధాని అయితే, ఇంకొందరు చరిత్రకారులు ఉత్తర కళింగను పాలించిన సోమవంశీయుల రాజధాని అని వాదించారు. వీటిలో ఏది త్రివర నగరమైనా, రెండో మాధవవర్మ రాజ్యం ఉత్తరాన నర్మదా-మహానది రేవుల వరకు విస్తరించిందనే విషయం స్పష్టమవుతుంది. విష్ణుకుండులకు, పల్లవులకు మధ్య ఎప్పుడూ యుద్ధాలు జరుగుతూనే ఉండేవి. అందువల్ల, పల్లవుల దండయాత్రలను అరికట్టే ఉద్దేశంతో రెండో మాధవవర్మ తన రాజధానిని వేగి సమీపంలోని దెందులూరు (పూర్వానికి వేంగి), తమ మొదటి రాజధాని అమరపురికి కోట గోడలను పెంచి, బలపరిచి, ఆఖరికి తన పెద్ద కొడుకు దేవవర్మను రాజప్రతినిధిగా నియమించాడు.

రెండో మాధవవర్మ తన విజయాలను ప్రకటించుకునేందుకు 11 అశ్వమేధ యాగాలు, 16 రాజసూయ యాగాలు, వాజపేయం, పురుషమేధం మొదలైన వేద యాగాలు చేశాడని విష్ణుకుండి శాసనాలు పేర్కొన్నాయి. ఆయన న్యాయ విధానాలను దేవతలు కూడా ప్రశంసించారని, ఆయన బిరుదు 'జనాశ్రయుడు'తో మొదలయ్యే 'జనాశ్రయ ఛందోవిచ్ఛిత్తి' అనే ఛందోగ్రంథాన్ని ఆయన రచించినట్లు తెలుస్తుంది. ఇలా ఎన్నో విజయాలతో గొప్పవాడు కాబట్టి, ఇతడిని కాకతీయులు మొదలుకొని ఎంతోమంది రాజులు తమ వంశకర్తగా చెప్పుకొన్నారు.

- డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078

# గణిత పజిల్స్ మన కోసం

## 1. బొమ్మల విలువ ఎంత?

ప్రతి బొమ్మ ఒక సంఖ్యను సూచిస్తుంది. బొమ్మల విలువను కనుగొనండి.

🍎 + 🍎 + 🍎 = 30

🍎 + ⭐ + ⭐ = 18

⭐ + 🌼 + 🌼 = 14

🍎 + ⭐ × 🌼 = ?

## 2. ఖాళీ సంఖ్య ఏది?

ఖాళీ స్థానంలో ఏ సంఖ్య వస్తుంది?

3 + 5 = 8

7 - 2 = 5

4 + 6 = 10

9 - ? = 3

## 3. సంఖ్యల సరళి పూర్తి చేయండి.

తదుపరి వచ్చే సంఖ్యను రాయండి.

1. 2, 4, 6, 8, ___
2. 3, 6, 9, 12, ___
3. 5, 10, 15, 20, ___
4. 2, 5, 8, 11, ___

## 4. సమీకరణాలు సమతుల్యం చేయండి.

ఇరువైపుల విలువ సమానం అయ్యేలా ఖాళీలో సరైన సంఖ్యను రాయండి.

1. 2 3 | 4 ?
2. 7 | 3 2 ?
3. 5 5 | 8 ?
4. 6 2 | 7 ?

# కలంచెలిమి



**ఎస్. సోని**
7వ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్,
పెద్ద బోదనం, నంద్యాల (జిల్లా)
ఆంధ్ర ప్రదేశ్.



**డి. సిద్ధార్థ**
8వ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్,
లింగాపూర్, కామారెడ్డి.

**మేర భవాని**
10వ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్,
అప్పల నరసింహా పురం,
నేలకొండపల్లి మండలం, ఖమ్మం.



**నూనె శ్రీనిధి**
10వ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్
ఏరుగట్ల, నిజామాబాద్.






**కమ్మంపాటి వరుణ్ తేజ్**
6వ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్,
చిన్న మాదారం, నల్లగొండ.



**చల్ల స్నేహిత**
10వ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్,
రావురూకుల, సిద్దిపేట జిల్లా

కథ

# అవయవ దానం



నాంపల్లి అనే ఒక అందమైన పల్లెటూరు. ఆ పల్లెటూరు చాలా అందంగా ప్రకృతి రమణీయంగా పక్షుల కిలకిల రావాలతో అందంగా ఉంటుంది. ఆ గ్రామాన్ని చూస్తే మన మనసుకి ఎంతో ఉల్లాసం కలుగుతుంది. అక్కడే జీవించాలని కోరిక ప్రతి ఒక్కరికి కలుగుతుంది. ఆ గ్రామంలో లక్ష్మణ్, లక్ష్మీ అనే ఇద్దరు దంపతులు నివసిస్తూ ఉండేవారు. ఆ దంపతులకు ఒక కొడుకు అతని పేరు రాజు. రాజు పనిలో చదువులో చురుకుగా ఉండేవాడు. కానీ అతని గొప్పతనం అతని మంచి మనసు. ఎవరైనా ఆపదలో ఉంటే సహాయం చేయడం రాము యొక్క స్వభావం. ఎవరైనా కష్టాల్లో ఉంటే వారికి ధైర్యంతో నేనున్నాననే భరోసాను కల్పిస్తూ ముందుకు నడిపించేవాడు. ఏ కష్టాలతో ఎవరు ఎలా పోతే నాకేంటి అని అనుకోకుండా ప్రతి ఒక్కరికి ఎల్లప్పుడూ సహాయం చేయాలని తపన అతని మనసులో ఉండేది. ఎదుటి వారు తనకు చెడు చేసారా మంచి చేశారా అని ఆలోచించకుండా అందరికీ సహాయం చేసేవాడు. ఒకరోజు రాజు చదువుకునే పాఠశాలలో అవయవ దానం గురించి ఒక అవగాహన కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమంలో రాజు పాల్గొన్నారు. ఆ అవగాహన కార్యక్రమానికి ఒక ప్రముఖ వైద్యుడు వచ్చాడు. అతడు అవయవదానం గురించి వివరించాడు. అదేమిటంటే పేదవారికి అన్నదానం చేయడం ఎంత గొప్పతనమో అలాగే అనారోగ్యంగా ఉన్న వారికి కూడా అవయవ దానం చేయడం అంతే గొప్పదనం అని విద్యార్థులకు తెలియపరిచాడు అవయవదానం విశిష్టతను వివరించాడు. అవయవదానం చేయడం ద్వారా పలువురి ప్రాణాలను కాపాడవచ్చు అని చెప్పారు. ఈ మాటలు రాజును ఎంతో ప్రభావితం చేశాయి మన జీవితం ముగిసిన ఇతరుల జీవితాల్లో వెలుగు నింపగలిగితే అదే నిజమైన జీవితం గదా అని అనుకున్నాడు. రాజు అప్పటినుండి అతను అవయవ దానం గురించి తన గ్రామంలో కుటుంబంలోని వారితో మాట్లాడేవాడు. దాని గొప్పతనం గురించి చెప్పేవాడు. అవయదానం చేసేలా ప్రోత్సహించేవాడు. మొదట్లో రాజు తల్లిదండ్రులు ఈ విషయమై భయపడ్డారు. కానీ రాజు వివరంగా చెప్పడంతో అంగీకరించారు. ప్రాణం కోల్పోయిన ఒక వ్యక్తి తన వల్ల ఎదుటివారికి జీవితం దక్కితే అది అతనికి ఎంతో మంచిది అన్నారు ఇలా కాలం గడుస్తుండగా ఒకరోజు రాజు రోడ్డుపై వెళ్తుండగా ఒక కారు వచ్చి అతనిని ఢీకొట్టింది ఆ ప్రమాదంలో అతడు ఆసుపత్రి పాలయ్యాడు వైద్యులు ఎంత ప్రయత్నించినా అతన్ని రక్షించలేమని చెప్పారు. అతడు బ్రెయిన్ డెడ్ అయినట్లుగా ప్రకటించారు. అప్పుడు రాజు తల్లిదండ్రులు చాలా బాధపడ్డారు కానీ అప్పుడు రాజు తల్లి రాజు అన్న మాటలు గుర్తు చేసుకుంది. భయపడకుండా ధైర్యం తెచ్చుకొని తన కొడుకు రాజు కోరుకున్నట్లే అతని అవయవాలను దానం చేయాలని నిశ్చయించుకొని తన భర్తతో చెప్పింది. అతని కళ్ళు ఒక అమ్మాయికి అలాగే ఒక తండ్రికి తన కిడ్నీలను ఒక బాలుడికి తన కాలేయాన్ని ఇలా అవయవాలను దానం చేశారు దానివల్ల ఆ ముగ్గురికి సహాయం అందింది రాజు తల్లిదండ్రులు సంతోషించారు. కొడుకు దూరమైన బాధ ఉన్నప్పటికీ కొడుకు అవయవాల దానం ద్వారా ఆ ముగ్గురిలో కొడుకును చూస్తూ జీవనాన్ని సాగించారు. కొన్ని రోజుల తర్వాత అవయవదానాన్ని పొందిన కుటుంబ సభ్యులు రాజు తల్లిదండ్రులకు కృతజ్ఞత తెలియజేస్తూ లేఖలు రాశారు అవి చదువుతుంటే వాళ్ళ కళ్ళల్లో కన్నీళ్లు వచ్చాయి కానీ ఆ కన్నీళ్లను తుడుచుకొని తమ కుమారుడి ద్వారా ఇంత మంది ఇందరి ప్రాణాలు దక్కించాయన్న ఆనందం వాళ్లలో కలిగింది. వారి జీవితాల్లో వెలుగు నింపాడన్న సంతృప్తి మిగిలింది.

**నీతి :** అవయవ దానం అంటే ముగింపు కాదు అనేకమంది జీవితాలకు కొత్త జీవితాలను ఇస్తుంది. మనం చేసిన మంచి పనులు కలకాలం నిలుస్తాయి


– యం. రోషిణి

9 వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
గ్రా. రేగులపల్లి, మం. బెజ్జంకి, జి. సిద్దిపేట
గైడ్ టీచర్ : జి. లింగేశ్వర శర్మ
m : 9603389441

## మ్యాథ్స్ ట్రిక్స్

# ముందే ఊహించిన సంఖ్య-1

1. ఏదైనా ఒక సంఖ్య రాసుకోండి.
2. దానిని 2తో గుణించండి.
3. ఆ జవాబుకు మీరు చెప్పిన సంఖ్య కలపండి.
4. దానిని 2తో భాగించండి.
5. వచ్చిన జవాబు నుండి వారు కోరుకున్న సంఖ్యను తీసివేయండి.
6. నేను ముందుగా రాసిన జవాబు ఇదే.

ఉదా: కోరుకున్న సంఖ్య 25, 25×2=50
50+36 (36 మెజీషియన్ కలపమన్న సంఖ్య)
86÷2=43, 43-25=18
ముందుగా రాసిన సంఖ్య కూడా 18.

**రహస్యం:** ముందుగా రాసిన సంఖ్యకు రెట్టింపు సంఖ్యను కలపమని చెప్పాలి.

18 రాస్తే 36 కలపాలి.
20 రాస్తే 40 కలపాలి.
135 రాస్తే 270 కలపాలి.

గమనిక: ఒక సంఖ్యను స్లిప్‌పై రాసి ఒక కవరులో పెట్టి ప్రేక్షకునికి ముందే ఇవ్వాలి.

## BEAUTY NUMBER

1 x 1 = 1
11 x 11 = 121
111 x 111 = 12321
1111 x 1111 = 1234321
11111 x 11111 = 123454321
111111 x 111111 = 12345654321
1111111 x 1111111 = 1234567654321
11111111 x 11111111 = 123456787654321

- అంకెల మామయ్య చంద్రయ్య
m: 9440926937

## బాలచెలిమి క్లబ్

# చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచార పత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

### చెలిమి క్లబ్

పేరు : ----------------
తండ్రి పేరు : ----------------
పుట్టినతేదీ : ----------------
చిరునామా : ----------------
--------------------
--------------------
పిన్ : ----------------
హాబీలు : ----------------
మొబైల్ : ----------------
ఇ-మెయిల్ : ----------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk. chelimi@gmail. com






కృత్రిమ మేధస్సు (Artificial Intelligence-AI) మరియు రోబోటిక్స్ (Robotics) కలయికతో ఏర్పడిన ఆధునిక సాంకేతిక రంగాన్నే AI రోబోటిక్స్ అంటారు. రోబోటిక్స్ అనేది మనుషులు చేసే పనులను నిర్వహించగల యంత్రాలను రూపొందించే శాస్త్రం. కృత్రిమ మేధస్సు ఆ రోబోట్లకు ఆలోచించడం, నేర్చుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం, సమస్యలను పరిష్కరించడం, కొత్త పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించడం వంటి తెలివితేటలను అందిస్తుంది. అందుకే “రోబోట్ శరీరం అయితే, AI దాని మెదడు” అని అంటారు.

సాధారణ రోబోట్లు ముందుగా ఇచ్చిన ఆదేశాలను మాత్రమే అమలు చేస్తాయి. అయితే AI రోబోట్లు తమ పరిసరాలను కెమెరాలు, సెన్సర్ల ద్వారా గుర్తించి, సమాచారాన్ని విశ్లేషించి, సరైన నిర్ణయం తీసుకుని, అనుభవం ద్వారా తమ పనితీరును మరింత మెరుగు పరుచుకుంటాయి. ఈ సామర్థ్యం వల్ల అవి మానవులకు సహాయకులుగా మారుతున్నాయి.

AI రోబోటిక్స్ అభివృద్ధికి ప్రధాన కారణం ప్రమాదకరమైన, పదేపదే చేయాల్సిన లేదా అత్యంత ఖచ్చితత్వం అవసరమైన పనులను వేగంగా, సురక్షితంగా పూర్తి చేయడం. అణు విద్యుత్ కేంద్రాలు, గనులు, అగ్నిమాపక చర్యలు, రసాయన పరిశ్రమలు, ప్రకృతి వైపరీత్య ప్రాంతాల్లో మనుషులకు బదులుగా రోబోట్లు పనిచేయగలవు. అవి అలసట లేకుండా 24 గంటలు పనిచేయడం వల్ల ఉత్పాదకత పెరుగుతుంది. ప్రారంభ వ్యయం ఎక్కువైనా, దీర్ఘకాలంలో సమయం, శ్రమ, నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి.

ప్రస్తుతం AI రోబోటిక్స్ అనేక రంగాల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. తయారీ పరిశ్రమల్లో కార్ల అసెంబ్లీ, వెల్డింగ్, పెయింటింగ్, నాణ్యత పరీక్ష వంటి పనులను రోబోట్లు అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహిస్తున్నాయి. వైద్య రంగంలో శస్త్రచికిత్సలకు సహాయం చేయడం, మందుల పంపిణీ, ఆసుపత్రుల పరిశుభ్రత, రోగుల పునరావాస కార్యక్రమాల్లో AI రోబోట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వ్యవసాయంలో విత్తనాలు నాటడం, పంటల ఆరోగ్యాన్ని పరిశీలించడం, పండ్లు కోయడం, ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడం వంటి పనులు కూడా రోబోట్లు చేస్తున్నాయి. విద్యా రంగంలో కోడింగ్, సైన్స్, STEM విద్య బోధనలో సహాయక రోబోట్లు ఉపయోగిస్తున్నారు. గిడ్డంగుల్లో వస్తువుల నిల్వ, క్రమబద్ధీకరణ, రవాణా పనులను రోబోట్లు వేగంగా పూర్తి చేస్తున్నాయి. ఇళ్లలో రోబోట్ వాక్యూమ్ క్లీనర్లు, వృద్ధులకు సహాయక రోబోట్లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. అంతరిక్ష పరిశోధనలో ఇతర గ్రహాలను పరిశీలించడం, నమూనాలు సేకరించడం వంటి పనులను కూడా AI రోబోట్లు విజయవంతంగా నిర్వహిస్తున్నాయి.

AI రోబోట్ పనిచేసే విధానం ఐదు దశలుగా ఉంటుంది. మొదట సెన్సర్ల ద్వారా పరిసరాల సమాచారాన్ని సేకరిస్తుంది. తర్వాత ఆ సమాచారాన్ని కంప్యూటర్ విజన్, మెషిన్ లెర్నింగ్ వంటి సాంకేతికతలతో విశ్లేషిస్తుంది. అనంతరం ఉత్తమ నిర్ణయం తీసుకుని మోటార్లు, రోబోటిక్ చేతులు లేదా చక్రాల సహాయంతో పని చేస్తుంది. చివరగా అనుభవం నుంచి నేర్చుకుని తదుపరి సారి మరింత సమర్థవంతంగా పనిచేస్తుంది.

AI రోబోటిక్స్‌కు అనేక ప్రయోజనాలున్నప్పటికీ కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. వీటి తయారీ, నిర్వహణ ఖర్చు ఎక్కువ. నాణ్యమైన డేటాపై ఆధారపడాల్సి ఉంటుంది. కొన్ని పునరావృత ఉద్యోగాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అలాగే గోప్యత, భద్రత, నైతికత వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. అయినప్పటికీ మానవ సృజనాత్మకత, భావోద్వేగాలు, నిర్ణయ సామర్థ్యాన్ని రోబోట్లు పూర్తిగా భర్తీ చేయలేవు.

భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, వృద్ధుల సంరక్షణ, స్మార్ట్ పరిశ్రమలు, వ్యవసాయం, విద్య, అంతరిక్ష పరిశోధన, విపత్తుల నిర్వహణ వంటి రంగాల్లో AI రోబోటిక్స్ వినియోగం మరింత పెరగనుంది. మనుషుల స్థానాన్ని ఆక్రమించడం కాకుండా, వారితో కలిసి పనిచేసి పనులను సులభతరం చేయడం, భద్రతను పెంచడం, జీవన నాణ్యతను మెరుగుపరచడం AI రోబోటిక్స్ యొక్క ప్రధాన లక్ష్యం. ఆధునిక ప్రపంచాన్ని మరింత తెలివైనదిగా, సమర్థవంతమైనదిగా తీర్చిదిద్దుతున్న అత్యంత ప్రభావవంతమైన సాంకేతిక విప్లవాల్లో AI రోబోటిక్స్ ఒకటి.

– లత
e: ogshydcbse@gmail. com

# వేమన విజ్ఞాన కేంద్రంలో బాలచెలిమి సంపాదకులు వేదకుమార్ మణికొండకు సాహితీ మిత్రుల ఆత్మీయ సత్కారం



తిరుపతి, జూన్ 29, 2026: తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో బాలచెలిమి మాసపత్రిక సంపాదకులు శ్రీ వేదకుమార్ మణికొండకు సాహితీ మిత్రులు ఆత్మీయ సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ, విద్య, వైద్యం, వైజ్ఞానిక, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో కేంద్రం అందిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, ఉచిత ట్యూషన్ కేంద్రాలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని తెలిపారు. అనంతరం బాలచెలిమి మాసపత్రిక సంపాదకులు శ్రీ వేదకుమార్ మణికొండ మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాల్లో బాలలలో పఠనాభిరుచి, సృజనాత్మకత, నైతిక విలువలను పెంపొందించాలనే లక్ష్యంతో గత 35 సంవత్సరాలుగా బాలచెలిమి మాసపత్రికను నిరంతరాయంగా ప్రచురించడం గర్వకారణమని పేర్కొన్నారు. వేమన విజ్ఞాన కేంద్రం విద్యా, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా తెలుగు భాషోద్యమ వ్యవస్థాపకులు డా. సాకం నాగరాజు, ప్రముఖ బాలసాహిత్య రచయిత ఆర్.సి. కృష్ణస్వామి రాజు సంయుక్తంగా బాలచెలిమి జూలై–2026 సంచికను ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని గ్రంథాలయాలు, పాఠశాలలు, సాహిత్య వేదికల ద్వారా బాలచెలిమి బాలలలో పఠన సంస్కృతిని, సృజనాత్మక ఆలోచనను, సామాజిక విలువలను పెంపొందించడంలో విశిష్ట సేవలు అందిస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి మణికొండ సులోచన రాణి (శ్రీ వేదకుమార్ మణికొండ సతీమణి), ఆచార్య భక్తవత్సల రెడ్డి, డా. ఆమూరి సుబ్రమణ్యం, రిటైర్డ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) రాంగోపాల్, నెల్లూరు మునిలక్ష్మి, ఓ. వెంకటరమణ, మురళి గోపాల్, గుణశేఖర్, జ్ఞాన ప్రసూన, పి. ముఖేష్ తదితరులు పాల్గొని శ్రీ వేదకుమార్ మణికొండను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశం బాలసాహిత్య సేవకు, సాహిత్య మైత్రికి ప్రతీకగా నిలిచింది.

– మల్లారపు నాగార్జున
తిరుపతి. m : 9398000686

పిల్లల కథల్లో సైన్స్ - 7

# నక్క మరియు వేటగాడు



అనగనగా, ఒక విశాలమైన అడవి ఉండేది. ఆ అడవిలో ఎత్తైన చెట్లు, పచ్చని పొదలు, చిన్న చిన్న చెరువులు, ఎన్నో రకాల పక్షులు జింకలు, కుందేళ్లు, అడవి పందులు, నెమళ్లు, కోతులు సంచరిస్తూ ఉండేవి. ఒక రోజు ఉదయం, ఒక వేటగాడు తన విల్లు, బాణాలతో వేట కోసం అడవిలోకి ప్రవేశించాడు. గంటల తరబడి అడవిలో తిరుగుతూ మంచి వేట కోసం వెతికాడు. కానీ అతనికి ఏ జంతువూ కనిపించ లేదు. చాలా దూరం నడిచిన తర్వాత, దట్టమైన పొదల వెనుక ఒక లావుగా, బలంగా ఉన్న అడవి పంది కనిపించింది. అది నేలను తన ముక్కుతో తవ్వుతూ ఆహారం వెతుకుతోంది. వేటగాడి కళ్లలో ఆనందం మెరిసింది.

"ఈ పంది నాకు ఈరోజు మంచి వేట అవుతుంది," అని అనుకుంటూ, నిశ్శబ్దంగా ఒక చెట్టు వెనుక దాక్కున్నాడు. అతడు తన విల్లుకు బాణాన్ని అమర్చి, తీగను బలంగా వెనక్కి లాగాడు. లక్ష్యాన్ని జాగ్రత్తగా చూసి ఒక్కసారిగా తీగను వదిలాడు. బాణం గాలిని చీల్చుకుంటూ వేగంగా దూసుకెళ్లి, పంది శరీరంలో బలంగా దిగింది.

ఆకస్మికంగా గాయపడిన పంది గట్టిగా అరుస్తూ ఒక్కసారిగా వెనక్కి తిరిగింది. అది భయంతో పారిపోలేదు. తనపై దాడి చేసిన వేటగాడిని చూసి ఆగ్రహంతో అతని వైపు పరిగెత్తింది. వేటగాడు మరో బాణం తీయడానికి ప్రయత్నించేలోపే, పంది అతని దగ్గరకు చేరుకుంది. తన పదునైన కోరలతో అతనిని బలంగా పొడిచింది. ఆ దెబ్బకు వేటగాడు నేలపై పడిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పంది కూడా తీవ్రంగా గాయపడింది. బాణం లోతుగా దిగడంతో అది కొంతదూరం నడిచి, నేలపై కూలిపోయింది. కొద్దిసేపటికే అది కూడా ప్రాణాలు విడిచింది. కొంతసేపటి తర్వాత, చాలా రోజులుగా సరైన ఆహారం దొరకక ఆకలితో అలమటిస్తున్న ఒక నక్క ఆ దారిలోకి వచ్చింది. ఆహారం కోసం అటూ ఇటూ తిరుగుతూ ఉండగా, ఒకేచోట చనిపోయి ఉన్న వేటగాడిని, లావుగా ఉన్న అడవి పందిని చూసింది. నక్క కళ్లలో ఆనందం మెరిసింది.

"అయ్యో! ఈ రోజు నా అదృష్టం ఎంత బాగుందో! ఇంత పెద్ద పంది, మనిషి... ఇవి నాకు చాలా రోజుల వరకు సరిపోతాయి. ఇక చాలా కాలం వేట కోసం తిరగాల్సిన అవసరం లేదు," అని తనలో తాను అనుకుంది.

"ఇంత పెద్ద విందు ఉంది కాబట్టి తొందరపడాల్సిన అవసరం లేదు. ముందు ఈ విల్లుకు కట్టిన తోలు తాడు తింటాను. అది చిన్నదైనా రుచిగా ఉంటుంది. తర్వాత నెమ్మదిగా పంది మాంసం తింటాను," అని నిర్ణయించు కుంది.

అది వేటగాడి పక్కన పడివున్న విల్లు దగ్గరకు వెళ్లింది. అది తన పదునైన పళ్లతో విల్లుకు కట్టిన తోలు తాడును కొరకడం ప్రారంభించింది. ఒక్కసారి... రెండుసార్లు... మూడోసారి గట్టిగా కొరకగానే... టప్! తాడు ఒక్కసారిగా

తెగిపోయింది. వెంటనే బలంగా వంగి ఉన్న విల్లు తన సహజ ఆకారంలోకి వేగంగా మారి దానిలో మెరుపువేగంతో నక్క ఛాతీలో బలంగా గుచ్చుకుంది. నక్కకు ఏమి జరిగిందో అర్థమయ్యేలోపే అది నేలపై కుప్పకూలింది. కొన్ని క్షణాల్లోనే ప్రాణాలు విడిచింది.



### కథలోని సైన్స్ ఏమిటి?

విల్లు (Bow) మరియు బాణం (Arrow) రెండూ కలిసి పనిచేసే ఆయుధాలు అయినప్పటికీ, వాటి పనులు వేర్వేరుగా ఉంటాయి. విల్లు అనేది వంగే ఆకారంలో ఉండే పరికరం. బాణం అనేది పొడవైన, తేలికైన కర్రలాంటి ప్రక్షేపకం. దీనికి ముందు భాగంలో పదునైన మొన, వెనుక భాగంలో ఈకలు ఉంటాయి.

### 1. విల్లు(bow)లో శక్తి ఎలా నిల్వ అవుతుంది?

విల్లు తీగను వెనక్కి లాగినప్పుడు, విల్లు వంగుతుంది. మన చేతులు చేసే పని (Work) విల్లులో స్థితిస్థాపక శక్తి (Elastic Potential Energy)గా నిల్వ అవుతుంది. ఎంత ఎక్కువగా తీగను లాగితే, అంత ఎక్కువ శక్తి విల్లులో నిల్వ అవుతుంది.

### 2. బాణం(arrow) ఎలా వేగంగా దూసుకుపోతుంది?

తీగను వదిలిన వెంటనే విల్లు తన మునుపటి ఆకారంలోకి రావడానికి ప్రయత్నిస్తుంది. నిల్వ ఉన్న స్థితిస్థాపక శక్తి, చలన శక్తి (Kinetic Energy)గా మారుతుంది. ఆ శక్తి బాణానికి చేరి, బాణం చాలా వేగంగా ముందుకు దూసుకుపోతుంది. కొంత శక్తి మాత్రం శబ్దంగా, విల్లు కంపించడంలో, కొద్దిగా వేడిగా మారిపోతుంది.

### 3. బాణం (arrow) ముందుకు ఎందుకు వెళ్తుంది?

దీనికి న్యూటన్ మూడవ చలన నియమం వివరిస్తుంది. "ప్రతి చర్యకు సమానమైన, వ్యతిరేక ప్రతిచర్య ఉంటుంది." విల్లు తీగ బాణాన్ని ముందుకు నెడుతుంది. అదే సమయంలో బాణం కూడా తీగపై సమానమైన వ్యతిరేక బలం ప్రయోగిస్తుంది. ఈ బలం వల్ల బాణం వేగంగా ముందుకు ప్రయాణిస్తుంది.

### 4. బాణం(arrow) వెనుక ఈకలు ఎందుకు ఉంటాయి?

బాణం వెనుక ఉండే ఈకలను ఫ్లెచింగ్ (Fletching) అంటారు. వాటి ఉపయోగాలు: బాణం గాల్లో స్థిరంగా ప్రయాణించడానికి సహాయపడతాయి. బాణం ఊగకుండా కాపాడతాయి. లక్ష్యాన్ని మరింత కచ్చితంగా తాకేలా చేస్తాయి. కొన్నిసార్లు బాణం కొద్దిగా తిరుగుతూ (రాజూఅల) ప్రయాణించేలా చేసి సమతుల్యతను పెంచుతాయి.

### 5. బాణం (Arrow) ఒక మనిషిని లేదా జంతువును చంపడానికి కారణం ఏమిటి?

బాణంనకు గల దాని వేగం, పదునైన మొన, మరియు దానిలో ఉండే చలన శక్తి (Kinetic Energy). విల్లు తీగను వెనక్కి లాగినప్పుడు, విల్లులో స్థితిస్థాపక శక్తి (Elastic Potential Energy) నిల్వ అవుతుంది. తీగను వదిలిన వెంటనే ఆ శక్తి బాణానికి చేరి, బాణం చాలా వేగంగా ముందుకు దూసుకుపోతుంది. బాణం ముందు భాగం చాలా పదునుగా ఉండటం వల్ల, అది శరీరాన్ని సులభంగా ఛేదించగలదు. బాణం శరీరంలోకి దిగినప్పుడు, బాణం చంపేది దానిలో ఉన్న పదార్థం వల్ల కాదు, అది అధిక వేగంతో ప్రయాణించి శరీరంలోని ముఖ్య భాగాలను దెబ్బ తీయడం వల్ల.

– కె శ్రీకృష్ణ సాయి
రేవతి సైన్స్ ఫౌండేషన్ (రామచంద్రపురం)
m : 9866130320




భారత ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (PIB), 25 జనవరి 2026 అధికారిక ప్రకటన. ద్వయం పురస్కారాన్ని ఒక పురస్కారంగా లెక్కించారు.

| పేరు | రంగం |
|---|---|
| **పద్మ విభూషణ్** | |
| ధర్మేంద్ర సింగ్ డియోల్ (మరణానంతరం) | కళలు |
| కె. టి. థామస్ | ప్రజా వ్యవహారాలు |
| ఎన్. రాజమ్ | కళలు |
| పి. నారాయణన్ | సాహిత్యం & విద్య |
| వి. ఎస్. అచ్యుతానందన్ (మరణానంతరం) | ప్రజా వ్యవహారాలు |
| **పద్మభూషణ్** | |
| అల్కా యాజ్ఞిక్ | కళలు |
| భగత్ సింగ్ కోశ్యారి | ప్రజా వ్యవహారాలు |
| కల్లిపట్టి రామసామి పళనిస్వామి | వైద్యం |
| మమ్ముట్టి | కళలు |
| డా. నోరి దత్తాత్రేయుడు | వైద్యం |
| పీయూష్ పాండే (మరణానంతరం) | కళలు |
| ఎస్. కె. ఎం. మయిలానందన్ | సామాజిక సేవ |
| శతావధాని ఆర్. గణేష్ | కళలు |
| శిబు సోరెన్ (మరణానంతరం) | ప్రజా వ్యవహారాలు |
| ఉదయ్ కోటక్ | వాణిజ్యం & పరిశ్రమ |
| వి. కె. మల్హోత్రా (మరణానంతరం) | ప్రజా వ్యవహారాలు |
| వెల్లప్పల్లి నటేశన్ | ప్రజా వ్యవహారాలు |
| విజయ్ అమృతరాజ్ | క్రీడలు |
| **పద్మశ్రీ** | |
| ఎ. ఇ. ముత్తునాయగం | విజ్ఞానం & ఇంజినీరింగ్ |
| అనిల్ కుమార్ రస్తోగి | కళలు |
| అంకే గౌడ ఎం. | సామాజిక సేవ |
| ఆర్మిడా ఫెర్నాండెజ్ | వైద్యం |
| అరవింద్ వైద్య | కళలు |
| అశోక్ ఖాడే | వాణిజ్యం & పరిశ్రమ |
| అశోక్ కుమార్ సింగ్ | విజ్ఞానం & ఇంజినీరింగ్ |
| అసోక్ కుమార్ హల్దార్ | సాహిత్యం & విద్య |
| బల్దేవ్ సింగ్ | క్రీడలు |
| భగవాన్దాస్ రైక్వార్ | క్రీడలు |
| భరత్ సింగ్ భారతి | కళలు |
| భిక్ల్యా లడ్క్యా ధిండా | కళలు |
| బిశ్వ బంధు (మరణానంతరం) | కళలు |
| బ్రిజ్ లాల్ భట్ | సామాజిక సేవ |
| బుద్ధ రశ్మి మణి | పురావస్తు శాస్త్రం |
| డా. బుధ్రి తాటి | సామాజిక సేవ |
| చంద్రమౌళి గడ్డమనుగు | విజ్ఞానం & ఇంజినీరింగ్ |
| చరణ్ హెంబ్రామ్ | సాహిత్యం & విద్య |
| చిరంజీ లాల్ యాదవ్ | కళలు |
| దీపికా రెడ్డి | కళలు |
| ధార్మికలాల్ చునీలాల్ పాండ్యా | కళలు |
| గడ్డె బాబు రాజేంద్ర ప్రసాద్ | కళలు |
| గఫ్రుద్దీన్ మేవాతి జోగి | కళలు |
| గంభీర్ సింగ్ యోంజోన్ | సాహిత్యం & విద్య |
| గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం) | కళలు |
| గాయత్రి బాలసుబ్రమణియన్ & రంజని బాలసుబ్రమణియన్ (ద్వయం) | కళలు |
| గోపాల్ జీ త్రివేది | విజ్ఞానం & ఇంజినీరింగ్ |
| గుడూరు వెంకట్ రావు | వైద్యం |
| హెచ్. వి. హాండే | వైద్యం |

| | |
|---|---|
| హోలీ వార్ | సామాజిక సేవ |
| హరి మాధబ్ ముఖోపాధ్యాయ్ (మరణానంతరం) | కళలు |
| హరిచరణ్ సైకియా | కళలు |
| హర్మన్ప్రీత్ కౌర్ భుల్లర్ | క్రీడలు |
| ఇందర్జిత్ సింగ్ సిద్ధూ | సామాజిక సేవ |
| జనార్దన్ బాపురావ్ బోథే | సామాజిక సేవ |
| జోగేష్ దేయురి | వ్యవసాయం |
| జుజర్ వాసి | విజ్ఞానం & ఇంజినీరింగ్ |
| జ్యోతిష్ దేబ్నాథ్ | కళలు |
| కె. పజనివేల్ | క్రీడలు |
| కె. రామసామి | విజ్ఞానం & ఇంజినీరింగ్ |
| కె. విజయ్ కుమార్ | సివిల్ సర్వీస్ |
| కబీంద్ర పురకాయస్థ (మరణానంతరం) | ప్రజా వ్యవహారాలు |
| కైలాష్ చంద్ర పంత్ | సాహిత్యం & విద్య |
| కళామండలం విమల మేనన్ | కళలు |
| కేవల్ కృష్ణ ఠక్రాల్ | వైద్యం |
| ఖేమ్ రాజ్ సుంద్రియాల్ | కళలు |
| కొల్లకల్ దేవకి అమ్మ జి. | సామాజిక సేవ |
| కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్ | విజ్ఞానం & ఇంజినీరింగ్ |
| కుమార్ బోస్ | కళలు |
| కుమారసామి తంగరాజ్ | విజ్ఞానం & ఇంజినీరింగ్ |
| ప్రొ. (డా.) లార్స్-క్రిస్టియన్ కోచ్ | కళలు |
| ల్యూడ్మిలా విక్టోరోవ్నా ఖోఖ్లోవా | సాహిత్యం & విద్య |
| మాధవన్ రంగనాథన్ | కళలు |
| మాగంటి మురళీ మోహన్ | కళలు |
| మహేంద్ర కుమార్ మిశ్రా | సాహిత్యం & విద్య |
| మహేంద్ర నాథ్ రాయ్ | సాహిత్యం & విద్య |
| మామిడాల జగదీశ్ కుమార్ | సాహిత్యం & విద్య |
| మంగళ కపూర్ | సాహిత్యం & విద్య |
| మిర్ హాజిభాయ్ కాసంభాయ్ | కళలు |
| మోహన్ నాగర్ | సామాజిక సేవ |
| నారాయణ్ వ్యాస్ | పురావస్తు శాస్త్రం |
| నరేశ్ చంద్ర దేవ్ వర్మ | సాహిత్యం & విద్య |
| నీలేశ్ వినోద్చంద్ర మండలేవాలా | సామాజిక సేవ |
| నూరుద్దీన్ అహ్మద్ | కళలు |
| ఓదువార్ తిరుత్తణి స్వామినాథన్ | కళలు |
| డా. పద్మ గుర్మెట్ | వైద్యం |
| పల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి | వైద్యం |
| పోఖిలా లెక్థెపి | కళలు |
| ప్రభాకర్ బసవప్రభు కోరే | సాహిత్యం & విద్య |
| ప్రతీక్ శర్మ | వైద్యం |
| ప్రవీణ్ కుమార్ | క్రీడలు |
| ప్రేమ్ లాల్ గౌతమ్ | విజ్ఞానం & ఇంజినీరింగ్ |

| | |
|---|---|
| ప్రొసెన్జిత్ ఛటర్జీ | కళలు |
| పున్నియమూర్తి నటేశన్ | వైద్యం |
| ఆర్. కృష్ణన్ (మరణానంతరం) | కళలు |
| ఆర్. వి. ఎస్. మణి | సివిల్ సర్వీస్ |
| రబిలాల్ టుడు | సాహిత్యం & విద్య |
| రఘుపత్ సింగ్ (మరణానంతరం) | వ్యవసాయం |
| రఘువీర్ తుకారాం ఖేడ్కర్ | కళలు |
| రాజస్థపతి కలియప్ప గౌండర్ | కళలు |
| రాజేంద్ర ప్రసాద్ | వైద్యం |
| రామా రెడ్డి మామిడి (మరణానంతరం) | పశుసంవర్ధక రంగం |
| రామమూర్తి శ్రీధర్ | రేడియో ప్రసారం |
| రామచంద్ర గోడ్బోలే & సునీత గోడ్బోలే (ద్వయం) | వైద్యం |
| రతిలాల్ బోరిసాగర్ | సాహిత్యం & విద్య |
| రోహిత్ శర్మ | క్రీడలు |
| ఎస్. జి. సుశీలమ్మ | సామాజిక సేవ |
| సంగ్యుసాంగ్ ఎస్. పొంగెనర్ | కళలు |
| సంత్ నిరంజన్ దాస్ | ఆధ్యాత్మికత |
| శరత్ కుమార్ పాత్ర | కళలు |
| సరోజ్ మండల్ | వైద్యం |
| సతీష్ షా (మరణానంతరం) | కళలు |
| సత్యనారాయణ నువాల్ | వాణిజ్యం & పరిశ్రమ |
| సవితా పునియా | క్రీడలు |
| షఫీ షౌక్ | సాహిత్యం & విద్య |
| శశి శేఖర్ వెంపటి | సాహిత్యం & విద్య |
| శ్రీరంగ దేవబా లాడ్ | వ్యవసాయం |
| శుభా వెంకటేశ అయ్యంగార్ | విజ్ఞానం & ఇంజినీరింగ్ |
| శ్యామ్ సుందర్ | వైద్యం |
| సీమాంచల్ పాత్రో | కళలు |
| శివశంకరి | సాహిత్యం & విద్య |
| సురేశ్ హనగవాడి | వైద్యం |
| స్వామి బ్రహ్మదేవ్ జీ మహారాజ్ | సామాజిక సేవ |
| టి. టి. జగన్నాథన్ (మరణానంతరం) | వాణిజ్యం & పరిశ్రమ |
| తగా రామ్ భీల్ | కళలు |
| తరుణ్ భట్టాచార్య | కళలు |
| టెచి గుబిన్ | సామాజిక సేవ |
| తిరువారూర్ భక్తవత్సలం | కళలు |
| తృప్తి ముఖర్జీ | కళలు |
| వీజినాథన్ కామకోటి | విజ్ఞానం & ఇంజినీరింగ్ |
| వెంపటి కుటుంబ శాస్త్రి | సాహిత్యం & విద్య |
| వ్లాదిమెర్ మెస్విరిష్విలి (మరణానంతరం) | క్రీడలు |
| యుమ్నామ్ జాత్రా సింగ్ (మరణానంతరం) | కళలు |

– బాలచెలిమి డెస్క్




# మాయ కర్ర

అనగనగా ఒక ఊరిలో కావ్య అనే మహిళ ఉండేది. కావ్య ఒక రోజు పనికి వెళ్ళేటప్పుడు ఆమెకు ఒక మెరుస్తున్న కర్ర కనిపించింది. ఆ కర్రకు రెండు డైమండ్ లాంటి బటన్స్ ఉన్నాయి. అప్పుడు ఆమె అనుకోకుండా ఆ బటన్స్ నొక్కింది. దాని తర్వాత నాకు చాలా ఆకలి వేస్తుంది ఇంత వేడిలో చల్లని మామిడికాయలు తింటే ఎలా ఉంటుంది అని అనుకుంటుంది. అప్పుడు ఆ కర్ర మీదికి లేచి చుట్టూ తిరిగింది. అప్పుడు దాన్నుంచి ఒక మెరుపు వస్తుంది. మొదట తను భయపడుతుంది మళ్లీ చూసేసరికి అక్కడ మామిడి కాయలు ఉంటాయి వాటిని తింటుంది. కావ్యకు అది మాయ కర్ర అని అర్థమవుతుంది.

కావ్య మాయ కర్రతో బంగారము, డబ్బు ఆస్తి బాగా సంపాదించింది. అంతటితో ఆగకుండా కావ్య ఆ మాయ కర్రను అత్యాశకు, చెడు పనులకు వాడింది. సరదాకొరకు కుక్కలను మనుషుల లాగా మనుషులను కుక్కల లాగా మార్చింది. అది చూసిన పక్కింటి వాళ్ళు ఒక రోజు కావ్య వాళ్ళ కిటికీ నుండి తొంగి చూస్తే ఆ మాయ కర్ర కనిపించింది. ఆ కర్రను ఎలాగైనా సంపాదించాలని అనుకున్నారు. ఒకరోజు రాత్రి కావ్య పడుకున్న తర్వాత పక్కింటి వాళ్ళు ఆ మాయ కర్రను దొంగతనం చేశారు.

పొద్దున్నే కావ్య ఇల్లు అంతా వెతికింది అప్పుడు పక్కింటి వాళ్ళు వచ్చి నువ్వు ఇన్ని రోజులు అందరిని ఇబ్బంది పెట్టినది చాలు. ఇప్పుడు నిన్ను కుక్క లాగా ఈ మాయ కర్రతో మార్చుతాము అని అంటారు. అప్పుడు కావ్య వద్దు దయచేసి నన్ను కుక్కలాగ మార్చద్దు. ఇంకెప్పుడు నేను తప్పు చేయను అని ప్రాధేయపడింది. దాంతో వాళ్ళు ఆమెను క్షమించి ఆ మాయకర్ర వలన నష్టం ఉందని దానిని తీసుకువెళ్లి ఊరి చివర ఉన్న చెరువులో పడేస్తారు.

– శివ కృతిక
7వ తరగతి, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, చింతకుంట, కరీంనగర్
గైడ్ టీచర్: భాస్కర్ కందుకూరి, m : 94415 57188

# అడవుల తోటమాలి 'మలయన్ టాపిర్'




మలయన్ టాపిర్ (Tapirus indicus) ప్రపంచంలో ప్రస్తుతం జీవించి ఉన్న నాలుగు టాపిర్ జాతుల్లో అతిపెద్దది. ఆసియా ఖండంలో నివసించే ఏకైక టాపిర్ కూడా ఇదే. ఒకప్పుడు ఆగ్నేయాసియాలోని విశాలమైన ఉష్ణమండల అడవుల్లో విస్తారంగా సంచరించిన ఈ జంతువు, ప్రస్తుతం ప్రధానంగా మలేషియా ద్వీపకల్పం, దక్షిణ థాయ్‌లాండ్, మయన్మార్‌లోని కొన్ని ప్రాంతాలు, ఇండోనేషియాలోని సుమత్రా ద్వీపంలోని దట్టమైన వర్షారణ్యాలకు మాత్రమే పరిమితమైంది. మలయన్ టాపిర్ రూపం ప్రకృతిలోని అత్యంత విశిష్టమైన జీవుల్లో ఒకటి. దీని తల, మెడ, కాళ్లు, వెనుక భాగం నలుపు రంగులో ఉండగా, శరీరం మధ్యభాగం తెలుపు లేదా లేత బూడిద రంగులో ఉంటుంది. ఈ ప్రత్యేక రంగుల కలయిక అడవిలోని వెలుతురు–నీడల మధ్య సహజంగా కలిసిపోవడంతో శత్రువులకు ఇది సులభంగా కనిపించదు. పుట్టిన పిల్లల శరీరంపై తెల్లటి చారలు, చిన్న చిన్న మచ్చలు ఉంటాయి. ఇవి అడవిలో దాగి ఉండేందుకు సహాయపడతాయి. ఎనిమిది నుంచి పది నెలల వయస్సు వచ్చిన తరువాత ఈ చారలు మాయమై పెద్ద టాపిర్‌ల ప్రత్యేక నలుపు–తెలుపు రంగు ఏర్పడుతుంది. పెరిగిన మలయన్ టాపిర్ భుజాల వరకు 90 నుంచి 110 సెంటీమీటర్ల ఎత్తు, 1.8 నుంచి 2.5 మీటర్ల పొడవు కలిగి ఉంటుంది. దీని బరువు 250 నుంచి 540 కిలోగ్రాముల వరకు ఉండగా, కొన్నిసార్లు 600 కిలోగ్రాముల వరకు కూడా పెరుగుతుంది. చిన్న తొండాన్ని పోలిన మృదువైన ముక్కుతో ఆకులు, లేత కొమ్మలు, మొగ్గలు, తీగలు, నీటి మొక్కలు, అడవిలో పండే పండ్లను ఆహారంగా తీసుకుంటుంది. పండ్ల విత్తనాలను దూర ప్రాంతాల్లో విసర్జించడం ద్వారా కొత్త మొక్కలు మొలకెత్తేలా చేస్తుంది. అందుకే దీనిని "అడవుల తోటమాలి" అని పిలుస్తారు.

మలయన్ టాపిర్ ప్రధానంగా రాత్రిపూట సంచరిస్తుంది. పగటిపూట చెట్ల నీడలో లేదా నీటి సమీపంలోని చల్లని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకుంటుంది. ఇది అద్భుతంగా ఈదగలదు. ప్రమాదం ఎదురైతే వెంటనే నీటిలోకి దూకి తప్పించుకుంటుంది. దీని వినికిడి, వాసన గ్రహించే శక్తి చాలా ఎక్కువగా ఉండగా, చూపు మాత్రం అంత పదునుగా ఉండదు. సాధారణంగా ఒంటరిగానే జీవించే ఈ జంతువు సంభోగ కాలంలో మాత్రమే జంటగా ఉంటుంది. గర్భధారణ కాలం సుమారు 13 నెలలు. సాధారణంగా ఒక పిల్లకు మాత్రమే జన్మనిస్తుంది. ప్రస్తుతం మలయన్ టాపిర్ తీవ్రమైన ముప్పులను ఎదుర్కొంటోంది. అడవులను వ్యవసాయ భూములుగా మార్చడం, రబ్బరు, ఆయిల్‌పామ్ తోటల విస్తరణ, గనుల తవ్వకాలు, రహదారుల నిర్మాణం, అక్రమ వేట, వాహనాల ఢీకొనడం వంటి కారణాలతో దీని సహజ ఆవాసాలు క్రమంగా నశిస్తున్నాయి. ఈ కారణంగా అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంఘం (IUCN) దీనిని అంతరించిపోతున్న జాతి (Endangered)గా గుర్తించింది. మలయన్ టాపిర్ ఒక అరుదైన వన్యప్రాణి మాత్రమే కాదు, అడవుల ఆరోగ్యాన్ని కాపాడే సహజ సంరక్షకుడు కూడా. విత్తనాల వ్యాప్తి ద్వారా కొత్త అడవుల పెరుగుదలకు తోడ్పడుతూ, జీవవైవిధ్యాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అడవులను సంరక్షించడం, అక్రమ వేటను అరికట్టడం, ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడం ద్వారా మాత్రమే ఈ అరుదైన జాతిని భావితరాలకు అందించగలం. మలయన్ టాపిర్‌ను రక్షించడం అంటే ఒక జంతువును మాత్రమే కాదు, మొత్తం ఉష్ణమండల అటవీ జీవావరణాన్ని సంరక్షించినట్లే.

– సచిన్ కోత్వాల్
m : 97010 01036

కథ

# మూడు కూరగాయల కథ



అనగనగా ఒక ఊరు పేరు దేవరకద్ర. ఆ ఊరిలో ప్రతి బుధవారం సంత జరుగుతుంది. అక్కడ సంతలో మూడు కూరగాయలు టమాట, వంకాయ, క్యారెట్ ఉన్నాయి. అవి ఎప్పుడు స్నేహంగా ఉండేవి. ఐతే ఒకరోజు ఎవరు గొప్ప అంటూ గొడవ పడుతున్నాయి. టమాట అన్నది నేను ఎర్రగా ఉంటాను నన్ను చూడు ఎంత అందంగా ఉన్నానో. నన్ను ప్రతి యొక్క కూరలో వాడుకుంటారు. అందుకే నన్ను ప్రజలు ఎక్కువగా ఇష్టపడతారు. అందుకే నేనే గొప్ప అన్నది టమాట.

వంకాయ అన్నది ఏయ్! నేనే గొప్ప. ఎందుకంటే నా తలపై ఉన్న కిరీటం చూశావా ఎంత అందంగా ఉన్నానో. నన్ను నింపుడు వంకాయ కూరగా చేసుకొని తింటే ఎంతో రుచిగా ఉంటానో. అందుకే నన్ను ప్రజలు ఎక్కువగా ఇష్టపడతారు. అందుకే నేనే గొప్ప అన్నది వంకాయ.

క్యారెట్ అన్నది అదేమి కాదమ్మ నేనే గొప్ప. ఎందుకంటే నన్ను చూడు. నా కలరు చూడు. చూడడానికి ఎంత అందంగా ఉంటానో. నన్ను కూర చేసుకొని తింటారు. చేసుకోకుండా తింటారు. నన్ను తింటే ప్రజల ఆరోగ్యానికి మంచిది. అందుకే మీ ఇద్దరికంటే నేను గొప్ప అన్నది క్యారెట్.

ఈ మూడు కూరగాయలు కలిసి గుమ్మడికాయ వద్దకు వెళ్ళాయి. తమలో ఎవరు గొప్పో చెప్పమన్నాయి. గుమ్మడి కాయ వీరి గొడవను చూసి నవ్వి ఒక్కొక్క కూరగాయకు ఒక్కొక్క ప్రత్యేకమైన పోషకవిలువ కలిగి ఉంటుంది. అన్ని కూరగాయలను సరైన మోతాదులో తీసుకుంటేనే మనుషులు ఆరోగ్యంగా ఉంటారు. కాబట్టి మనమందరము సమానమే అని చెప్పి వాళ్ళని అక్కడి నుండి పంపించి వేసింది. ఈ మూడు కూరగాయలు వాళ్ళ వాళ్ళ తప్పును తెలుసుకొని మన ముగ్గురము సమానమే. ఇకపై గొడవ పడకుండా కలిసిమెలిసి ఉందాం! అంటూ వెళ్ళిపోయాయి.


– జి. మనీషా

8 వ తరగతి

ప్రాథమికోన్నత పాఠశాల, జీనుగురాల, మం. దేవరకద్ర,

జిల్లా మహబూబ్ నగర్

m : 91 90328 44017


**పదాల మేడ సమాధానాలు (పేజి 16):**


**అడ్డం :** 1) నటన, 3) వరి, 4) ఆగు, 5) ఛత్రం, 6) మొక్క, 7) అడపా, 8) దొందు దొందే, 10) పగ, 12) హంగు, 15) కాయ. **నిలువు :** 2) టక్కరి దొంగ, 4) ఆత్రం, 9) గుణపాఠం, 11) దేహం, 13) దొండ, 14) అహం.



చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాలచెలిమి గ్రంథాలయం



# బాల చెలిమి గ్రంథాలయం విద్యార్థుల సృజనాత్మక వికాసానికి చిరునామా

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడం, వారి సృజనాత్మక శక్తిని వెలికితీయడం, రచనా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం వంటి లక్ష్యాలతో ఏర్పాటైన బాల చెలిమి గ్రంథాలయం నేడు అనేక పాఠశాలల్లో జ్ఞానదీపంలా వెలుగొందుతోంది. నిజామాబాద్ జిల్లా పీఎం శ్రీ ఏరుగట్ల ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన బాల చెలిమి గ్రంథాలయం విద్యార్థుల జీవితాల్లో విశేష మార్పును తీసుకొచ్చింది. ఈ గ్రంథాలయం ద్వారా విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకొని, సాహిత్య సృజనలో తమ ప్రతిభను చాటుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో గుర్తింపు పొందుతున్నారు. బాల చెలిమి వ్యవస్థాపకులు శ్రీ వేదకుమార్ గారి ప్రోత్సాహంతో పాఠశాలకు సుమారు రూ. 20,000 విలువైన నాణ్యమైన పుస్తకాలు అందజేయబడ్డాయి. బాలసాహిత్యం, విజ్ఞానశాస్త్రం, జీవిత చరిత్రలు, పర్యావరణం, జానపద కథలు, చరిత్ర, వ్యక్తిత్వ వికాసం వంటి అనేక విభాగాలకు చెందిన ఈ పుస్తకాలు విద్యార్థుల జ్ఞాన పరిధిని విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. పాఠశాల గ్రంథాలయ ఇన్‌చార్జి విద్యార్థులకు గ్రంథాలయంలోని పుస్తకాలను పరిచయం చేస్తూ, క్రమం తప్పకుండా వాటిని చదివేలా ప్రోత్సహిస్తున్నారు. పుస్తక పఠనం అనంతరం కథా చర్చలు, కవితా వాచనాలు, రచనా వ్యాయామాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో భాషా పటిమ, భావ వ్యక్తీకరణ, విశ్లేషణా సామర్థ్యం, సృజనాత్మక ఆలోచనా విధానం గణనీయంగా అభివృద్ధి చెందుతున్నాయి.



ఈ నిరంతర సాధన ఫలితంగా విద్యార్థులు వివిధ సాహిత్య సంస్థలు నిర్వహించిన కథ, కవిత, వ్యాస రచన పోటీలలో అద్భుత విజయాలు సాధించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ నిర్వహించిన కథా, కవితా పోటీలలో ప్రథమ బహుమతులు గెలుచుకోగా, తెలంగాణ సారస్వత పరిషత్ నిర్వహించిన పలు రాష్ట్రస్థాయి పోటీలలోనూ విశేష ప్రతిభ కనబరిచారు. అలాగే సైన్స్ ఫిక్షన్ కథా పోటీలు, తాన (నాటా) అంతర్జాతీయ సాహిత్య పోటీలు మరియు ఇతర జాతీయస్థాయి సాహిత్య పోటీలలో పాల్గొని అనేక బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ విజయాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా, సాహిత్యంపై మరింత ఆసక్తిని కలిగించాయి. ఈ విజయాల వెనుక ప్రధాన ప్రేరణగా నిలిచింది బాల చెలిమి గ్రంథాలయం. పుస్తకాలు కేవలం చదవడానికి మాత్రమే కాకుండా, ఆలోచించడానికి, ప్రశ్నించడానికి, సృజనాత్మకంగా వ్యక్తీకరించడానికి మార్గదర్శకాలని ఈ గ్రంథాలయం విద్యార్థులకు నిరూపించింది. గ్రంథాలయం ద్వారా పాఠశాలలో పఠన సంస్కృతి బలపడటంతో పాటు రచనా సంస్కృతి కూడా వికసించింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో శ్రీ గరిపెల్లి అశోక్ గారి నిరంతర ప్రోత్సాహం, మార్గదర్శకత్వం, అలాగే శ్రీ వేదకుమార్ గారి ఆశీస్సులు, సహకారం విశేషంగా నిలిచాయి. వారి స్ఫూర్తితో ఏరుగట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు సాహిత్య రంగంలో మరిన్ని విజయాలను సాధిస్తూ ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యార్థుల్లో చదివే అలవాటు, ఆలోచించే శక్తి, సృజనాత్మకత, రచనా సామర్థ్యాలను పెంపొందిస్తూ భవిష్యత్ రచయితలను తీర్చిదిద్దే జ్ఞాన కేంద్రంగా బాల చెలిమి గ్రంథాలయం తన సేవలను విజయవంతంగా కొనసాగిస్తోంది.

– ప్రవీణ్ శర్మ

ఇన్‌ఛార్జ్, బాలచెలిమి,

ఏరుగట్ల ఉన్నత పాఠశాల, నిజామాబాద్.

m: 95535 76697

## డా. పత్తిపాక మోహన్‌కు పెండెం జగదీశ్వర్ బాలసాహిత్య పురస్కారం



తెలుగు బాలసాహిత్య అభివృద్ధికి బాలసాహితీ రత్న పెండెం జగదీశ్వర్ అందించిన విశిష్ట సేవలు చిరస్మరణీయమని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ యూటీఎఫ్ భవన్‌లో డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అధ్యక్షతన నిర్వహించిన పెండెం జగదీశ్వర్ స్మారక ఏడవ జాతీయ పురస్కార ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

తెలుగు బాలసాహిత్యంలో పెండెం జగదీశ్వర్ ఎన్నో వినూత్న ప్రయోగాలు చేశారని, తెలంగాణ భాషలో పిల్లల కోసం కథలు రచించిన తొలి రచయితగా విశిష్ట గుర్తింపు పొందారని పేర్కొన్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు విభాగం సహసంపాదకులు, ప్రముఖ బాలసాహితీవేత్త డాక్టర్ పత్తిపాక మోహన్‌కు పెండెం జగదీశ్వర్ బాలసాహిత్య పురస్కారం ఘనంగా ప్రదానం చేశారు. పురస్కారంలో భాగంగా రూ.5,000 నగదు, ప్రశంసాపత్రం, శాలువా అందజేసి సభా వేదికపై ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.

పురస్కార గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ మాట్లాడుతూ, పెండెం జగదీశ్వర్ పేరుతో పురస్కారం అందుకోవడం గౌరవంగా భావిస్తున్నానని, ఇది తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. బాలసాహిత్య వికాసానికి మరింత అంకితభావంతో కృషి చేస్తానని, జగదీశ్వర్ ఆశయాలను సాహిత్య సృష్టి ద్వారా ముందుకు తీసుకెళ్తానని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో మేరెడ్డి యాదగిరి రెడ్డి, మునాస్ వెంకట్, డాక్టర్ పగడాల నాగేందర్, శ్రీ కుకుడాల గోవర్ధన్, శ్రీ మాదగాని శంకరయ్య, శ్రీ పెరుమాళ్ళ ఆనంద్, శ్రీ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, శ్రీ పెందోట సోము, డా. ఉప్పల పద్మ, శ్రీ ఎడ్ల సైదులు, శ్రీ ముక్కామల జానకి రామ్, శ్రీ దాసరి శ్రీరాములు శ్రీ బండారు శంకర్, సాహితీ మేకల చందూరు పక్షాన మద్దోజు సుధీర్ బాబు శ్రీ బాసరాజు యాదగిరి, డా. సాగర్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలల గేయ రచన పోటీలు

ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు - బాలలు సందర్భంగా బాలల గేయ రచన పోటీలు నిర్వహించబడుతున్నాయి. చివరి తేదీ: 10 ఆగస్టు 2026. గేయం: 15 పంక్తులు. విషయాలు: తెలుగు భాష, తెలుగు సంస్కృతి, జీవన విధానం, భారతీయత పట్ల ఆసక్తి, అనురాగం పెంపొందించే అంశాలు. వివరాలకు: 98669 95085.

## నాగభైరవ సాహిత్య పురస్కార విజేతలు ఎంపిక

నాగభైరవ సాహిత్య పీఠం ప్రకటించిన నాగభైరవ సాహిత్య పురస్కారం-2026 విజేతలను వెల్లడించింది. నవల విభాగంలో 'జాను అనే నేను - నా స్నేహితురాళ్లు' రచనకు శ్రీ పేట యుగంధర్, కథాసంపుటి విభాగంలో 'సూర్యకుందురులు'కు శ్రీ మాచిరాజు కామేశ్వరరావు, గేయసంపుటి విభాగంలో 'చిగురింతలు'కు శ్రీ చింతల శ్రీనివాస గుప్త పురస్కారాలకు ఎంపికయ్యారు. విజేతలకు ఆగస్టు 16న (ఆదివారం) ఒంగోలులో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాలు, సన్మానం అందజేయనున్నట్లు అధ్యక్షులు డా. నాగభైరవ ఆదినారాయణ తెలిపారు. (చరవాణి : 9849799711)

## రచయిత్రుల బాలసాహిత్య కథలకు ఆహ్వానం

50 మంది బాలసాహిత్య రచయిత్రుల పిల్లల కథలతో ప్రత్యేక సంకలనం వెలువడనుంది. రెండు పేజీలలోపు సందేశాత్మక కథలను సెప్టెంబర్ 5లోగా పంపాలి. సహకార పద్ధతిలో వెలువడే ఈ సంకలనానికి పంపే కథతో పాటు రూ.500/- పంపవలసి ఉంటుంది. చేతివ్రాత, డీటీపీ, జిరాక్స్ లేదా వాట్సాప్ ద్వారా కథలు పంపవచ్చు. వివరాలకు: 93472 11537, 9010902794, 96035 91577.

## పిల్లల కథలకు ఆహ్వానం

ఉమ్మడి చిత్తూరు జిల్లా రచయితలు పిల్లల కోసం కథలను ఆగస్టు 10లోపు వేమన విజ్ఞాన కేంద్రం, తిరుపతికి పంపాలని నిర్వాహకులు కోరారు. ఎంపికైన కథలను బాలచెలిమి హైదరాబాద్ సహకారంతో కథా సంకలనంగా ప్రచురించనున్నారు. కథలను 9398000686 వాట్సాప్ నంబర్‌కు పంపవచ్చు.

- బాలచెలిమి డెస్క్

# గానకోకిల ఎస్. జానకి

## స్వరమాధుర్యానికి ప్రతిరూపం


భారతీయ సినీ సంగీత చరిత్రలో తన మధుర గానంతో కోట్లాది మంది హృదయాలను గెలుచుకున్న గానకోకిల ఎస్. జానకి (శిష్ట్ల శ్రీరామమూర్తి జానకి) 1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి గుంటూరు జిల్లా (ప్రస్తుత బాపట్ల జిల్లా) రేపల్లె సమీపంలోని పల్లపట్ల గ్రామంలో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు శ్రీరామమూర్తి, సత్యవతి. తండ్రి ఉపాధ్యాయుడిగా, ఆయుర్వేద వైద్యుడిగా సేవలందించారు. ఉద్యోగరీత్యా కుటుంబం కొంతకాలం కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో నివసించింది. చిన్నప్పటి నుంచే సంగీతంపై అపారమైన అభిరుచి పెంచుకున్న జానకి నాదస్వర విద్వాంసుడు పైడిస్వామి వద్ద సంగీతం అభ్యసించారు. బాల్యంలోనే లతా మంగేష్కర్, పి. సుశీల, జిక్కి, పి. లీల పాటలను ఆలపిస్తూ సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. పదొమ్మిదేళ్ల వయసులో మామయ్య సలహాతో చెన్నైలోని ఏవీఎం స్టూడియోలో గాయనిగా చేరిన జానకి, 1957లో విడుదలైన తమిళ చిత్రం “విధియిన్ విలయట్టు” ద్వారా సినీ నేపథ్య గాయనిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. అనంతరం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, ఒడియా, బెంగాలీ, సింహళం, తుళు, సంస్కృతం, ఇంగ్లీష్, జపనీస్ తదితర దాదాపు 20 భారతీయ, విదేశీ భాషల్లో 48 వేలకుపైగా పాటలు ఆలపించి భారతీయ సంగీత చరిత్రలో ఒక అపూర్వ రికార్డును సృష్టించారు. ముఖ్యంగా కన్నడ భాషలో ఆమె అత్యధిక పాటలు పాడారు.



తెలుగు సినీ సంగీత ప్రపంచంలో ఘంటసాల, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, కె.జె. యేసుదాస్, పి.బి. శ్రీనివాస్, వాణీ జయరాం, చిత్ర తదితర ప్రముఖ గాయకులతో కలిసి వేలాది మధుర గీతాలను ఆలపించారు. ముఖ్యంగా ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంతో కలిసి పాడిన అనేక యుగళగీతాలు నేటికీ సంగీతాభిమానులను అలరిస్తూనే ఉన్నాయి. సంగీత దర్శకులు కె.వి. మహదేవన్, జి.కె. వెంకటేష్, ఎం.ఎస్. విశ్వనాథన్, రాజన్-నాగేంద్ర, హంసలేఖ, ఎం. రంగారావు, ఎం.ఎస్. బాబురాజ్, ఇళయరాజా, ఎ.ఆర్. రెహమాన్ తదితర దిగ్గజాలతో కలిసి పనిచేసి భారతీయ సినీ సంగీతానికి ఎన్నో అజరామర గీతాలను అందించారు. ముఖ్యంగా ఇళయరాజా సంగీత దర్శకత్వంలో ఆమె ఆలపించిన పాటలు దక్షిణ భారత సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. జానకి గాత్రంలోని విశిష్టత భావవ్యక్తీకరణ. చిన్నారి స్వరం, వృద్ధురాలి స్వరం, హాస్య పాత్రల గొంతు, జానపద శైలి, శాస్త్రీయ సంగీతం, భక్తిగీతాలు, ప్రేమగీతాలు, విషాదగీతాలు... ఏ భావాన్నైనా సహజంగా తన స్వరంలో పలికించగలిగిన అరుదైన గాయని ఆమె. కట్టుకథలు చెప్పి నేను కవ్విస్తే, గోవుల్లు తెల్లన గోపయ్య నల్లన, చిన్నారి పొన్నారి కిట్టయ్య, వెన్నెల్లో గోదారి అందం, మేఘమా దేహమా, ఆకాశం ఏనాటిదో వంటి ఎన్నో పాటల్లో ఆమె గాత్ర వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఐదు తరాల కథానాయికలకు తన స్వరాన్ని అందించిన ఏకైక గాయని అనే అరుదైన గౌరవం కూడా ఆమెకే దక్కింది. నేపథ్య గాయనిగా మాత్రమే కాకుండా సంగీత దర్శకురాలిగానూ ఆమె తన ప్రతిభను చాటుకున్నారు. ఉషాకిరణ్ మూవీస్ నిర్మించిన ‘మౌన పోరాటం’ చిత్రానికి సంగీత దర్శకత్వం వహించి మహిళా సంగీత దర్శకురాలిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. భక్తి సంగీతంపైనా ఆమెకు అపారమైన ఆసక్తి ఉండేది. శ్రీకృష్ణుడు, షిరిడీ సాయిబాబా, మీరాబాయి భక్తిగీతాలను ఆలపించి అనేక సంగీత ఆల్బమ్‌లను విడుదల చేశారు.

తన విశిష్ట గాన సేవలకు గుర్తింపుగా ఎస్. జానకి నాలుగు జాతీయ చలనచిత్ర పురస్కారాలు, పది నంది పురస్కారాలు, కేరళ రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు, తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డులు, ఒడిశా రాష్ట్ర అవార్డు, అనేక జీవిత సాఫల్య పురస్కారాలు అందుకున్నారు. మైసూరు విశ్వవిద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. తమిళనాడు ప్రభుత్వం ‘కళైమామణి’ బిరుదుతో సత్కరించింది. 2013లో భారత ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని, దక్షిణ భారత కళాకారులకు తగిన గుర్తింపు లభించడం లేదనే అభిప్రాయంతో ఆమె వినయపూర్వకంగా తిరస్కరించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దాదాపు ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన సంగీత ప్రస్థానానికి 2016లో స్వచ్ఛందంగా వీడ్కోలు పలికిన జానకి, అనంతరం చెన్నైలో ప్రశాంత జీవితం గడిపారు. వయోభారంతో ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో చికిత్స పొందుతూ 2026 జూలై 11న కర్ణాటక రాష్ట్రంలోని మైసూరులో అపోలో బీజీఎస్ ఆసుపత్రిలో 88 సంవత్సరాల వయస్సులో కన్నుమూశారు. ఆమె మరణం భారతీయ సంగీత ప్రపంచానికి తీరని లోటుగా మిగిలింది. అనంతరం మైసూరు సమీపంలోని కుటుంబ వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్. జానకి ఆలపించిన వేలాది పాటలు తరతరాల సంగీతాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఆమె స్వరం మధుర సంగీతానికి ప్రతీకగా, భారతీయ సినీ సంగీత చరిత్రలో శాశ్వతంగా మార్మోగుతూనే ఉంటుంది. గానకోకిల ఎస్. జానకి భారతీయ సంగీత ప్రపంచానికి అందించిన సేవలు ఎన్నటికీ మరువలేనివి. ఆమె గానం భావితరాలకు స్ఫూర్తిగా నిలిచి, సంగీతం ఉన్నంతకాలం ఆమె పేరు చిరస్మరణీయంగా వెలుగొందుతూనే ఉంటుంది.

– సువేగా




Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

**BALA CHELIMI,** Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026



# బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక
ప్రచురణలు



## 46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100

### తెలంగాణ బడి పిల్లల కథలు
10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు
18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ**
హైదరాబాద్ (Regd. 720/1982)

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

SCAN & PAY

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com